సోమవారం 9-1-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 289



SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

వర్తమానమే జీవితం



మంచి మాట

మనిషి బతకాల్సింది గతంలోనో, భవిష్యత్తులోనో కాదు వర్తమానంలో. కానీ శోచనీయంగా చాలమంది గతంలోనో, భవిష్యత్తులోనో బతుకుతూ ఉంటారు. గతంలో జరిగిన వాటిని తలుచుకుంటూ వర్తమానాన్ని గడిపేస్తూ ఉంటారు. భవిష్యత్తులో ఇవి చేద్దాం, అవి చేద్దాం అనుకుంటూ వర్తమానాన్ని జారవిడుచుకుంటూ ఉంటారు. ఈ తీరు పెనుతప్పు మాత్రమే కాదు, బతుకును గుట్టుగా కాల్చేసే కనిపించని నిప్పు కూడా.

'మనలో చాలమంది వర్తమానంలో పూర్తిగా ఉండరు. ఎందుకంటే తమకు తెలియకుండానే వాళ్లు ఈ క్షణం కన్నా తరువాతి క్షణం ముఖ్యమైందని నమ్ముతారు. అలా ఉంటే నువ్వు నీ పూర్తి జీవితాన్ని కోల్పోతావు...' అని జర్మన్ తాత్విక అధ్యాపకుడు ఎక్‌హార్ట్ టోల్ చెబుతారు. ఒక మనిషి వర్తమానంలో బతకక పోవడం అనే మానసిక దోషానికి విశ్వాసం అనేది లేకపోవడం ప్రధాన కారణం.

ఏ వ్యక్తికైనా కాలం మీద, ప్రయత్నాల మీద విశ్వాసం ఉండాలి. అష్టావక్రగీత ఒక సందర్భంలో విశ్వాసాన్ని అమృతం అంటూ 'విశ్వాసామృతాన్ని తాగి సుఖివిగా ఉండు' అని మనిషికి ముఖ్యమైన సూచనను ఇచ్చింది. సుఖంగా ఉండాలంటే మనిషికి విశ్వాసం అనేది ఉండాలి; ముఖ్యంగా ఆత్మవిశ్వాసం ఉండాలి.'నిన్ను నువ్వు విశ్వసించడం విజయంలోని తొలి రహస్యం' అని గౌతమ బుద్ధుడు తెలియజెప్పాడు.

వర్తమానంలో ఉన్న మనిషి తన హృదయపు లోతుల్లోకి వెళ్లి తనను తాను కనుక్కోవాలి. అలా తనను తాను కనుక్కోవాలంటే మనిషి గతంలోనో, భవిష్యత్తులోనో పడిపోతూ ఉండకూడదు. మనిషి వర్తమానంలో మసలాలి; మనిషి వర్తమానంతో మెలగాలి. హృదయపు లోతుల్లోకి వెళ్లి తనను తాను కనుక్కోగలిగిన వ్యక్తి మానసిక దోషాలకు అతీతంగా వర్తమానంలో వసిస్తాడు.

దట్టమైన చీకటిలో ఎగిరే లేదా ఎగరగలిగే పక్షికి ఆత్మవిశ్వాసం ఉంటుంది. తనకు ఆత్మవిశ్వాసం ఉంది అనే భావన పక్షికి ఉండకపోవచ్చు. అంతేకాదు, చీకట్లో ఎగిరే పక్షికి గతం గురించి, భవిష్యత్తు గురించి తలపులు ఉండవు. వర్తమానంలో పక్షి ఎగురుతోంది; వర్తమానంలో ఎంత చీకటి ఉన్నా అంత చీకటిలోనూ పక్షి ఎగరగలుగుతుంది. ఎందుకంటే పక్షి వర్తమానంలో బతుకుతూ ఉంటుంది. పక్షి మనిషికి ఆదర్శం కావాలి.

'మనిషి బాధపడడం సుఖం అనుకుంటున్నాడు, సుఖపడడానికి బాధపడుతున్నాడు' కాబట్టే వర్తమానంలో ఉండీ గతంలోకో, భవిష్యత్తులోకో దొర్లిపోతూ ఉంటాడు. మనిషి ఈ స్థితికి బలి అయిపోకూడదు. మనిషి ఈ స్థితిని జయించాలి.'గతంలోని శోకంతో పనిలేదు; భవిష్యత్తు గురించి చింతన చెయ్యక్కర్లేదు; వర్తమానంలోని పనుల్లో నిమగ్నం అవుతారు వివేకం ఉన్నవాళ్లు' అని విక్రమార్క చరిత్ర చక్కగా చెప్పింది. గతంలో సంతోషం ఉండి ఉన్నా, శోకం ఉండి ఉన్నా అవి ఇప్పటివి కావు కాబట్టి గతాన్ని తలుచుకుంటూ ఉండిపోతే మన వర్తమానం వృథా అయిపోతుంది. వర్తమానం వృథా అయిపోతే భవిష్యత్తు కూడా వృథా అయిపోతుంది. గతం గడిచిపోయింది కాబట్టి, వర్తమానం వచ్చేసింది కాబట్టి వర్తమానంలో ఉన్న మనిషి గతంలోనో, భవిష్యత్తులోనో కాకుండా వర్తమానంలోనే ఉండాలి.

'నీ హృదయం ఒక సముద్రం అంతటిది. వెళ్లి నిన్ను నువ్వు కనుక్కో మరుగున ఉన్న దాని లోతుల్లో' అని పార్సీ తాత్విక కవి రూమీ చెప్పారు.

గతంలో భవిష్యత్తు ఉండదు. భవిష్యత్తు గతంలా ఉండకూడదు. మనిషి వర్తమానంలో బతకడం నేర్చుకోవాలి. వర్తమానంలో బతకడం నేర్చుకున్న మనిషి భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుంది. ఉన్నతమైన భవిష్యత్తు కోసం, ఉన్నతమైన జీవితం కోసం మనుషులమైన మనం వివేకంతో వర్తమానంలో నిమగ్నమవ్వాలి.

– శ్రీకాంత్ జయంతి

దైవ ఆదేశాలను పాటించి తీరాలి

ఇస్లాం వెలుగు

'విశ్వసించిన ప్రజలారా! మద్యం, జూదం, బలిపీఠాలు, పాచికల జోస్యం – ఇవన్నీ అసహ్యకరమైన షైతాన్ పనులు. వీటికి దూరంగా ఉండండి. మీ జీవితం సార్థకం అవుతుంది' (ఖురాన్ 5 – 90) ఇందులో మద్యనిషేధానికి సంబంధించిన స్పష్టమైన ఆదేశం ఉంది. మద్యపానం అత్యంత నీచమైన, అసహ్యకరమైన, దుర్మార్గమైన రాక్షసకార్యమని, దానికి దూరంగా ఉండక పోతే జీవితాలు సర్వనాశనమవుతాయని దైవం హెచ్చరించాడు. ఈ హెచ్చరికను పెడచెవినపెట్టి నిషేధాజ్ఞను ఉల్లంఘిస్తే దైవ శిక్ష కోసం ఎదురు చూడవలసిందే. దురదృష్టవశాత్తూ ఈనాడు చాలామంది దైవాదేశాలను, దైవప్రవక్త వారి హితోపదేశాలను పట్టించుకోవడంలేదు. దైవాదేశాలు, ప్రవక్త హితోపదేశాలు చెవిన పడగానే శిరసావహించడం, ఆదేశాలను ఆచరణలో పెట్టడం దైవ విశ్వాసుల లక్షణం.



దాదాపు 1450 సంవత్సరాల క్రితం మద్యనిషేధానికి సంబంధించిన ఈ ఆదేశం అవతరించినప్పుడు,'ఇక నుండి మద్యం నిషేధించబడిందని, దాన్ని తాగడం గాని, క్రయవిక్రయాలు జరపడంగాని నిషిద్ధమని ప్రవక్త (స) వారు మదీనాలో చాటింపు వేయించారు.

ఈ ప్రకటన విన్న వెంటనే మదీనావాసులు తమ ఇళ్ళల్లో ఉన్న సారాయిని వీధుల్లో కుమ్మరించారు. ఆ సమయంలో మద్యం సేవిస్తున్నవారు తమ నోటి దగ్గరి గ్లాసుల్ని విసిరికొట్టారు. అప్పటికే తాగినవారు నోట్లోకి వేళ్ళు జొప్పించి వాంతులు చేసుకున్నారు. ఈ విధంగా దైవాదేశాలను, దైవప్రవక్త వారి హితవులను తు.చ. తప్పక పాటించి తమ విశ్వాసం అచంచలమని చాటుకున్నారు.

మానవులు దైవానికి భయపడాలి. ఆయన నిషేధించిన వాటి జోలికి పోకుండా, ధర్మమార్గంలో నడుస్తూ, బాధ్యతాభావంతో, జవాబుదారీతనంతో జీవితం గడిపితే ఈనాడు మానవ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అన్ని రుగ్మతలూ, దుర్మార్గాలూ అంతమవుతాయి. సమాజం శాంతి భద్రతలతో, విలువలతో, సుభిక్షంగా అలరారుతుంది.


– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

గురువాణి

సంస్కార వైభవం



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



రఘు మహారాజు పరాక్రమవంతుడు. కారణజన్ముడు. ఆయన విశ్వజిత్ అనే ఒక యాగం చేసాడు. భూమండలమంతా దిగ్విజయ యాత్ర చేసి తీసుకొచ్చిన ధనాన్నంతటినీ కొద్దిగా కూడా ఉంచుకోకుండా ఆ యాగ సమయంలో పూర్తిగా దానం చేసేసాడు. రఘువంశ రచన చేసిన కాళిదాసు –''త్యాగాయ సమృతార్థానాం సత్యాయ మితభాషిణామ్ యశసే విజిగీషూణాం ప్రజాయై గృహమేధినామ్'' అంటాడు. రఘు మహారాజు ఎందుకు సంపాదించాడంటే.. పదిమందికి దానం చేయడానికి–అని, ఎక్కడ మాట జారితే చటుక్కున అసత్య దోషం వస్తుందేమోనని ఆయనకు అన్నీ తెలిసి ఉన్నా ఎక్కువ మాట్లాడేవాడు కాదట, దండయాత్రలు చేసేది కేవలం తన పరాక్రమాన్ని చాటడానికి తద్వారా కీర్తికోసమేనట, గృహస్థాశ్రమంలో ఉన్నది ధర్మబద్ధంగా సంతానం పొందడానికట.. అదీ రఘువంశ గొప్పదనం అంటాడు.

వరతంతు మహాముని శిష్యుడు కౌత్సుడు. విద్యాభ్యాసం పూర్తయిన పిమ్మట గురువుగారికి దక్షిణ ఇవ్వాలని వెళ్ళాడు. 'నాయనా! నీవు నాకేమీ దక్షిణ ఇవ్వక్కరలేదు. నీ క్రమశిక్షణ, మంచితనం నాకు నచ్చాయి. సంతోషంగా వెళ్ళి నీ ధర్మాలను నీవు సక్రమంగా నిర్వర్తించు' అంటూ ఆశీర్వదించినా... దక్షిణ ఇస్తానని పట్టుపట్టి అడగమన్నాడు. హఠం చేస్తున్న శిష్యుడి కళ్లు తెరిపించాలని... 'నా వద్ద 14 విద్యలు నేర్చుకున్నావు. కాబట్టి 14 కోట్ల సువర్ణ నాణాలు ఇవ్వ చాలు.'' అన్నాడు. బ్రహ్మచారి అంత ధనం ఎక్కడినుంచి తీసుకురాగలడు? పని సానుకూలపడొచ్చనే ఆశతో నేరుగా రఘుమహారాజు దగ్గరికి వెళ్ళాడు. స్నాతక వ్రతం పూర్తిచేసుకొని ఒక శిష్యుడు తన సహాయం కోరి వచ్చాడని తెలుసుకున్న రఘు మహారాజు అతిథికి అర్ఘ్యం ఇవ్వడానికి మట్టి పాత్రతో వచ్చాడు. అది చూసి శిష్యుడు హతాశుడయ్యాడు. దానం ఇచ్చే సమయంలో అర్ఘ్యం ఇవ్వడానికి బంగారు పాత్రకూడా లేనంత దీనస్థితిలో ఉన్న రాజు తనకు ఏపాటి సాయం అందించగలడని సంశయిస్తుండగా.. సందేహించకుండా ఏం కావాలో అడగమన్నాడు మహారాజు.

కౌత్సుడు విషయం విశదీకరించాడు. సాయం కోరి నా దగ్గరకు వచ్చినవాడు ఖాళీ చేతులతో వెడితే నా వంశానికే అపకీర్తిని తెచ్చినవాడనవుతాను. నాకు రెండు మూడు రోజుల వ్యవధి ఇవ్వు. అప్పటివరకు అగ్నిశాలలో నిరీక్షించమన్నాడు. అంత ధనం పొందడం కేవలం కుబేరుడివద్దే సాధ్యమవుతుందనిపించి కుబేరుడిపై దండయాత్రకు రథం, ఆయుధాలను సమకూర్చుకొని మరునాటి ఉదయం బయల్దేరడానికి సిద్ధమయ్యాడు. తీరా బయల్దేరే సమయంలో కోశాధికారి వచ్చి 'మహారాజా! తమరు యుద్ధానికి వస్తున్న విషయం తెలుసుకొని కుబేరుడు నిన్న రాత్రి కోశాగారంలో కనకవర్షం కురిపించాడు– అని చెప్పాడు. దానినంతా దానమివ్వడానికి మహారాజు సిద్ధపడగా కౌత్సుడు..'నాకు కేవలం అడిగినంత ఇస్తే చాలు. నేను బ్రహ్మచారిని. మిగిలినది నాకు వద్దు' అన్నాడు. నీకోసమే వచ్చింది కాబట్టి అది మొత్తం నీకే చెందుతుంది' అంటాడు మహారాజు... అదీ ఒకనాటి మన సంస్కార వైభవం. అదీ వినయ లక్షణం.

సువార్త

నీకున్న దానినే సౌభాగ్యమయంగా మార్చగల దేవుడు

నీవు చూచుచున్న ఈ దేశమును నీకు సదాకాలము ఇచ్చెదను (ఆది 13:15). క్రైస్తవ్యంలో విశ్వాసానికి చాలా పెద్దపీట ఉంది. మానవ శరీరం శ్వాస లేకపోతే ఎలా బతుకలేదో విశ్వాసం లేకపోతే ఆధ్యాత్మిక జీవితాన్ని కొనసాగించలేము. విశ్వాస నేత్రాలతో నీవేదైతే చూస్తావో దానిని ఖచ్చితంగా కైవసం చేసుకుంటావు. దేవుని పరిధిలో విశ్వాసి దృష్టికి చాలా విలువ ఉంది. విశ్వాసం ద్వారా కృపచేతనే మనిషికి రక్షణ వచ్చింది. ప్రతి దినము విశ్వాసి చూపు, ధ్యాస, దృష్టి వేటిపై ఉందో వాటినే వాస్తవిక జీవితంలో అనుభవిస్తాడు. నిత్యుడైన దేవుని ఆశ్రయించినవారు ఈ లోకంలో విశ్వాసపు చూపు కలిగియుంటారు. జీవాధిపతియైన దేవుణ్ణి తెలుసుకుని ప్రతి ఒక్కరూ వెలిచూపును కలిగియుంటారు. వెలిచూపు అనగా 'చూడగానే కావాలనుకోవడం... ఆలోచనా రహితంగా ఏదిపడితే అది కోరుకోవడం'.

పరిశుద్ధ గ్రంథంలో విశ్వాసులకు తండ్రిగా అబ్రాహాము పిలువబడ్డాడు. దేవుని పిలుపు ద్వారా అబ్రాహాము కల్దీయ దేశంనుండి బయటకు వచ్చినప్పుడు తన తమ్ముడైన లోతు కూడా బయటకు వచ్చి ప్రయాణాన్ని ప్రారంభించాడు. దేవుడు ఇద్దరిని ఆశీర్వదించాడు. ఒకరోజు వారి గొర్రెల కాపరులకు కలహం వచ్చినప్పుడు 'ఏది కావాలో కోరుకో' అనే ఎంపిక చేసుకొనే అవకాశం లోతుకు ఇచ్చారు. చూడడానికి పచ్చగా ఉన్నదాన్ని, తనకు అనుకూలంగా ఉంటుందనుకొనే సొదొమ గొమొఱ్ఱా ప్రాంతాలనే కోరుకున్నాడు. సస్యశ్యామలంగా ఉన్నదానిని అబ్రాహాము కోసం కించిత్తు కూడా ఆలోచించకుండా ఆశపడ్డాడు. ఆ సందర్భంలో దేవుడు అబ్రాహాము తో 'నీకు కలిగినదానినే నేను ఆశీర్వదిస్తాను' అన్నాడు. ఆ మాట విశ్వాసవీరుడైన అబ్రాహాముకు చాలా ఊరటనిచ్చింది.





నీ కుటుంబ సభ్యుడో, నీకు బాగా కావలసినవారో, నీ బంధువో మంచివన్నీ వారు తీసుకొని వ్యర్థమైన వాటిని నీకు వదిలేశారా? అందరూ అన్నీ మంచివాటిని అనుభవిస్తే నేను, నా సంతానం ఎప్పుడూ ప్రయోజన రహితమైన వాటిని పొందుకుంటున్నామనే బాధ నీలో ఉందా? అయితే విను! ఆనాడు అబ్రాహాము సేవించిన దేవుడే నీకును తోడైయున్నాడు. లోతు కోరుకున్నదంతా ఒకనాడు బుగ్గిపాలైపోయింది. అగ్నికీలలలో కాలిపోయింది. అబ్రాహామునకు ఉన్నదే శ్రేష్ఠమైన దేశంగా మలచబడింది. దేవుడు అర్థాంతరంగా నిన్ను వదిలిపెట్టే వాడు కాదు. శూన్యంలో సమస్తం సృష్టించినవాడు. నీకున్న దానినే సౌభాగ్యమయంగా మార్చగలడు. నీవు చెయ్యాల్సింది నీకున్నవాటిని బట్టి ఆయన్ను మనసారా స్తుతించడమే! క్రీస్తు నీకున్న వాటినే ఆశీర్వదిస్తాడు (ఎఫెసీ 3:20).

– డా. జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్


సినిమా

అలా.. వెనక్కి వెళదామా!


























2023లో ఉన్నప్పుడు 40, 50, 60 ఏళ్లు... అంతకుమించి వెనక్కి వెళ్లే అవకాశం వస్తే...? రియల్ లైఫ్‌లో సాధ్యం కాకపోవచ్చు. కానీ రీల్ లైఫ్‌లో ఏదైనా సాధ్యమే. కాలం వెనక్కి వెళ్లొచ్చు.. ముందుకూ వెళ్లొచ్చు. ఇప్పుడు కాలం వెనక్కి వెళ్లే కథలు వెండితెరపైకి రావడానికి రెడీ అవుతున్నాయి. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.

స్టూవర్టుపురం దొంగగా ముద్రపడిన టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా రూపొందుతున్న సినిమా 'టైగర్ నాగేశ్వరరావు'. హీరో రవితేజ టైటిల్ రోల్‌లో వంశీ దర్శకత్వంలో అభిషేక్ నామా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. స్టూవర్టుపురంలో 1970–1980 కాలంలో చోటుచేసుకున్న ఘటనల ఆధారంగా రూపొందుతున్న చిత్రం ఇది. వీలైనంత త్వరగా ఈ చిత్రం పూర్తి చేసి ఈ ఏడాదే థియేటర్స్‌లోకి తీసుకురావాలనుకుంటున్నారు మేకర్స్. ఇక పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం హీరోగా చేస్తున్న చిత్రాల్లో 'సలార్' ఒకటి. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 1970 బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందన్న టాక్ ఆల్రెడీ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తున్న సంగతి తెలిసిందే. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న 'సలార్' చిత్రం ఈ ఏడాది సెప్టెంబరు 28న విడుదల కానుంది. మరోవైపు రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రామ్‌చరణ్ క్యారెక్టర్‌లో 'షేడ్స్' ఉంటాయి. రామ్‌చరణ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. తండ్రి పాత్ర సన్నివేశాలన్నీ 1960–1970 బ్యాక్‌డ్రాప్‌కి సంబంధించినవని తెలిసింది. ఐఏఎస్ ఆఫీసర్ల నేపథ్యంలో పొలిటికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమాను 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్నారు. ఇంకోవైపు అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న 'పుష్ప' చిత్రకథ 1990 బ్యాక్‌డ్రాప్ నుంచే ఆరంభం అవుతుంది. రెండు భాగాల ఈ సినిమాలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' గత ఏడాది డిసెంబరు 19న విడుదలై సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'పుష్ప' రెండో భాగం 'పుష్ప: ది రైజ్' నిర్మాణంలో ఉంది. ఈ సినిమాకు కూడా 1990 బ్యాక్‌డ్రాప్ ఉంటుందని స్పష్టంగా తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది చివర్లో రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఈ వేసవిలో థియేటర్స్‌లో ఆడియన్స్‌కు 'దసరా' చూపేందుకు రెడీ అవుతున్నారు హీరో నాని. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని హీరోగా ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. 1980–1990 బ్యాక్‌డ్రాప్‌లో తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనుల పరిసర ప్రాంతాల్లో ఉన్న ఓ గ్రామం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని తెలిసింది. ఆ గ్రామంలో నెలకొన్న పరిస్థితులను ధరణి (నాని) ఏ విధంగా పరిష్కరించాడు, వెన్నెల (ఇందులో హీరోయిన్ కీర్తీ సురేష్ పాత్ర)తో అతని లవ్‌స్టోరీ ఏమైంది? అన్నదే 'దసరా' ప్రధాన కథాంశం. మరోవైపు 'డెవిల్' సినిమా కోసం 1945వ కాలం నాటి బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్‌గా మారిపోయారు కల్యాణ్ రామ్. స్వాతంత్య్రం రాకముందు బ్రిటిష్‌వాళ్ల పరిపాలించిన మద్రాస్ ప్రెసిడెన్సీలో జరిగిన కొన్ని రహస్య అంశాల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి సంబంధించి ఎవరికీ తెలియని ఓ రహస్యాన్ని ఛేదించడానికి గూఢచారిగా కల్యాణ్ రామ్ ఏం చేశారు? అన్నదే 'డెవిల్' కథాంశం. నవీన్ మేడారం దర్శకత్వంలో అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాదే థియేటర్స్‌లోకి రానుంది. ఇంకోవైపు 'హరోం హర' అంటున్నారు హీరో సుధీర్‌బాబు. జ్ఞాన సాగర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న చిత్రం ఇది. 'ది రివోల్ట్' అనేది క్యాప్షన్. సుమంత్. జి నాయుడు నిర్మిస్తున్న ఈ సినిమా 1989 నాటి కుప్పం నేపథ్యంలో సాగుతుంది. యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో పాటు ఆధ్యాత్మిక అంశాలతో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు. ఇక ప్రస్తుతం 'విరూపాక్ష' సినిమాలో హీరోగా నటిస్తున్నారు సాయిధరమ్ తేజ్. 1990 నేపథ్యంలో ఓ ఫారెస్ట్ బేస్ట్ విలేజ్‌లో సాగే థ్రిల్లర్ సినిమా ఇది. మూఢ నమ్మకాలు, సైన్స్, ఆధ్యాత్మిక అంశాలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని టాక్. కార్తీక్ దండు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 21న రిలీజ్ కానుంది.

ఈ చిత్రాలే కాదు... 1990ల నేపథ్యంలో రూపొందుతోన్న మరికొన్ని చిత్రాలు ప్రేక్షకులను అలరించేందుకు రెడీ అవుతున్నాయి.

తమిళ ఇండస్ట్రీలోనూ కొన్ని సినిమాలు ఉన్నాయి. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'భారతీయుడు' సినిమాకు సీక్వెల్‌గా వీరి కాంబినేషన్‌లోనే ప్రస్తుతం 'ఇండియన్ 2' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రధానంగా స్వాతంత్య్రానికి పూర్వం అంటే 1920–1930 నేపథ్యంలో సాగుతుందని తెలిసింది. ఇక ధనుష్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియన్ ఫిల్మ్ 'కెప్టెన్ మిల్లర్'ది 1930–1940 బ్యాక్‌డ్రాప్ అని చిత్ర యూనిట్ ఆల్రెడీ ప్రకటించింది. అరుణ్ మాదేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కన్నడ ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్, సందీప్ కిషన్ కీ రోల్స్ చేస్తున్నారు. ఈ చిత్రాలే కాదు.. దర్శకుడు వెట్రిమారన్‌తో సూర్య కమిట్ అయిన 'వాడివాసల్', శివ దర్శకత్వంలో సూర్య చేస్తున్న 42వ సినిమాలు కూడా గతంలోకి తీసుకెళ్లేవే.

ఈ బ్యాక్‌డ్రాప్ అంటే బొమ్మ హిట్టే..!

1990 బ్యాక్‌డ్రాప్ అంటే బొమ్మ హిట్టే అని గత ఏడాది బాక్సాఫీస్ లెక్కలు చెబుతున్నాయి. హిట్ రిపీట్ అయితే సినిమా ఇండస్ట్రీ బాగుంటుంది కాబట్టి.. రిపీట్ అవ్వాలని కోరుకుంటుంటారు. గత ఏడాది తెలుగులో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచి, బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ. 1300 కోట్ల గ్రాస్‌ను వసూలు చేసిన 'ఆర్ఆర్ఆర్' సినిమా 1920 బ్యాక్‌డ్రాప్‌లో రూపొందింది. ఇక సుమారు 90 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్‌ను రాబట్టి సూపర్‌హిట్‌గా నిలిచిన 'సీతారామం' చిత్రకథ 1964–1985 బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుందన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాలే కాదు... బాక్సాఫీస్ వద్ద రూ. 1100 కోట్లు రాబట్టిన 'కేజీఎఫ్: ఛాప్టర్ 2 (1980 నేపథ్యంలో...). రూ. 400 కోట్లకు పైగా వసూలు చేసిన కన్నడ బ్లాక్‌బస్టర్ 'కాంతార' (కథ 1847లో స్టార్ట్ అయినా మేజర్ కథాంశం, స్క్రీన్ ప్లే..1990 బ్యాక్‌డ్రాప్‌లోనే సాగుతుంది), హిందీలో రూ. 300 కోట్లకు పైగా వసూలు చేసిన సూపర్‌హిట్ మూవీ 'ది కశ్మీరీ ఫైల్స్' (స్క్రీన్ ప్లే 2020లో స్టార్ట్ అయినా... కథ మేజర్‌గా 1989–1990 నేపథ్యంలోనే సాగుతుంది) కొన్నేళ్లు వెనక్కి తీసుకెళ్లే చిత్రాలే కావడం విశేషం. ఈ జాబితాలో మరికొన్ని సినిమాలు కూడా ఉన్నాయి.



● వివేక్, టీజీ విశ్వప్రసాద్, రవితేజ, శ్రీలీల, కృతి, నక్కిన త్రినాథరావు, భీమ్స్

ఇలాంటి కంగ్రాట్స్ ఇంకా వినాలి

– రవితేజ

''ధమాకా' చిత్రం బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అవడం చాలా ఆనందంగా ఉంది. మా సినిమాని బాగా ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని హీరో రవితేజ అన్నారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రవితేజ, శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'ధమాకా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ–అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకాలపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 23న రిలీజై, వంద కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ 'ధమాకా 101 కోట్ల మాసివ్ సెలబ్రేషన్'ని నిర్వహించింది. ఈ వేడుకలో మేకర్స్, మీడియా ప్రతినిధుల చేతుల మీదుగా చిత్ర యూనిట్‌కు మొమెంటోలు అందించారు. అనంతరం రవితేజ మాట్లాడుతూ– ''విశ్వప్రసాద్‌గారు, వివేక్ కూచిభొట్లగారికి బిగ్ కంగ్రాట్స్. అలాగే త్రినాథరావు, రచయిత ప్రసన్న, శ్రీలీలకి అభినందనలు.. ఇలాంటి కంగ్రాట్స్ ఇంకా వింటూనే ఉండాలి. సంగీత దర్శకుడు భీమ్స్ ఇలాగే ఇరగదీసేయాలి'' అన్నారు. ''ధమాకా' కథకు ఓంకారం చుట్టిన ప్రసన్నకి, ఆయనకి సపోర్ట్‌గా నిలబడిన మరో రచయిత సాయి కృష్ణకి థ్యాంక్స్. ఈ కథని తొలుత విని ఓకే చేసిన వివేక్ గారికి కృతజ్ఞతలు. ఈ ప్రాజెక్ట్‌లో భాగమైన రవితేజ, శ్రీలీలకి థ్యాంక్స్'' అన్నారు త్రినాథరావు నక్కిన. ''ధమాకా'ని బ్లాక్ బస్టర్ చేసిన ఆడియన్స్‌కి థ్యాంక్స్'' అన్నారు టీజీ విశ్వప్రసాద్, సహనిర్మాత వివేక్ కూచిభొట్ల. ''నా కెరీర్ బిగినింగ్‌లో రవితేజగారు నాకు బిగ్ బ్లాక్ బస్టర్ ఇచ్చారు'' అన్నారు శ్రీ లీల.

విజయవాడ నేపథ్యంలో...



● టీనా, సుహాస్

'కలర్ ఫోటో' ఫేమ్ సుహాస్ హీరోగా నటించిన చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. ఈ చిత్రంతో షణ్ముఖ ప్రశాంత్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. టీనా శిల్పరాజ్ హీరోయిన్. మనోహర్ గోవిందస్వామి సమర్పణలో లహరి ఫిల్మ్స్‌తో కలిసి చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్‌పై అనురాగ్, శరత్, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 3న విడుదలకానుంది. ఈ సినిమా చూసిన నిర్మాత అల్లు అరవింద్ తన గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నారు. ''విజయవాడ నేపథ్యంలో సాగే హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ఇందులో ఇబ్బందులు పడే రచయితగా సుహాస్ కనిపించనున్నాడు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ ఆర్. శాకమూరి, సంగీతం: శేఖర్ చంద్ర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సూర్య చౌదరి, క్రియేటివ్ ప్రొడ్యూసర్స్: ఉదయ్–మనోజ్.


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 289

సోమవారం 9-1-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వైదొలిగిన ఒసాకా

ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు జపాన్‌కు చెందిన మాజీ విజేత దూరం - 12లో



కొత్త ఏడాది.. కొత్త మార్పులు

బ్యాంక్ లాకర్ నిబంధనలు మారాయ్.. ఫండ్స్ కేవైసీలో మార్పులు - 13లో



మరిన్ని 'జోషి మఠ్'లు

ఉత్తరాఖండ్‌లోని జోషి మఠ్‌లో ఇళ్లకు పగుళ్లు వచ్చినట్లే.. నైనిటాల్, ఉత్తరకాశి, చంపావత్‌కూ ముప్పు ఉందని హెచ్చరిస్తున్నారు.

వివరాలు 6లో ▸



దూసుకొచ్చిన ట్రక్కు

చైనాలో అంతిమయాత్ర ఊరేగింపుపైకి ట్రక్కు దూసుకురావడంతో 19 మంది మరణించగా.. 20 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



'ఆపాత' పాలపుంతలు!

అచ్చం మన పాలపుంత మాదిరిగా ఉండే నక్షత్ర మండలాలను నాసా జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తాజాగా గుర్తించింది.

వివరాలు 6లో ▸



పూజల పార్టీ బీజేపీ

పాదయాత్ర నిరాడంబరతను సూచిస్తుందని.. కాంగ్రెస్ తపస్యను నమ్ముతోందని.. బీజేపీ పూజల సంస్థ అని రాహుల్ విమర్శించారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

మార్చికల్లా పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్



ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు చెప్పారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో వచ్చే మార్చి నాటికి కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

వివరాలు 11 ▸

26న భీమిలిలో మహా కుంభయాగం



విశాఖ జిల్లా భీమిలిలో ఈ నెల 26న మహా కుంభయాగం నిర్వహించనున్నారు. దీనికి కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి హాజరుకానున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

వివరాలు 5 ▸

చలితో రాష్ట్రం గజగజ!



రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలి గాలుల తీవ్రత పెరిగింది. విశాఖ ఏజెన్సీలో సాధారణం కన్నా 3 నుంచి 5 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి, హుకుంపేటలో అత్యల్పంగా 1.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వివరాలు 10 ▸

ఆక్వా ఎగుమతుల్లో భారత్‌ది రెండో స్థానం



ఆక్వా రంగం అభివృద్ధి చెందితే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో ఉందని చెప్పారు. కాకినాడలో ఏర్పాటు చేసిన రొయ్యల ఫుడ్ ఫెస్టివల్‌ను మంత్రి ప్రారంభించారు.

వివరాలు 10 ▸




ఆ కొవ్వొత్తి కరిగిపోయేలోపు మీ పనులన్నీ పూర్తి చేసుకోవాలి సార్!!

• పరామర్శ పవనం..

నాకునువ్వు నీకునేను

హైదరాబాద్‌లో చంద్రబాబు ఇంటికి దత్తపుత్రుడు పవన్

- ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట పరామర్శ.. బాధితులను కాకుండా వీరిద్దరి పరస్పర పరామర్శలేంటని జనం ఆశ్చర్యం
- ఇటీవల ఇరుకు రోడ్డుపై బాబు సభ పెడితే 8 మంది మరణం
- ఆ తర్వాత కానుకలంటూ ఆశపెడితే మరో ముగ్గురు మృతి
- మరణించిన వారిలో ఏ ఒక్క కుటుంబాన్నీ పరామర్శించని పవన్
- రోడ్లపై సభలను నిషేధించడాన్ని వ్యతిరేకిస్తూ బాబుకు పరామర్శ
- కొన్ని రోజుల క్రితం విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో మంత్రులపై జనసేన రౌడీల దాడి
- అప్పుడు పవన్‌ను విజయవాడకు పిలిపించుకుని బాబు పరామర్శ
- ఇవన్నీ మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమేనని ముందు నుంచీ చెబుతున్న వైఎస్సార్‌సీపీ
- పవన్ ఎప్పటికీ చంద్రబాబు మిత్రుడేనని మళ్లీ మళ్లీ నిరూపణ



తన ఇంటికి వచ్చిన పవన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చంద్రబాబు

జీవో నంబర్ ఒకటి పైనే కలిశాం

- చంద్రబాబు, పవన్ వెల్లడి
- పొత్తుల గురించి మాట్లాడటానికి ఇంకా సమయముంది 2లో
- ఎప్పుడు ఏం చేయాలో మాకు వ్యూహాలుంటాయి
- కందుకూరు, గుంటూరు ఘటనలకు పోలీసుల కుట్రే కారణం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక ముసుగు రాజకీయాలు చేస్తూ వచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఇప్పుడు పరామర్శల పేరుతో బహిరంగంగానే పరస్పరం మద్దతు ఇచ్చిపుచ్చుకుంటున్నారు. తామిద్దరం వేర్వేరు కాదని, ఒక్కటేనని నిరూపించుకుంటూ ఆదివారం మరోసారి కలిశారు. రెండు నెలల క్రితం చంద్రబాబు పవన్‌ను కలిసి పరామర్శించగా, ఇప్పుడు చంద్రబాబును పవన్ కళ్యాణ్ పరామర్శించారు. ఈ పరామర్శలు నిజంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమా లేక రాజకీయం కోసమా అనేది ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోంది. అయినా

మిగతా 2వ పేజీలో ▶

పరస్పర పరామర్శలతో ప్రజలను మోసం చేస్తారా?

- చంద్రబాబు, పవన్‌ను నిలదీసిన మంత్రులు.. చంద్రబాబు ప్రయోజనాల కోసమే 'జనసేన'
- అది టీడీపీ అనుబంధ సంస్థే.. వారిద్దరూ ఒకటే.. 2లో
- వారు కలిసే పోటీ చేస్తారని మేము తొలి నుంచి చెబుతూనే ఉన్నాం

అనకాపల్లి జిల్లా మాడుగలలో ఏర్పాటు చేసిన మహిళా మార్టు



మహిళా శక్తికి 'చేయూత'

పొదుపు సంఘాలతో మార్ట్‌లు ఏర్పాటు చేయిస్తున్న ప్రభుత్వం

- ఆసరా, చేయూత పథకాల తోడ్పాటుతో మార్ట్‌ల ఏర్పాటు
- కాకినాడ జిల్లా మార్ట్‌లో 4 నెలల్లో రూ.74 లక్షల టర్నోవర్
- అనకాపల్లి జిల్లా మార్ట్‌లో రోజుకు రూ.40 వేల విక్రయాలు
- ఇప్పటికే 14 మార్ట్‌లు ప్రారంభం.. ఈ నెలలోనే మరో తొమ్మిది మార్టులు
- మార్చి కల్లా 500 మార్ట్‌లు ఏర్పాటే లక్ష్యం
- పండుగల సీజన్లలో బంపర్ డ్రాలతో వ్యాపార విస్తరణకు ప్రణాళికలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల సహకారంతో కాకినాడ జిల్లాలో మొదలైన ఓ మహిళా మార్టు నాలుగు నెలల్లోనే రూ.74 లక్షల టర్నోవర్‌ను సాధించింది. గత డిసెంబర్ 31న ఒక్క రోజులో రూ.2.5 లక్షల విలువైన సరుకులను విక్రయించి రికార్డు నెలకొల్పింది. నెల క్రితమే అనకాపల్లి జిల్లాలో మొదలైన మరో మహిళా మార్టు పది మందికి ఉపాధి కల్పిస్తూ ప్రస్తుతం నిత్యం రూ.40 వేల విలువైన సరుకులను విక్రయించే స్థాయికి వేగంగా ఎదిగింది. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలతో సంఘటితమైన పొదుపు మహిళల వ్యాపార దక్షతకు ఈ రెండు జిల్లాల్లోని మార్టులు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహంతో..

రాష్ట్రవ్యాప్తంగా పొదుపు సంఘాల సభ్యులు సంఘటితమై నెలకొల్పిన చేయూత

మిగతా 11వ పేజీలో ▶

స్టాఫ్ నర్సు పోస్టుల ఫైనల్ మెరిట్ జాబితా విడుదల

సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీలో భాగంగా ఫైనల్ మెరిట్ జాబితాను జోన్- 2, 3, 4లలో విడుదల చేశారు. జోన్-1లో ఫైనల్ మెరిట్ జాబితా విడుదల కావాల్సి ఉంది. 957 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి గత నెల మొదటి వారంలో వైద్య శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. నాలుగు జోన్‌లలో 40 వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా జోన్-2లో 12,295 మంది ఉన్నారు. ఫైనల్ మెరిట్ జాబితా వెలువడిన నేపథ్యంలో ఈ వారంలో ఎంపికైన అభ్యర్థుల జాబితాలను విడుదల చేసి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉంది.



జోన్‌ల వారీగా పోస్టుల భర్తీ ఇలా

జోన్	పోస్టులు
1	163
2	264
3	239
4	291
మొత్తం	957



విశాఖ ఓ అద్భుతం

- స్థలం కొన్నా.. త్వరలో ఇక్కడ ఇల్లు కడతా 2లో
- మెగాస్టార్ చిరంజీవి వెల్లడి
- ఘనంగా 'వాల్తేరు వీరయ్య' ప్రీ రిలీజ్ వేడుక

గ్రూప్ 1 ప్రిలిమ్స్ ప్రశాంతం

82.38 శాతం మంది హాజరు | **అత్యున్నత ప్రమాణాలతో సమగ్ర అవగాహనను పరీక్షించేలా ప్రశ్నలు**

సాక్షి, అమరావతి: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఏపీపీఎస్సీ పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో కేవలం ఒక్క చోట స్వల్ప ఘటన మినహా సజావుగా పూర్తయ్యాయి. 2022 గ్రూప్-1 పరీక్షకు 1,26,449 మంది రిజిస్టర్ చేసుకున్నారు. వీరిలో 1,06,473 మంది హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా 87,718 మంది (82.38 శాతం) పరీక్ష రాశారు. గతంలో జరిగిన 2018 గ్రూప్-1 పరీక్షకు 73 శాతం మంది హాజరు కాగా ఈసారి మరింత పెరిగింది. రెవెన్యూ, పోలీసు శాఖల సహకారంతో ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ ధన్యవాదాలు తెలిపారు.

ప్రశ్నల సరళి ఎలా ఉందంటే...?


ఈసారి నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో ప్రశ్నలు అత్యున్నత ప్రమాణాలతో ఆయా అంశాలపై అభ్యర్థుల సమగ్ర అవగాహన, పరిజ్ఞానాన్ని పరీక్షించేలా ఉన్నాయని పలువురు నిపుణులు, అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఎక్కడా డైరెక్ట్ ప్రశ్నలు లేవన్నారు. ఈదఫా గ్రూప్-1 ప్రిలిమ్స్ ప్రశ్నలు సివిల్స్ తరహాలో ఉన్నాయని గతంలో గ్రూప్-1 పరీక్షకు హాజరు కావడంతోపాటు సివిల్స్‌లో సైతం ఇంటర్వ్యూ వరకు వెళ్లిన ఓ అభ్యర్థి తెలిపారు. పేపర్ 1లో ఇచ్చిన 120 ప్రశ్నల్లో ఆరు మినహా తక్కినవన్నీ ఆయా అంశాలపై పూర్తి అవగాహన ఉన్నవారే కచ్చితమైన సమాధానం రాయగలుగుతారని చెప్పారు. పేపర్ 1, 2లో ప్రశ్నలకు ఇచ్చిన బహుళైచ్ఛిక సమాధానాలన్నీ సరైనవే అన్నట్లుగా ఉన్నాయని విశాఖలో తొలిసారి ఈ పరీక్షకు హాజరైన ఓ యువతి పేర్కొంది. సబ్జెక్టుపై పూర్తి అవగాహనతోపాటు క్షుణ్ణంగా అర్థం చేసుకొన్న వారే సరైన సమాధానం గుర్తించగలిగేలా ప్రశ్నలు అడిగారని తెలిపారు. పేపర్ 1 కంటే పేపర్ 2లో ప్రశ్నలు కష్టం గా ఉన్నాయని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆప్టిట్యూడ్ ప్రశ్నలకు సరైన సమాధానాలు కనుక్కోవడం ఇబ్బంది అయిందని మరో అభ్యర్థి పేర్కొన్నారు. పేపర్ 2 లో

మిగతా 11వ పేజీలో ▶



విజయవాడలోని స్టెలా కాలేజీ వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీస్

న్యాయ విచారణలో రాజకీయ వ్యాఖ్యలు అవాంఛనీయం



- ముందస్తుగా ఎన్నికలు వస్తాయని ఒక జడ్జి ఎలా వ్యాఖ్యానిస్తారు?
- ఏవైనా వ్యాఖ్యలు చేస్తే వాటిని తీర్పులో ఇవ్వండి
- మీ ఆదేశాలను పాటిస్తాం.. తీర్పును విభేదిస్తే అప్పీల్ చేస్తాం
- మాకు కోర్టులు, జడ్జిలు, న్యాయవ్యవస్థపై చాలా గౌరవం
- కోర్టులో లేని అంశాలపై జడ్జి వ్యాఖ్యలు చాలా బాధాకరం 3లో
- వాటిని తమ స్వప్రయోజనాలకు పార్టీలు, ఎల్లో మీడియా వాడుకుంటున్నాయి.. ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా చూడాలి
- హైకోర్టుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ విజ్ఞప్తి



'పబ్లిక్ వైఫై' వాడుతున్నారా?

అయితే జాగ్రత్త!

- పబ్లిక్ వైఫైలు వాడుతున్నట్లయితే జాగ్రత్తగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ నిపుణులు సూచిస్తున్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో అందుబాటులో ఉండే వైఫై వినియోగించి ఈ-మెయిల్, ఇతర సోషల్ మీడియా ఖాతాలు ఓపెన్ చేయడం, ఆన్‌లైన్ బ్యాంక్ లావాదేవీలు చేస్తే.. మనం నమోదు చేసే యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను సైబర్ నేరగాళ్లు మాల్‌వేర్ ద్వారా హ్యాక్ చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

- వివరాలు 10లో

వేగంగా 'సెంచురీ ప్యానల్స్' నిర్మాణ పనులు

రూ.1,600 కోట్లతో వైఎస్సార్ జిల్లా గోపవరం వద్ద ప్యానల్స్ తయారీ యూనిట్ | **2024 డిసెంబర్‌లో ఉత్పత్తి ప్రారంభించడమే లక్ష్యం**

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా గోపవరం వద్ద 482 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న సెంచురీ ప్యానల్స్ తయారీ యూనిట్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ యూనిట్ ఏర్పాటుకు పర్యావరణ, అటవీ అనుమతులు మంజూరు కావడంతో సెంచురీ ప్లై సంస్థ నిర్మాణ పనులు ప్రారంభించింది. సుమారు రూ.1,600 కోట్లతో ఏర్పాటుచేస్తున్న ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 2,000 మందికి పరోక్షంగా 4,000 మందికి ఉపాధి లభించనుంది. ఈ యూనిట్ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2021, డిసెంబర్ 24న భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే. ఈ యూనిట్ తొలి దశ పనులను 2024 డిసెంబర్ నాటికి పూర్తిచేసి వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలుత తమిళనాడులో ఈ యూనిట్‌ను నెలకొల్పాలని భావించామని, కానీ ఏపీ ప్రభుత్వం వేగంగా అనుమతులు మంజూరు చేస్తుండటంతో గోపవరం వద్ద ఏర్పాటుచేస్తున్నట్లు సెంచురీ ప్లై చైర్మన్ సజ్జన్ భజాంకా శంకుస్థాపన సమయంలో ప్రకటించారు. తొలుత రూ.600 కోట్లతో యూనిట్ ఏర్పాటుచేయాలని భావించామని, కానీ ఇప్పుడు రూ.1,600 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ఆయన వెల్లడించారు. అత్యంత వెనుకబడిన ప్రాంతమైన గోపవరం వద్ద ఈ యూనిట్ ఏర్పాటు వల్ల కలప ఆధారిత అనుబంధ పరిశ్రమలు మరిన్ని వస్తాయని, తద్వారా స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

హైదరాబాద్-విజయవాడ మధ్య ఆర్‌ఆర్‌టీఎస్ రైలు!

అత్యాధునిక ఇంటర్‌సిటీ రైలు సర్వీసుకు ప్రతిపాదన

- ఆధునిక కోచ్‌లు, మెరుగైన వసతులు, అత్యున్నత భద్రత
- ప్రస్తుతం ఢిల్లీ-మీరట్ మధ్య నిర్మాణంలో ఉన్న తొలి ఆర్‌ఆర్‌టీఎస్.. తరువాత దశల వారీగా 7ఆర్‌ఆర్‌టీఎస్‌ల ఏర్పాటు



సాక్షి, అమరావతి: హైదరాబాద్-విజయవాడ మధ్య ఇంటర్‌సిటీ రైల్ సర్వీసులు ఆధునిక సొబగులు సంతరించుకోనున్నాయి. ఇప్పటికే ఈ రెండు నగరాల మధ్య వందే భారత్ రైలు సర్వీసు ఈ నెల 19న ప్రారంభం కానుంది. తాజాగా హైదరాబాద్- విజయవాడ మధ్య అత్యాధునిక రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం (ఆర్‌ఆర్‌టీఎస్) రైల్వే వ్యవస్థ ఏర్పాటుకు ప్రతిపాదించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దేశంలో మెట్రో రైలు కంటే మెరుగైన ఇంటర్‌సిటీ మోడల్ రైల్వే వ్యవస్థగా ఆర్‌ఆర్‌టీఎస్‌ను ప్రస్తుతం ఢిల్లీ-మీరట్ మధ్య నిర్మిస్తున్నారు. ఆ రెండు నగరాల మధ్య ఆర్‌ఆర్‌టీఎస్ రైల్వే వ్యవస్థ 2024 చివరకు అందుబాటులోకి రానుంది. తరువాత దేశంలో మరో ఏడు ఆర్‌ఆర్‌టీఎస్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించారు. వీటిలో రెండు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. మిగిలిన ఐదింటిలో

మిగతా 3వ పేజీలో ▶

జొకోవిచ్.. టైటిల్ నంబర్ 92

- వివరాలు 12లో

క్లుప్తంగా...

విశాఖ ఓ అద్భుతం

- మెగాస్టార్ చిరంజీవి
- ఘనంగా వాల్తేరు వీరయ్య చిత్రం ప్రీ రిలీజ్ వేడుక

బీచ్ రోడ్డు (విశాఖ తూర్పు): ప్రశాంత జీవితం గడపాలనుకునే వారికి విశాఖ అద్భుతమైన ప్రాంతమని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. వాల్తేరు వీరయ్య చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలను ఆదివారం రాత్రి విశాఖలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. తాను ఎప్పటి నుంచో వైజాగ్‌లో నివాసం ఉందామని అనుకుంటున్నానని.. ఆ కల త్వరలో నెరవేరనుందని చెప్పారు. భీమిలి బీచ్ రోడ్డు వైపు స్థలం కొనుగోలు చేసినట్టు ప్రకటించారు. త్వరలోనే ఇల్లు నిర్మించుకుని విశాఖ వాసి అవుతానని చెప్పారు. విశాఖ వచ్చిన ప్రతిసారి ఒక ఉద్వేగానికి గురవుతానని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. డైరెక్టర్ చిత్రం పేరు వాల్తేరు వీరయ్య చెప్పగానే చాలా పాజిటివ్ ఎనర్జీ వచ్చిందని, అందుకు కారణంగా వైజాగ్‌పై తనకున్న ప్రేమ అన్నారు. కార్యక్రమంలో మాస్ మహారాజ్ రవితేజ, డైరెక్టర్ బాబ్జీ, మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ, ఇతర నటీనటులు పాల్గొని తమ అనుభవాలను అభిమానులతో పంచుకున్నారు. సంక్రాంతి సందర్భంగా విడుదలయ్యే ఈ సినిమాతో అభిమానులకు మరింత పూనకాలు రావటం ఖాయమన్నారు.

జీర్ణవ్యవస్థపై ఒత్తిడి ప్రభావం

- గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ విజయలక్ష్మి

సాక్షి, విశాఖపట్నం: మనుషుల జీర్ణవ్యవస్థపై ఒత్తిడి ప్రభావం తీవ్రంగానే ఉంటోందని అమెరికాకాలిఫోర్నియాకు చెందిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి ఓరుగంటి చెప్పారు. ఒత్తిడికి గురైనప్పుడు మెదడులో హార్మోన్లు, పేగుల్లో రసాయనాలు వృద్ధి చెంది కడుపునొప్పి, అజీర్ణానికి దారి తీస్తున్నాయన్నారు. విశాఖలో గ్లోబల్ హెల్త్ సదస్సులో పాల్గొనడానికి వచ్చిన ఆమె ఆదివారం 'సాక్షి'తో మాట్లాడారు. బరువు అధికంగా పెరగడం (ఒబెసిటీ) వల్ల కూడా కాలేయ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. గతంలో నయమైన, నియంత్రించబడిన వ్యాధులు కోవిడ్ అనంతరం ఇప్పుడు మళ్లీ బయటపడుతున్నాయని విజయలక్ష్మి చెప్పారు. బయట తిండినే ఎక్కువగా తినడం, ప్రాసెస్డ్ ఫుడ్ తీసుకోవడమే జీర్ణకోశ, అల్సర్ సమస్యలకు ప్రధాన కారణమన్నారు.

హత్యకేసులో టీడీపీ నేత కీలకపాత్ర



చంద్రబాబుతో శ్రీవరప్రకాష్ (ఫైల్)

మండపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో సంచలనం కలిగించిన ఫొటోగ్రాఫర్ హత్య కేసులో టీడీపీకి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ ప్రధాన నిందితునిగా పోలీసులు నిగ్గుతేల్చారు. ఫొటోగ్రాఫర్‌ను మట్టుబెట్టేందుకు నిందితులతో రూ.2 లక్షలకు డీల్ కుదుర్చుకున్నట్టు విచారణలో వెల్లడైంది. పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ కుంజాల సురేష్(26) డిసెంబర్ 31వ తేదీ రాత్రి స్నేహితునితో బయటకు వెళ్లి మృతిచెందాడు. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా హత్యకేసుగా మార్చుచేశారు. హత్యకు పాల్పడిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగుచూసింది. హతుడు సురేష్ భార్య దుర్గాభవాని, అతని తల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీవరప్రకాష్ ఇంట్లో పనిచేసేవారు. భార్యపై అనుమానం పెంచుకున్న సురేష్ ఆమెను వేధించేవాడు. ఈ విషయాన్ని అత్తతో కలిసి భవాని శ్రీవరప్రకాష్, అతని అనుచరులు కోరా గోవింద్, బుంగా సంజయ్‌లకు చెప్పింది. ఈ నేపథ్యంలో.. సురేష్‌ను హత్య చేయించేందుకు వారు పథక రచన చేశారు. మాజీ చైర్మన్ కారు డ్రైవర్ శెట్టి వీర వెంకటేశ్వరరావు, గునుపల్లి నాగ సాయికృష్ణ ప్రసాద్, మారి శ్రీనులతో రూ.2 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. అప్పటికే సురేష్‌కు కారు డ్రైవర్ వెంకటేశ్వరరావుతో పరిచయం ఉంది. దీంతో మద్యం తాగేందుకని 31వ తేదీ రాత్రి సురేష్‌ను వెంకటేశ్వరరావు తన వెంట తీసుకువెళ్లాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం మద్యంలో విషం కలిపి తాగించాడు. అప్పటికీ మృతి చెందక పోవడంతో పీకపై కాలితో తొక్కి హత్యచేసినట్లు పట్టణ సీఐ పి.శివగణేష్ ఆదివారం రాత్రి మీడియాకు తెలిపారు. నిందితుల్లో వెంకటేశ్వరరావు, సాయికృష్ణ ప్రసాద్‌లను అరెస్టుచేసి, ఆదివారం కోర్టులో హాజరుపర్చారు. మాజీ చైర్మన్‌తో పాటు పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు.

పరస్పర పరామర్శలతో ప్రజలను మోసం చేస్తారా?

చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను నిలదీసిన మంత్రులు

- చంద్రబాబు ప్రయోజనాల కోసమే జనసేన స్థాపన
- అది టీడీపీ అనుబంధ సంస్థే.. వారిద్దరూ ఒకటే..
- వారు కలిసే పోటీ చేస్తారని సీఎం జగన్, మేము తొలి నుంచి చెబుతూనే ఉన్నాం
- ఇప్పుడు వీరిద్దరి భేటీ సాధారణమే.. అందులో ఆశ్చర్యమేం లేదు
- సంక్రాంతి ప్యాకేజీ కోసమే చంద్రబాబు ఇంటికి వెళ్లిన పవన్
- ప్యాకేజీకి కక్కుర్తిపడి కాపులను తాకట్టు పెట్టి చంద్రబాబుకు ఊడిగం
- ఎవరెన్ని చేసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం
- ప్రజల ప్రాణాలను పరిరక్షించేలా సభలు నిర్వహించడానికే జీవో 1 జారీ
- ఏ రాజకీయ పార్టీకైనా, సినిమా నటుడికైనా.. స్వచ్ఛంద సంస్థకైనా ఒకే నిబంధనలు

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్ : పరస్పరం పరామర్శించుకుంటూ ప్రజలను మోసం చేస్తారా? అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌లను మంత్రులు అంబటి రాంబాబు, గుడివాడ అమర్నాథ్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, జోగి రమేష్, ఆదిమూలం సురేష్, దాడిశెట్టి రాజా, డిప్యూటీ సీఎంలు కొట్టు సత్యనారాయణ, రాజన్నదొర నిలదీశారు. ఆదివారం వారు వేర్వేరు ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడారు. గతంలో విజయవాడలో నోవోటెల్ హోటల్‌లో పవన్ కళ్యాణ్‌ను చంద్రబాబు పరామర్శిస్తే.. ఆదివారం హైదరాబాద్‌లో చంద్రబాబు ఇంటికెళ్లి పవన్ కళ్యాణ్ పరామర్శించారన్నారు. వీరిద్దరి కలయికను ఆదివారం ఉదయం నుంచి మీడియా ఆశ్చర్యకర పరిణామంగా చూపిస్తోందని.. కానీ అందులో ఆశ్చర్యకరమైన అంశం ఏదీ లేదన్నారు. టీడీపీ, జనసేన వేర్వేరు పార్టీలు అనుకున్నప్పుడే వారిద్దరి భేటీ కీలక పరిణామం అవుతుందని, ఆ రెండు పార్టీలు ఎంత మాత్రం వేర్వేరు కావని స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్ కళ్యాణ్ జనసేనను స్థాపించినప్పుడు వారిద్దరి భేటీ కీలక పరిణామం ఎలా అవుతుందంటూ వ్యంగ్యోక్తులు విసిరారు. వారిద్దరూ కలిసే ఉన్నారని, కలిసే పోటీ చేస్తారని.. సీఎం వైఎస్ జగన్, తాము ముందు నుంచి చెబుతూనే ఉన్నామని గుర్తు చేశారు. చంద్రబాబు ప్రచార పిచ్చితో కందుకూరులో 8 మంది, గుంటూరులో ముగ్గురు పేదలను పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. ఆ 11 కుటుంబాల వద్దకు వెళ్లి.. మమ్మల్ని క్షమించండి అని చంద్రబాబు, పవన్‌లు చెబుతారేమో అని ఆశించినవాళ్లు వారిద్దరి భేటీపై ఆశ్చర్యపోయారన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 1 వైఎస్సార్‌సీపీతోపాటు అన్ని పార్టీలకూ, స్వచ్ఛంద సంస్థలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ జీవో ప్రకారమే ఒంగోలులో బాలకృష్ణ సినిమా వీరసింహారెడ్డి.. విశాఖపట్నంలో చిరంజీవి సినిమా వాల్తేరు వీరయ్య ప్రీరిలీజ్ ఫంక్షన్‌లు నిర్వహించారని తెలిపారు.

పండగ మామూళ్ల కోసమే చంద్రబాబు ఇంటికి..



ప్యాకేజ్ స్టార్ పవన్ పండగ మామూలు కోసం చంద్రబాబు ఇంటికి వెళ్లారు. ఇద్దరి భేటీ కొత్త కాదు. మంత్రులపై జన సైనికులు దాడి చేస్తే చంద్రబాబు పరామర్శిస్తారు. చంద్రబాబు సభలో జనం చనిపోతే వారి కుటుంబాల పరామర్శకు పవన్ కళ్యాణ్ వెళ్లరు కానీ బాబును పరామర్శిస్తారు. వీరిద్దరూ జనాన్ని మోసగించడమే పనిగా పెట్టుకున్నారు. అమాయకపు జనసేన కార్యకర్తలను పవన్ అమ్మకానికి పెట్టారు. పవన్ ఏ విధంగా సీఎం అవుతాడన్నది జనసేన కార్యకర్తలకు అర్థం కావడం లేదు. చంద్రబాబు వేసే ఎంగిలి మెతుకులతోపవన్ మ్యాజిక్ ఫిగర్ ఎలా సాధిస్తారు?

– గుడివాడ అమర్నాథ్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి

మంచిని అడ్డుకోవడమే వారిద్దరి అజెండా



చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ది అనైతిక పొత్తు. ఎవరైనా ఒక ప్రత్యేకమైన ఎజెండాతో రాజకీయాలు చేయాలి. కానీ వీళ్లది మిక్స్‌డ్ ఎజెండా. ప్రజలకు జరిగే మంచిని అడ్డుకోవడమే వారి ఎజెండా. చంద్రబాబు డైరెక్టర్ అయితే పవన్‌కళ్యాణ్ యాక్టర్ అని సీఎం వైఎస్ జగన్ ఎప్పుడో చెప్పారు. ఈరోజు వారిద్దరి కలయిక ద్వారా రాష్ట్ర ప్రజల్లో ఉన్న అనుమానాలన్నీ తొలిగిపోయాయి. బలం లేని వాడు పక్కోడి బలాన్ని తీసుకుని తాను బలవంతుడిని అని చెప్పుకోవాలనే ప్రయత్నం బాబుది. ప్రజలు మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేరు.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి

పవన్‌కు పేదల కంటే చంద్రబాబే ముఖ్యం



చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలయిక కొత్తేమీ కాదు. రాష్ట్రం గురించి, ప్రజల ప్రయోజనాల గురించి వీళ్లకు పట్టదు. వారిద్దరికీ రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం. ఇద్దరూ కలిసి రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకోవాలన్నదే వారి ఆలోచన. పవన్‌కళ్యాణ్‌కు పేదల ప్రాణాలు, కార్యకర్తలకంటే చంద్రబాబు మేలే ముఖ్యం. నాడు చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చి కోసం గోదావరి పుష్కరాల్లో 29 మంది చనిపోతే పవన్ మాట్లాడలేదు. మళ్లీ ఇప్పుడు కందుకూరు, గుంటూరులో 11 మంది బలైనా పవన్ నోరెత్తలేదు. ఇద్దరూ కలిసి కుట్రకు తెర లేపారు. ప్రజలు అంతా గమనిస్తున్నారు.

– కారుమూరి నాగేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి

ఎంత మంది కలిసినా ఎదుర్కొనేందుకు సిద్ధం



ప్యాకేజీ పెంచమని కోరడం కోసమే దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని కలిశారు. వీరిద్దరూ ఒకటేనన్న విషయం చిన్నపిల్లాడిని అడిగినా చెబుతారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు బలమైన శక్తిగా ఎదుగుతోంది. వైఎస్ జగన్‌ను ఎదుర్కోవడం కష్టమని వీరిద్దరు ఏకం అవుతున్నారు. సింగిల్‌గా పోటీ చేసే సత్తా టీడీపీ, జనసేన పార్టీలకు లేదు. ఎంత మంది ఒక్కటైనా, ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉంది.

– దాడిశెట్టి రాజా, రహదారులు భవనాల శాఖ మంత్రి

కాపు జాతికి తీరని ద్రోహం



పవన్‌కళ్యాణ్ దత్తపుత్రుడు అంటే చంద్రబాబుకు కోపమొచ్చింది. మరి ఇవాళ జరుగుతున్నదేంటి? వీరిద్దరి మధ్య ఉన్న రాజకీయ ముసుగు తొలగిపోయింది. పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అవ్వాలని జనసేన కార్యకర్తలు ఆశగా చూస్తుంటే, ఎలాగైనా చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని పవన్ కళ్యాణ్ శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. పవన్ అవకాశవాద రాజకీయాలకు ఇది పరాకాష్ట. కాపు సామాజికవర్గం ఆశలపై నీళ్లు చల్లుతూ తీరని ద్రోహం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తన ఆర్థిక లబ్ధి కోసం జనసేన పార్టీని, జనసైనికులను, కాపు జాతిని చంద్రబాబుకు తాకట్టు పెడుతున్నారు. జీవో నంబర్ 1 వల్ల వచ్చిన నష్టమేంటి? రణస్థలంలో జనసేన యువభేరికి, చిరంజీవి సినిమా రిలీజ్ ఫంక్షన్‌కు, బాలకృష్ణ ఒంగోలులో సినిమా ప్రమోషన్‌కు ప్రభుత్వం అనుమతించ లేదా?

– కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి

చంద్రబాబు, పవన్ ముసుగు దొంగలు



చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ముసుగు దొంగలు. తన ప్రచార ఆర్భాటాల కోసం చంద్రబాబు 40 మంది చావుకు కారణమయ్యారు. అదే ఆయన పొలిటికల్ ఇండస్ట్రీ. సైకిల్ పోవాలి.. సైకిల్ రావద్దంటూ చంద్రబాబు, టీడీపీకి ఓటేస్తే మన ఉరి మనమే వేసుకున్నట్టని లోకేశ్ వారి మనసులో మాటలు చెప్పారు. ప్రభుత్వం ప్రజల ప్రాణ రక్షణకే జీవో నంబర్ 1 తెచ్చింది.

– పీడిక రాజన్నదొర, ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

చంద్రబాబుకు ఊడిగం చేయడానికే జనసేన



చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఇద్దరూ ఒకటేనని ఇవాళ మరోమారు చాటుకున్నారు. చంద్రబాబు ఏం చెబితే అది చేయడానికి పవన్ కళ్యాణ్ సిద్ధంగా ఉన్నారు. ఇద్దరూ సీట్లు సర్దుబాటు చేసుకోబోతున్నారు. పదో పరకో తీసుకుని కాపు సామాజికవర్గం ఓటర్లందరినీ గంపగుత్తగా చంద్రబాబుకు తాకట్టు పెట్టి, ఊడిగం చేసేందుకు పవన్ సిద్ధమయ్యాడు. 'మా పవన్‌కళ్యాణ్ సీఎం అవుతాడు' అని గొంతు చించుకుని అరిచే వాళ్లంతా ఇప్పుడు పవన్‌కళ్యాణ్‌ను ప్రశ్నించాలి. బీజేపీతో విడాకులు తీసుకోకుండా చంద్రబాబుతో సంబంధం ఏమిటి? మీకసలు నైతిక విలువలు ఉన్నాయా? అప్పుడు చిరంజీవి తన పార్టీని కాంగ్రెస్‌లో కలిపేసినట్లు ఇప్పుడు పవన్ జనసేనను టీడీపీలో కలిపేస్తేసరి. ఇంకా ఎవరిని మోసం చేయడానికి ఈ పరస్పర పరామర్శలు? మీరు ఎన్ని చేసినా 2024లో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరు.

– అంబటి రాంబాబు, జల వనరుల శాఖ మంత్రి

వారిద్దరూ నైతిక విలువలు వదిలేశారు



పవన్ కళ్యాణ్‌కు బుద్ధి ఉంటే కందుకూరు, గుంటూరులో చనిపోయిన 11 మంది ఇళ్లకు పరామర్శకు వెళ్తారు. కానీ అందుకు భిన్నంగా చంద్రబాబు ఇంటికి పరామర్శకు వెళ్లడం ఏమిటి? సంక్రాంతి ప్యాకేజీ కోసమే కదా. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు సిగ్గూశరం ఏనాడో పోయాయి. వాళ్లిద్దరూ నైతిక విలువలను ఏనాడో వదిలేశారు.

'నాకు ఎన్ని సీట్లు.. ఎంత ప్యాకేజీ ఇస్తావు? నేను ఏయే స్థానాల్లో అమ్ముడుపోవాలి?' అని దత్తతండ్రిని అడగడానికి దత్తపుత్రుడు వెళ్లిన భేటీనే తప్ప, ఇది మరొకటి కాదు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలంతా సంతోషంగా ఉంటే.. పవన్, చంద్రబాబు ఇద్దరూ చీకటి ఒప్పందాలతో ఈ ప్రజా ప్రభుత్వాన్ని ఎలా అస్థిర పరచాలని కుయుక్తులు పన్నుతున్నారు. వీళ్లకు పచ్చమీడియా వంత పాడుతోంది. వీరెన్ని ప్రయత్నాలు చేసినా 175కు 175 సీట్లు గెలుస్తాం.

– జోగి రమేష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి

టీడీపీ పల్లకి మోసేందుకు పవన్ సిద్ధం



టీడీపీ అధినేత చంద్రబాబును జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఎన్నిసార్లు కలిసినా వైఎస్సార్ సీపీకి వచ్చే నష్టం ఏమీ లేదు. మరోసారి వీరి ముసుగు తొలగిపోయింది. త్వరలో పవన్ టీడీపీ కండువా వేసుకున్నా ఆశ్చర్యం లేదు. టీడీపీ పల్లకి మోసేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ కలయిక రుజువు చేస్తోంది. వారితో ఇంకా ఎంత మంది కలిసినా మాకు వచ్చిన నష్టం ఏమీ లేదు. సింహం ఎప్పుడూ సింగిల్‌గా వస్తుందన్నట్లుగా సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో మేము ఒంటరిగానే పోటీ చేస్తాం. ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేయడమే మాకు శ్రీరామరక్ష. రాష్ట్ర ప్రజలు జగనన్నా.. ఒన్స్‌మోర్' అంటున్నారు. మీటింగ్‌లు పెట్టొద్దని ప్రభుత్వం చెప్పలేదు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నదే జీవో ఉద్దేశం.

– ఆదిమూలం సురేష్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

జీవో నంబర్ ఒకటిపైనే కలిశాం

- చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వెల్లడి
- అన్ని పార్టీలు కలిసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి
- పవన్‌తో కలిసి మీడియా సమావేశంలో చంద్రబాబు
- చెప్పేది వినండంటూ మీడియాపై చిందులు
- కుప్పం ఘటనపై మాట్లాడేందుకే చంద్రబాబు ఇంటికి వచ్చాను..
- బ్రిటిష్ కాలం నాటి జీవోలతో ప్రతిపక్షాలను అణగదొక్కాలని చూస్తున్నారు : పవన్ కళ్యాణ్
- హైదరాబాద్‌లోని చంద్రబాబు ఇంట్లో 2 గంటల పాటు సమావేశం

సాక్షి, హైదరాబాద్, అమరావతి : జీఓ నంబర్ -1 పై చర్చించేందుకే తాము సమావేశమైనట్లు తెలుగుదేశం, జనసేన పార్టీల అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెప్పారు. హైదరాబాద్‌లో ఆదివారం చంద్రబాబును పవన్ కళ్యాణ్ కలిశారు. ఉదయం 11.30 గంటలకు చంద్రబాబు నివాసానికి వెళ్లిన పవన్.. రెండున్నర గంటలకు పైగా అక్కడ గడిపారు. అనంతరం ఇద్దరూ సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు మాట్లాడుతూ.. కుప్పంలో పోలీసుల ద్వారా తన పర్యటనను అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అంతకుముందు వైజాగ్‌లో, ఇప్పటంలో పవన్‌ను కూడా అడ్డుకుందని చంద్రబాబు మండిపడ్డారు. బ్రిటిష్ కాలం నాటి చట్టం తెర మీదకు తెచ్చారని, దానికి ఉన్న చట్టబద్ధత ఏంటో కూడా తెలియకుండా జీవో నెంబర్ 1 అనే నల్ల జీవోతో ఆంక్షలు పెట్టారని తెలిపారు. రాజకీయాల్లో పొత్తులు సహజమని, 2009లో టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్)తో పొత్తు పెట్టుకున్నామని, ఆ తర్వాత ఆ పార్టీతో విభేదించామని తెలిపారు. ఎప్పుడు ఏం చేయాలో తమకు వ్యూహాలు ఉంటాయని, రాజకీయాల్లో సమీకరణాలు మారుతుంటాయని, వాటి గురించి సమయం వచ్చినప్పుడు మాట్లాడతానన్నారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కందుకూరు, గుంటూరు ఘటనల వెనుక ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించారు. సభలు, మీటింగ్‌లు జరుగుతున్నప్పుడు బందోబస్తు ఇవ్వాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలపై ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో పోరాటం చేస్తామన్నారు. ప్రజా పోరాటం, న్యాయ పోరాటం కూడా చేస్తామని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం కోసం ఇటు గవర్నర్ నుంచి అటు రాష్ట్రపతి వరకు అందరినీ కలుస్తామన్నారు. అవసరాన్ని బట్టి కేంద్రం కూడా జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ కంటే భయంకరమైన పరిస్థితులు ఉన్నాయని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న చంద్రబాబు, పక్కన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

చంద్రబాబును అడ్డుకోవడం దుర్మార్గం

కుప్పంలో చంద్రబాబును అడ్డుకోవడం సరికాదని, ఆ విషయం గురించి చర్చించేందుకే ఇక్కడికి వచ్చానని పవన్ కళ్యాణ్ అన్నారు. ఓడిపోతామనే భయంతో చెత్త జీవోలను తెస్తున్నారని, విశాఖలో తనపైనా ఆంక్షలు పెట్టారని విమర్శించారు. ఇప్పుడు సీనియర్ నేత చంద్రబాబును కూడా అడ్డుకుంటున్నారని, ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా పని చేసిన వ్యక్తి పట్ల ప్రభుత్వం ఇలా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. నిబంధనలన్నీ ప్రతిపక్షాలకేనని, అధికార పక్షానికి వర్తించవని మండిపడ్డారు. సభలు జరుగుతుంటే శాంతి భద్రతలు చూడాల్సింది ప్రభుత్వ యంత్రాంగమేనని, పోలీసులు బందోబస్తు ఇవ్వకపోతే ఏమనాలని ప్రశ్నించారు. కందుకూరు, గుంటూరు ఘటనలు సెక్యూరిటీ వైఫల్యమని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలు ఫలితాన్నిస్తుంటే, గుంటూరులో అంత మంది ప్రజలు సంక్రాంతి కానుక కోసం ఎందుకు తరలి వచ్చారో చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ అరాచకాలను అడ్డుకునేందుకు బీజేపీని కూడా సంప్రదిస్తానన్నారు. ఏపీలోకి బీఆర్ఎస్ రావడాన్ని స్వాగతిస్తున్నామని, తెలంగాణ వాదాన్ని వదిలి దేశమంతా పోటీ చేస్తామంటే ఆహ్వానిస్తామన్నారు.

వినవయ్యా విను.. మీడియాపై అసహనం

చంద్రబాబు మీడియాతో మాట్లాడాక ప్రశ్నలు వేసిన విలేకరులపై పలుమార్లు ఆయన అసహనానికి లోనయ్యారు. ఒకరిద్దరు అటు ఇటు తాళం వేస్తున్నారంటూ ఎగతాళి చేశారు. 'మా గురించి ఇన్ని మాట్లాడుతున్నారు.. మీరేం చేస్తున్నారు? అంటూ ఎదురు ప్రశ్నలు వేశారు. 2930 జీవోను ఎందుకు వ్యతిరేకించలేదన్నారు. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు మీడియా వాచ్ జీవో తెస్తే విలేకరులు ఏకమయ్యారని, ఈ జీవో మీద ఒక్క మీడియా కూడా ముందుకు రాలేదని ఆక్షేపించారు. 'అప్పుడు పోటుగానివా.. ఇప్పుడు ఎందుకు భయపడుతున్నావ్?' అన్నారు. 'మీకు రోషం ఉంటే నన్ను అడగడానికి ముందు రాయండి. అప్పుడు మాట్లాడుదాం.. ముందు చెప్పేది వినవయ్యా.. నువ్విక్కడున్నావ్.. ఓ సెలబ్రిటీ వస్తాడు. మనుషులు వస్తారు. సెలబ్రిటీని మనుషులు కంట్రోల్ చేస్తారా? పోలీసులా? ఫండమెంటల్‌గా అర్థం చేసుకోకుండా ప్రశ్నలు వేస్తారా? అందుకే వాళ్లు (ప్రభుత్వం) ఇలాగే ఉంటారు' అని అసహనం వ్యక్తం చేశారు.

నాకు నువ్వు నీకు నేను

▶ మొదటి పేజీ తరువాయి

ఇరు పార్టీల అధినేతలు బయటికి ఒకటి చెబుతూ.. లోపల మరొకటి చేస్తున్నారు. ఇరు పార్టీలు కలవకపోతే టీడీపీ పుట్టి పూర్తిగా మునగడం ఖాయం అని తాజాగా బాబు కుప్పం పర్యటనలో తెలిసిపోయిన నేపథ్యంలో ముసుగు తొలగించేందుకు సిద్ధమైపోయారు.

పవన్ పరామర్శించాల్సింది ఎవరిని?

హైదరాబాద్‌లో ఆదివారం చంద్రబాబు, పవన్ నిర్వహించిన సంఘీభావ సమావేశం ఎవరి కోసం ? అని సర్వత్రా చర్చ జరుగుతోంది. కుప్పంలో ప్రజాదరణ లేక.. జరిగిన ఘటనల నేపథ్యంలో చంద్రబాబును పరామర్శించేందుకు వచ్చినట్లు పవన్ నర్మగర్భంగా చెప్పారు. కుప్పంలో చంద్రబాబును అడ్డుకున్నారని, ప్రతిపక్షాలను అడ్డుకోవడానికి జారీ చేసిన జీఓ నెంబర్ 1ను వెనక్కి తీసుకునేలా చేయడం కోసం తాము కలిసి పని చేస్తామని ప్రకటించారు. అయితే పవన్ కళ్యాణ్‌కు ఇక్కడే ప్రజల నుంచి ఒక ప్రశ్న ఎదురవుతోంది. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఈ జీవో ఇచ్చేందుకు దారితీసిన పరిస్థితులు పవన్‌కు తెలియవా? తన ప్రచార ఆర్భాటం కోసం చంద్రబాబు కందుకూరులో చిన్న రోడ్డుపై సభ పెట్టడం ద్వారా 8 మంది ప్రజలు చనిపోవడానికి కారణమయ్యారు. ఆ తర్వాత గుంటూరులో కానుకల పంపిణీ అని ఆశపెట్టి పెద్ద సంఖ్యలో జనాన్ని రప్పించి, తొక్కిసలాట జరిగేలా చేసి, ముగ్గురు మృతి చెందడానికీ కారణమయ్యారు. ఈ రెండు ఘటనల్లో 11 మంది మృత్యువాత పడితే.. వారిలో ఏ ఒక్కరి కుటుంబాలను కూడా పవన్ పరామర్శించలేదు. పైగా ఈ ఘటనలేవీ పెద్ద విషయాలు కావన్నట్లు వ్యవహరించారు. అక్కడ చనిపోయిన కుటుంబాలను పరామర్శించాల్సిన పవన్.. అందుకు కారణమైన చంద్రబాబును పరామర్శించడం వింతల్లో కెల్లా వింత. ఇప్పటంలో రోడ్లను ఆక్రమించుకున్న వారిని పరామర్శించిన పవన్‌కు.. కూలి డబ్బుల కోసం ఆశపడి సభలకు వచ్చి చనిపోయిన వారిని పరామర్శించేందుకు మాత్రం మనసు రాలేదు. తన సభలకు జనం రాకపోవడంతో ఇరుకు సందులు, కానుకల పేరుతో పేదలను మభ్యపెట్టిన విషయం చర్చకు రాకుండా, కేవలం తమను ఆపడానికే రోడ్లపై బహిరంగ సభలు పెట్టకూడదనే జీఓ ఇచ్చారని కొత్త పల్లవి అందుకున్నారు. జనం చచ్చిపోయినా పర్వాలేదు.. తాము మాత్రం ఏ సందులోనైనా, గొందులోనైనా సభలు పెడతాం, తమను ఎవరూ ప్రశ్నించకూడదని చంద్రబాబు, దత్తపుత్రుడు ఈ సమావేశం ద్వారా కుండబద్దలు కొట్టారు. దీనికి ప్రజాస్వామ్య పరిరక్షణ అనే ముసుగు వేశారు.

ఇక లాభంలేదని..

రెండు నెలల క్రితం ఇదే తరహాలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సంఘీభావ సమావేశం నిర్వహించారు. అందుకు విశాఖలో జరిగిన పరిణామాలను ఉపయోగించుకున్నారు. తన విశాఖ పర్యటనలో మంత్రులు, వారి అనుచరులపై జనసేన రౌడీ మూకలతో పవన్ దాడి చేయించి ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారు. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు అడ్డుకుంటే బాబు సూచన మేరకు పవన్ విజయవాడకు వచ్చి హల్ చల్ చేశారు. విశాఖలో తనను బయటకు రానీయలేదని రెచ్చిపోయి అధికార పార్టీ నేతలను దుర్భాషలాడుతూ, చెప్పు చూపిస్తూ నానా హంగామా చేశారు. ఆ సమయంలో మంత్రులపై జరిగిన దాడి, శాంతి భద్రతల అంశాన్ని పట్టించుకోకుండా దానికి కారణమైన పవన్‌కే ఎంతో అన్యాయం జరిగిపోయినట్లు తెగ బాధపడిపోయిన చంద్రబాబు ఉన్న పళాన తన ముసుగు తీసి పవన్‌ను విజయవాడ నోవాటెల్ హోటల్‌లో కలిసి సంఘీభావం ప్రకటించారు. నిజానికి విశాఖ ఘటనలో బాధితులు ఎవరు, పరామర్శించాల్సింది ఎవరిని? ఇవేమీ జనానికి తెలియవన్నట్లుగా వచ్చే ఎన్నికల్లో కలిసి పనిచేసేందుకు వారిద్దరూ కలిసి ఒక అవకాశం సృష్టించుకుని అప్పట్లో కలుసుకున్నారు. అప్పటివరకు వేర్వేరుగా పని చేస్తున్నట్లు ప్రజలను ఏమార్చినా, ఇక లాభం లేదని ఇద్దరూ ఒక్కటేనని నిరూపించారు. ఆయా ఘటనల్లో బాధితులను పరామర్శించాల్సింది పోయి.. బాబు, పవన్‌లు ఇద్దరూ పరస్పరం పరామర్శలు ఏమిటని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఇదంతా మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమని.. పవన్, చంద్రబాబులు ఇద్దరూ ఒక్కటేనని, ఎలాగైనా బాబుకు మేలు చేయాలని పవన్ తహతహలాడుతున్నారని, జనసేన కార్యకర్తలను బలి పశువులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మొదటి నుంచీ చెబుతూనే ఉంది. ఈ నేపథ్యంలో తాను ఎప్పటికీ బాబు మిత్రుడినేనని పవన్ తాజాగా మరోమారు నిరూపించుకున్నారు. ముసుగు లోపలి చిత్రం స్పష్టంగా కనిపిస్తున్నా, జనసేనాని మాత్రం తన కార్యకర్తలకు దగా చేస్తూ ఇంకా బీరాలుపోతున్నారు. పవన్ తీరు తమకూ అర్థం కావడం లేదని బీజేపీ నేతలు వాపోతున్నారు.

జనసేనకు చంద్రబాబు రోడ్‌మ్యాప్

తాజాగా చంద్రబాబు, పవన్‌ల భేటీలో తమ భవిష్యత్తు ప్రణాళికతోపాటు పవన్ ఎలా పని చేయాలి, ఏం చేయాలనే అంశాలపై చంద్రబాబు ఒక రోడ్ మ్యాప్ ఇచ్చినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయడం, సీట్ల కేటాయింపు, ఉమ్మడి రాజకీయం ఎలా చేయాలనే అంశాలపై చర్చ జరిగినట్లు టీడీపీ నేత ఒకరు తెలిపారు. ఈ సమావేశం జరిగిన వెంటనే జనసేనకు 30 సీట్లు ఇచ్చేందుకు చంద్రబాబు అంగీకరించారని, అందులో కొన్ని స్థానాలు కూడా ఖరారయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం హోరెత్తుతోంది. ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక పేరుతో నిర్వహించే కార్యక్రమాలు, అక్కడ ఏం మాట్లాడాలి.. వంటి అంశాలపై చర్చించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అప్పుడు, ఇప్పుడు బాబు కోసమే రాజకీయం

- పవన్ తీరుపై సర్వత్రా విస్మయం
- నాడు ముద్రగడను అణిచి వేస్తే సమర్థింపు
- తుని రైలు ఘటనను సాకుగా చూపిన వైనం
- ప్రజల్ని రెచ్చగొట్టే రాజకీయాలు చేయకూడదంటూ హితబోధ
- ఇప్పుడు బాబు వల్ల 11 మంది చనిపోతే ప్రభుత్వానిదే తప్పట!

సాక్షి, అమరావతి : జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ వైఖరిపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాపు రిజర్వేషన్ల కోసం పోరాడిన ముద్రగడ పద్మనాభం పట్ల అప్పటి ప్రభుత్వం తీవ్ర ఆంక్షలు అమలు చేసినప్పుడు పవన్‌కళ్యాణ్ వ్యవహరించిన తీరు ప్రస్తుతం చర్చనీయాంశమైంది. 'నాకు కులాలు, మతాలు, ప్రాంతాలతో పనిలేదు. కానీ ప్రస్తుతం నేను రాజకీయాల్లోకి వచ్చాను గనక అలాంటి సమస్యలపైనా మాట్లాడాల్సి వస్తోంది. కాపు రిజర్వేషన్ల అంశం చాలా సున్నితమైనది. ఎవరైనా ప్రజల్ని రెచ్చగొట్టే రాజకీయాలు చేయకూడదు. కష్టనష్టాలు, లోటుపాట్లు ఏవైనా ఉంటే కమిషన్ (కాపు రిజర్వేషన్ల అంశంపై అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం వేసిన)కు చెప్పాలి. శాంతియుతంగా పాదయాత్రలు చేసేందుకు ముందుకొస్తే ఎవరికీ ఇబ్బంది లేదు. కానీ, గతంలో హింస (తుని రైలు దగ్ధం ఘటన) జరగడం వల్లే ఇప్పుడు సమస్య వచ్చింది' అని 2017 జూలై 31న వ్యాఖ్యానించారని పలువురు గుర్తు చేస్తున్నారు. ఇటీవల కందుకూరు, గుంటూరులో బాబు సభల కారణంగా 11 మంది అమాయక ప్రజలు మరణించడాన్ని లైట్ తీసుకుంటుండటం విస్మయపరుస్తోందని పలువురు తప్పు పడుతున్నారు. అలా జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవోను తప్పుపట్టడానికే పరిమితం కాకుండా, ఆ ఘటనలకు పరోక్ష కారణమైన చంద్రబాబుకు మద్దతు తెలపడం రాజకీయం పరిశీలకులను ఆశ్చర్యపరుస్తోంది.

ఆది నుంచీ చంద్రబాబు కోసమే..

- 2014 ఎన్నికల ముందే జనసేన పార్టీ ఏర్పాటు చేసినప్పటికీ, ఆ ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకున్నా, ఒక్క సీటులో కూడా పోటీ చేయలేదు.
- చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఎవరైనా సమస్యలను ప్రస్తావిస్తే.. ఎవరు సీఎంగా ఉన్నా వారసత్వంగా వస్తూనే ఉంటాయన్నారు.
- 'ఓటుకు కోట్లు' కేసులో చంద్రబాబు పాత్ర స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, ఆయన అనుభవం పనికొస్తుందని మౌనంగా ఉన్నానని చెప్పారు.
- 2019 ఎన్నికల్లో ప్రతిపక్షాల ఓట్లు చీల్చడం ద్వారా టీడీపీకి ప్రయోజనం కలిగించారు.
- ప్రస్తుతం బీజేపీని టీడీపీకి దగ్గర చేయడం ద్వారా చంద్రబాబుకు రాజకీయంగా లాభం చేకూర్చేందుకు ఉబలాటపడుతున్నారు. బీజేపీతో పొత్తును కొనసాగిస్తూ, మరోపక్క టీడీపీకి ఉపకరించేలా అడుగులు వేస్తున్నారు.

క్లుప్తంగా...

అన్ని ప్రాంతాలపై సీఎం జగన్ సమదృష్టి
సినీనటుడు ఆర్.నారాయణమూర్తి


నారాయణమూర్తిని సన్మానిస్తున్న ప్రముఖులు

అనంతపురం కల్చరల్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అన్ని ప్రాంతాల పట్ల సమాన భావన ఉందని సినీనటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. ప్రముఖ కథా రచయిత డాక్టర్ శాంతి నారాయణ రచించిన 'సాధన' నవలావిష్కరణ సభ ఆదివారం అనంతపురంలోని జెడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ రాయలసీమ గొప్ప సంస్కృతీ సంప్రదాయాలకు నెలవన్నారు. కానీ సినీ పరిశ్రమలోని కొందరు స్వార్థపరులు సీమ సంస్కృతిని కించపరిచేలా ఫ్యాక్షన్ ముద్ర వేసి చూపించడం తనకు వేదన కల్గిస్తోందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తనతోపాటు కొంతమంది కలిసి వెనుకబడిన ఉత్తరాంధ్ర పరిస్థితుల గురించి వివరించిన వెంటనే తాండవ రిజర్వాయర్, ఏలూరు కాలువ ఎత్తిపోతల పథకానికి రూ.470 కోట్లతో అనుమతులివ్వడం సంతోషదాయకమన్నారు. అంతకుముందు నారాయణమూర్తిని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ రాగే హరిత, వైఎస్సార్‌సీపీ నాయకులు చామలూరు రాజగోపాల్ వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీతలు బండి నారాయణస్వామి, డాక్టర్ శాంతినారాయణ ఘనంగా సత్కరించారు. ఈ సభకు ఉప్పరపాటి వెంకటేశు అధ్యక్షత వహించగా, రాయలసీమ ఉద్యమ నాయకులు బొజ్జా దశరథరామిరెడ్డి, మాలపాటి అశోకవర్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి
బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



ఇబ్రహీంపట్నం(మైలవరం): బీసీ సామాజికవర్గాలు నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని రాజకీయ ప్రాధాన్యత సాధించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండలోని ఆర్కే కళాశాలలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ నాయకులకు ఆదివారం రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సమాజంలో వివిధ వర్గాలతో సంఘాలు ఏర్పాటు చేయడం రాజకీయ నాయకుని లక్షణమన్నారు. బీసీలకు 50% రాజకీయ రిజర్వేషన్‌ల బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టే వరకు పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. రాజకీయ విశ్లేషకుడు వైవీ రావు నాయకత్వ లక్షణాలు, రాజకీయ ఎదుగుదల, సమాజంలో బీసీల ప్రాధాన్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, జాతీయ కార్యదర్శి వై.నాగేశ్వరరావు, రాష్ట్ర ఇన్‌చార్జ్ వై.నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చకచకా సదుపాయాలు

జోరుగా నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు

- ఇప్పటికే 2 లక్షలకుపైగా గృహ నిర్మాణాలు పూర్తి
- వెంటనే నీరు, విద్యుత్ సరఫరాకు అధిక ప్రాధాన్యం
- వైఎస్సార్ జగనన్న కాలనీలకు స్వాగత ఆర్చ్‌ల నిర్మాణాలు


వైఎస్సార్-జగనన్న కాలనీల్లో నిర్మించనున్న స్వాగత ఆర్చ్ నమూనా


కాకినాడ జిల్లా జగ్గంపేట డివిజన్ మురారి గ్రామంలోని వైఎస్సార్-జగనన్న కాలనీలో ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్న సిబ్బంది

సాక్షి, అమరావతి: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలను చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు చకచకా విద్యుత్, నీటి సరఫరా కనెక్షన్లను అందచేస్తోంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా పేద కుటుంబాలకు పక్కా నివాసాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పిస్తున్న విషయం తెలిసిందే. దీంతో వైఎస్సార్-జగనన్న కాలనీల రూపంలో ఏకంగా పట్టణాలే నిర్మితమవుతున్నాయి. ఇప్పటివరకూ రెండు దశల్లో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇందులో 2.62 లక్షలు టిడ్కో ఇళ్లు కాగా, మిగిలిన 18.63 లక్షలు సాధారణ గృహాలు. సాధారణ ఇళ్లలో 16.67 లక్షల గృహాల శంకుస్థాపనలు పూర్తి కాగా, నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ఇళ్లు నిర్మిస్తున్న 17 వేల కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఏకంగా రూ.32 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది.

8,485 లేఅవుట్లలో విద్యుత్ సర్వే పూర్తి

ఇంటి నిర్మాణాలు కొనసాగుతున్న 8,485 లేఅవుట్లలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన సర్వే పూర్తయింది. 3,248 లేఅవుట్లలో విద్యుత్ స్తంభాలు నాటడం, వైర్లు లాగడం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు లాంటి పనులు చకచకా కొనసాగుతున్నాయి. 1,411 లేఅవుట్లలో పనులు పూర్తయ్యాయి. నీటి సరఫరాకు సంబంధించి 1,561 లేఅవుట్లలో పనులు ప్రారంభించారు. 6,012 లేఅవుట్లలో పనుల కోసం టెండర్లు ఆహ్వానించారు.

1.40 లక్షలకు పైగా ఇళ్లకు విద్యుత్, నీటి కనెక్షన్లు

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకూ 2.09 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో 1,46,440 ఇళ్లకు విద్యుత్, 1,40,986 ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇచ్చారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్మాణాలు పూర్తయిన వెంటనే విద్యుత్, నీటి సరఫరా కనెక్షన్లు ఇచ్చేలా గృహ నిర్మాణ శాఖ చర్యలు చేపట్టింది. వైఎస్సార్-జగనన్న కాలనీలకు స్వాగత ఆర్చ్‌లను ప్రభుత్వం నిర్మిస్తోంది. 50 ఇళ్లకు పైగా ఉన్న లేఅవుట్లలో స్వాగత ఆర్చ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే రూ.50 కోట్లతో 1,127 లేఅవుట్లలో ఆర్చ్‌ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు.

వసతులపై ప్రత్యేక దృష్టి



వైఎస్సార్-జగనన్న కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాం. నిర్మాణం పూర్తయిన ప్రతి ఇంటికి వెంటనే నీరు, విద్యుత్ సరఫరా కనెక్షన్లు ఇవ్వాలని సీఎం జగన్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు లబ్ధిదారులతో సమన్వయం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్నారు. నిర్మాణం తుది దశకు చేరుకున్న సమయంలో నీరు, విద్యుత్ కనెక్షన్ల కోసం ఏర్పాట్లు చేస్తున్నాం. డ్రెయిన్ల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటున్నాం.

– అజయ్ జైన్, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

మరోసారి అలజడికి టీడీపీ నేతల యత్నం

- కండిషన్ బెయిల్ సంతకాల పేరిట మాచర్లలో రోడ్‌షోకు సిద్ధం
- ముందుగానే కార్యకర్తలను పట్టణానికి పిలిపించిన నేతలు
- పోలీసుల అప్రమత్తతతో కుట్రలకు చెక్


మాచర్ల పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లే దారిలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

మాచర్ల: కండిషన్ బెయిల్ పేరుతో టీడీపీ నేతలు మాచర్లలో అలజడి సృష్టించేందుకు మరోమారు విఫలయత్నం చేశారు. గత నెల 16వ తేదీన 'ఇదేం ఖర్మ' కార్యక్రమం పేరుతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి 12వ వార్డులో ర్యాలీగా వెళ్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేసి ముగ్గురిపై హత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితుల ఫిర్యాదు మేరకు బ్రహ్మారెడ్డి మరో 23 మందిపై కేసు నమోదైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ తీసుకున్న నిందితులందరూ కండీషన్ బెయిల్‌కు సంబంధించి పట్టణ పోలీసు స్టేషన్‌లో సంతకాలు చేయాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. ఆదివారం సంతకాలు చేసేందుకు బ్రహ్మారెడ్డి, టీడీపీ నాయకులు వస్తున్న నేపథ్యంలో అలజడి సృష్టించాలని వ్యూహం పన్నారు. ఇందులో భాగంగా మాచర్లకు తరలి రావాలంటూ వారి అనుచర వర్గానికి సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని పసిగట్టిన పోలీసులు నిఘాను కట్టుదిట్టం చేశారు. పోలీసు 30 యాక్టు, 144 సెక్షన్ అమలు చేస్తూ నెహ్రూనగర్ నుంచి పట్టణ పోలీసు స్టేషన్ వరకు గురజాల డీఎస్పీ మెహర్ జయరాం ప్రసాద్, సీఐ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. దీంతో ఇతరులు అక్కడికి వచ్చి అలజడి సృష్టించే అవకాశం లేకపోయింది. కేవలం బ్రహ్మారెడ్డి, ఆయన అనుచరులు మాత్రమే 12.30 గంటలకు బస్సులోంచి చేతులూపుతూ వచ్చి సంతకాలు చేసి వెళ్లారు.

న్యాయ విచారణలో రాజకీయ వ్యాఖ్యలు అవాంఛనీయం

- అలాంటి వ్యాఖ్యలు చేయకుండా చూడండి
- హైకోర్టుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: న్యాయస్థానాలు, న్యాయమూర్తులు, న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిపై ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు, తమకు అపార గౌరవం ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ నొక్కి వక్కాణించారు. ఏదైనా ఉంటే తీర్పులో రాస్తే దాన్ని గౌరవంగా అమలు చేస్తామని తెలిపారు. తీర్పుపై విభేదిస్తే అప్పీల్ చేస్తామన్నారు. కానీ, ఇలా చేయకుండా జడ్జి రాజకీయ పార్టీల మాదిరిగా మాట్లాడుతూ.. ఎల్లో మీడియా, దుష్ట చతుష్టయానికి ఉపయోగపడేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజకీయ పార్టీల మాదిరిగా న్యాయమూర్తి వ్యాఖ్యలు చేస్తే ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ స్ఫూర్తిని, న్యాయవ్యవస్థ గౌరవాన్ని ఏ విధంగా కాపాడుకున్న వాళ్లమవుతామని అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం మాణిక్య వరప్రసాద్ మీడియాతో మాట్లాడారు. ఇటీవల హైకోర్టులో ఒక న్యాయమూర్తి చేస్తున్న వ్యాఖ్యలకు ఎల్లో మీడియా తనదైన వక్రభాష్యం చెబుతూ కథనాలు అచ్చేస్తోందన్నారు. న్యాయ వ్యవస్థను పక్కదారి పట్టించి, తమకు కావాల్సిన రాజకీయ ప్రయోజనాల కోసం ఆ వ్యాఖ్యలను రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయన్నారు. ఇటీవల ఒక న్యాయమూర్తి కోర్టులో లేని అంశాలను ప్రస్తావిస్తూ ఎన్నికలు తొందరగా వస్తాయని వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. అందులో ఆయన ఉద్దేశం ఏమిటో తమకు అర్థం కావడం లేదన్నారు. న్యాయమూర్తి వ్యాఖ్యలపై వెంటనే అడ్వొకేట్ జనరల్ స్పందించి.. ఎన్నికలు నిర్దేశిత సమయంలోనే జరుగుతాయని తేల్చిచెప్పారన్నారు. ఆ న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై న్యాయ వ్యవస్థలో ఉన్న పెద్దలు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కోర్టులో వాదనలు జరిగేటప్పుడు న్యాయమూర్తులు వ్యక్తిగతంగా రాజకీయ వ్యాఖ్యలు చేయకుండా చూడాలని హైకోర్టుకు ఆయన విన్నవించారు. వాదనల సందర్భంగా న్యాయమూర్తులు చేస్తున్న కొన్ని వ్యాఖ్యలు రాజకీయ పార్టీలు, కొన్ని సంస్థలు, విద్రోహశక్తులకు ఉపయోగపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కోర్టుల్లో ఉన్న రాజధాని అంశంపై వ్యాఖ్యలా?

రాజకీయ వ్యాఖ్యలు చేయకుండా సంయమనం పాటించాలని న్యాయమూర్తులకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సూచించారని మాణిక్యవరప్రసాద్ గుర్తుచేశారు. ఇటీవల చెన్నై కోర్టు ఒక కేసులో ఎన్నికల సంఘంపై హత్య కేసు నమోదు చేయాలని ఆదేశించడంపై సుప్రీంకోర్టు.. అలా పరిధి దాటి మాట్లాడకూడదని చెన్నై కోర్టుకు దిశానిర్దేశం చేసిందన్నారు. ఏపీకి రాజధాని ఎక్కడో తెలియదని తన కుమార్తె అన్నారని ఇటీవల ఓ న్యాయమూర్తి వ్యాఖ్యలు చేశారని ఆయన గుర్తుచేశారు. రాజధాని అంశంపై హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో విచారణ సాగుతోందని, ఈ సమయంలో దానిపై వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు.

ఆ వ్యాఖ్యలపై ఆత్మపరిశీలన చేసుకోవాలి..

గతంలో ఎన్నడూ లేని రీతిలో ఎస్సీల సంక్షేమం, అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వంపై కొన్ని రాజకీయ పార్టీలు, ఎల్లో మీడియాకు ఉపయోగపడేలా న్యాయమూర్తి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు వాంఛనీయం? సబబు? అని మాణిక్య వరప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయ పార్టీలకు ఎన్నో లక్ష్యాలు ఉంటాయని.. వాటి సాధనలో ఆ పార్టీలే మార్గాలు చూసుకుంటాయని తెలిపారు. వాటికి మీ సహకారం అవసరమా... అనేది ఆలోచించుకోవాలన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా రాజకీయ వ్యాఖ్యలు చేయడంపై న్యాయమూర్తి ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్యవైశ్యులు సామాజికసేవలో ముందుండాలి

- ఆర్యవైశ్యుల గౌరవాన్ని పెంపొందిస్తున్న సీఎం వైఎస్ జగన్
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- ఘనంగా 'అవోపా' స్వర్ణోత్సవాలు


కోలగట్లను సన్మానిస్తున్న శివస్వామి తదితరులు

పాత గుంటూరు: ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) స్వర్ణోత్సవాలను ఆదివారం గుంటూరులో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అవసరమైన సూచనలు ఇస్తూ అవోపా దిక్సూచిగా పనిచేస్తుందని చెప్పారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని, రాజకీయాల్లోనూ క్రియాశీలకంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆర్యవైశ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం, గౌరవం పెంపొందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆత్మార్పణ చేసిన 'అమరజీవి' పొట్టి శ్రీరాములు త్యాగానికి గుర్తుగా నవంబరు ఒకటో తేదీనే ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా ప్రకటించారని చెప్పారు. ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసే సన్నివేశాలు ఉన్న 'చింతమణి' నాటకాన్ని రాష్ట్రంలో నిషేధించారని గుర్తుచేశారు. ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవాలయాలు, సత్రాల నిర్వహణను సైతం ఎంతో నమ్మకంతో ఆర్యవైశ్యులకు అప్పగించారని వివరించారు. గత ప్రభుత్వాలు ఆర్యవైశ్యులను అనేక వేధింపులకు గురిచేశాయని, ఆర్యవైశ్యులకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం కోలగట్ల వీరభద్రస్వామిని శివస్వామి, అవోపా నాయకులు సన్మానించారు. అవోపా గౌరవాధ్యక్షుడు టీజీ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డెప్యూటీ కలెక్టర్ గ్రంధి వెంకటేష్, అవోపా నేతలు టి.రాంబాబు, డి.వెంకటేశ్వర్లు, అరవేటి నిర్మల, ఎం.శ్రీనివాసరావు, అన్నా నందకిషోర్, కేవీ బ్రహ్మం, రాధాకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ నాయకత్వాన్ని జూనియర్ ఎన్టీఆర్ సమర్థించడం లేదు: లక్ష్మీపార్వతి



తిరుమల: లోకేశ్ నాయకత్వాన్ని జూనియర్ ఎన్టీఆర్ సమర్థించడం లేదని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి చెప్పారు. ఆమె ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు టీడీపీ వాళ్లు అబద్ధాలు సృష్టిస్తున్నారని, తనకు తెలిసినంతవరకు జూనియర్ ఎన్టీఆర్ టీడీపీలోకి రావడం లేదని చెప్పారు. లోకేశ్ నాయకత్వాన్ని సమర్థించేందుకు జూనియర్ ఎన్టీఆర్ సిద్ధంగా లేరన్నారు. ఎవరు ఎన్ని అబద్ధాలు ఆడినా, ఎన్ని కుట్రలు చేసినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆపలేరని స్పష్టంచేశారు.

ప్రకృతి సాగు.. బహు బాగు

- రాష్ట్రంలో మూడున్నరేళ్లలో మూడు రెట్లు పెరిగిన సాగు విస్తీర్ణం
- 2022–23లో ప్రకృతి సాగు లక్ష్యం 11.46 లక్షల ఎకరాలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలో ప్రకృతి సాగు విస్తరిస్తోంది. రైతు భరోసా కేంద్రాల స్థాయిలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల ఫలితంగా రైతులు పెద్ద సంఖ్యలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ.. అద్భుతాలు సృష్టిస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో సైతం ఏడాది పొడవునా పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3,730 గ్రామాల్లో 7 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. మూడున్నరేళ్లలో రైతుల సంఖ్య నాలుగు రెట్లు.. విస్తీర్ణం మూడు రెట్లు పెరిగింది. వచ్చే పదేళ్లలో 28 లక్షల మందిని ప్రకృతి సాగు వైపు మళ్లించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

ఏటా పెరుగుతున్న ప్రకృతి సాగు..

2018–19 నాటికి రాష్ట్రంలో 1,76,504 మంది రైతులు 2,32,937 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేవారు. 2019–20లో 4,41,953 మంది రైతులు 4,48,785 ఎకరాల్లో.. 2020–21లో 5,06,629 మంది రైతులు 4,78,844 ఎకరాల్లో.. 2021–22లో 6,30,441 మంది రైతులు 7,22,244 ఎకరాల్లో ప్రకృతి సాగు చేశారు. 2022–23లో 10,56,745 రైతుల ద్వారా 11,45,933 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. గడిచిన ఖరీఫ్ సీజన్‌లో రికార్డు స్థాయిలో 7,04,844 మంది రైతులు 7,54,499 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేశారు. తొలకరి పంటలో ఇదే రికార్డు. రబీలో 4 లక్షల ఎకరాలు దాటే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

హైదరాబాద్-విజయవాడ మధ్య ఆర్ఆర్‌టీఎస్ రైలు!

▶ మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్–సికింద్రాబాద్ మార్గంలో నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది.

ఏమిటీ ఆర్ఆర్‌టీఎస్..

ఇంటర్‌సిటీ రైలు సర్వీసుల్లో ఆర్ఆర్‌టీఎస్ వ్యవస్థ అత్యాధునికమైనది. మెట్రో రైళ్లు ఓ నగర పరిధిలో సేవలందిస్తాయి. రెండు లేదా అంతకంటే ఎక్కువ నగరాల మధ్య ఇంటర్‌సిటీ సర్వీసులుగా ఆర్ఆర్‌టీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. విద్య, ఉద్యోగ, వ్యాపార తదితర అవసరాల కోసం ప్రయాణికులు అత్యధికంగా రాకపోకలు సాగించే సమీపంలోని ప్రధాన నగరాల మధ్య ఏర్పాటు చేసే వ్యవస్థే ఆర్ఆర్‌టీఎస్. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆర్ఆర్‌టీఎస్ ఏర్పాటు చేస్తాయి. అందుకోసం ప్రత్యేక కారిడార్ ఏర్పాటుచేసి, రైల్వేశాఖతో నిమిత్తం లేకుండా ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి సమాంతరంగా నిర్వహిస్తాయి. తొలిసారిగా 1998–99లో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది. రెండు దశాబ్దాల తరువాత తొలి ఆర్ఆర్‌టీఎస్ వ్యవస్థను ఢిల్లీ–మీరట్ మధ్య ఏర్పాటు చేస్తున్నారు.

అత్యున్నత ప్రమాణాలతో ఆధునిక రైలు ప్రయాణం

ఆర్ఆర్‌టీఎస్ రైళ్లు అత్యాధునిక ప్రమాణాలతో ప్రత్యేక ప్రయాణ అనుభూతి కలిగిస్తాయి. రైల్వే కోచ్‌లలో రెక్లయినర్ సీట్లు, విశాలమైన నడవా, ప్రతి సీటుకు ప్రయాణించే రూట్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకంగా లగేజీ ర్యాక్‌లు, మొబైల్ ఫోన్లు/ల్యాప్‌టాప్ చార్జింగ్ సాకెట్లు ఉంటాయి. సీసీటీవీ కెమెరాలు, డబుల్ గేజ్ అద్దాల కిటికీలు, ఫైర్/స్మోక్ డిటెక్టర్లు మొదలైన ఆధునిక భద్రతా ప్రమాణాలతో కోచ్‌లను రూపొందిస్తారు. ప్రయాణికుల కోసం రైల్వే స్టేషన్లలో ప్రత్యేక లాంజ్ ఏర్పాటు చేస్తారు. ఆర్ఆర్‌టీఎస్ వ్యవస్థతో గంటకు 160 కిలోమీటర్ల నుంచి 200 కిలోమీటర్ల వేగంతో ఆధునిక రైలు ప్రయాణ అనుభూతిని ఆస్వాదించవచ్చును.

మరో రెండింటికి ఓకే..

దేశం మొత్తం మీద రైల్వేశాఖతో నిమిత్తంలేకుండా 1,835 కిలోమీటర్ల మేర మెట్రో, ఆర్ఆర్‌టీఎస్ లైన్లుగా కేటాయించారు. వాటిలో 824 కిలోమీటర్లు మెట్రోరైల్ లైన్లు కాగా మిగిలిన 1,011 కిలోమీటర్లను ఆర్ఆర్‌టీఎస్ పరిధిలోకి చేర్చారు. తరువాత ఢిల్లీ–హరిద్వార్, ఢిల్లీ–అల్వార్, ఢిల్లీ–జైపూర్, ఢిల్లీ–చండీగఢ్, రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలోని హైదరాబాద్–విజయవాడ, హరియాణలోని ఫరీదాబాద్–గురుగావ్, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో–కాన్పూర్ మధ్య ఆర్ఆర్‌టీఎస్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. వీటిలో ఢిల్లీ–హరిద్వార్, ఢిల్లీ–అల్వార్ ప్రాజెక్టులు ఓకే అయ్యాయి. వీటి తరువాత ఐదు ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రతిపాదనలు వచ్చాయని ఢిల్లీలోని నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎన్‌సీఆర్‌టీసీ) ఎండీ వినయ్‌కుమార్ సింగ్ వెల్లడించారు. ఆర్ఆర్‌టీఎస్ కారిడార్ నిర్మాణానికి ప్రస్తుత అంచనాల ప్రకారం కిలోమీటరుకు రూ.370 కోట్ల వ్యయం అవుతుంది. 2024 చివరకు హైదరాబాద్–విజయవాడతోపాటు ఇతర ఆర్ఆర్‌టీఎస్‌ల నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందించే ప్రక్రియ చేపడతామని ఎన్‌సీఆర్‌టీసీ వర్గాలు చెప్పాయి.



మొత్తం గొప్ప సాహిత్యంలో ఉన్నది ఈ రెండింట్లో ఏదో ఒక కథ: ఒక మనిషి ఏదో ప్రయాణం కట్టడం లేదా ఒక కొత్తమనిషి నగరంలోకి ప్రవేశించడం.
– లియో టాల్‌స్టాయ్

సాక్షి

సోమవారం, జనవరి, 9

ప్రవక్త వాణి

అల్‌ముస్తఫా వెళ్లిపోవాల్సిన సమయం వచ్చేసింది. పన్నెండేళ్లుగా ఉంటున్న ఆర్ఫాలీస్ ద్వీప నగరాన్ని ఇక విడిచిపెట్టాలి. సముద్రాన్ని దాటిస్తూ తన జన్మస్థలానికి తిరిగి చేర్చగలిగే సరైన(?) ఓడ వచ్చేస్తోంది. కానీ నగరవాసులు ఆయన్ని వదిలిపెడతారా? వియోగం వచ్చేంతవరకూ ప్రేమలోని లోతు తెలియదు కదా! నువ్వు మాకు అతిథివి కావు, మాలో ఒకడివి, మాకు ప్రియమైనవాడివి, మా కలలకు కలలిచ్చేందుకు నీ యవ్వనాన్ని ధారబోసినవాడివి, నువ్వు ఎలా వెళ్లగలవని వాళ్లు నిలదీయరా? తనకోసం చాలులోనే నాగలి వదిలేసివచ్చిన మనిషికి ఏం జవాబివ్వాలి? తనకోసం ద్రాక్షసారా యంత్ర చక్రాన్ని ఆపి పరుగెత్తుకొచ్చినవాడికి ఏం చెప్పాలి? హృదయం విరగకాసిన పళ్ల చెట్టయి వాటన్నింటినీ రాల్చితే? వారి పాత్రలను కోర్కెల జలధారై నింపితే? సర్వేశ్వరుడి శ్వాసను తనలోంచి పోనిచ్చే వేణువు అయితే? నిశ్శబ్దాల్లో కనుగొన్న నిధిని మాటల ద్వారా పంచితే? వారిని సముద్రపు అలలు వేరుపరచకముందే వీడ్కోలు చెప్పడానికి ఒకరి వెంట ఒకరు రావడంతో అక్కడ గుంపు పోగైంది. అలా విడిపోబోయే రోజే సమావేశపు రోజు కూడా అయ్యింది. అందరూ నెమ్మదిగా మందిరం వైపు అడుగులు వేశారు. మందిరంలోంచి యోగి అల్‌మిత్ర బయటికి వచ్చింది. వాళ్లందరి తరఫునా ఆమె మేము మా పిల్లలకు, ఆ పిల్లలు వారి పిల్లలకు చెప్పుకొనేలా జనన మరణాల మధ్యలి సత్యాన్ని తెలియజేయమని కోరింది. జనంలో గమనించిన సత్యాన్ని జనానికే చెప్పడానికి పూనుకొంటాడు అల్‌ముస్తఫా.

లెబనాన్ మూలాలున్న అమెరికన్ కవి ఖలీల్ జిబ్రాన్(6 జనవరి 1883–10 ఏప్రిల్ 1931) రచన 'ద ప్రాఫెట్'కు ఇదీ భూమిక. నూరేళ్లుగా అన్ని ప్రపంచ భాషల్లోకీ మళ్లీ మళ్లీ అనువాదమవుతూ, ఇప్పటికీ కొత్త ఆసక్తి రేపుతున్న ఈ మహత్తర రచన 1923లో ప్రచురితమైంది. వచన కవిత్వం రూపంలో జిబ్రాన్ తన పాఠకులకు ఎన్నో అంశాల మీద సున్నితమైన దృక్కోణాన్ని ఇస్తారు. 'ప్రేమ'తో మొదలైన సంభాషణ– తాపీమేస్త్రి, నేత కార్మికుడు, సత్రం నిర్వాహకుడు, పిల్ల తల్లి, న్యాయమూర్తి ఇలా ఒక్కొక్కరూ తమ సందేహాలను తీర్చమనడంతో అల్‌ముస్తఫా–– పెళ్లి, పిల్లలు, కాలం, జ్ఞానం, మంచి, చెడు, ప్రార్థన, దయ, ఆనందం, అందం, మతం, ఇవ్వడం... ఇలా అన్నింటికీ సమాధానాలు ఇస్తూపోతాడు. ప్రేమ తప్ప ఇంకేమీ ఇవ్వని ప్రేమ ప్రాధాన్యతను ప్రేమగా చెబుతాడు. మీ పిల్లలు మీ పిల్లలు కాదు; వాళ్లు మీ ద్వారా వస్తారు కానీ మీ నుంచి కాదు; వాళ్లు మీతో ఉన్నప్పటికీ మీకు చెందరంటాడు. నీకు ఎంతో ప్రియమైనవాళ్లు ఆ ఇంటిలో నివసిస్తారన్నట్టుగా ఒక ఇంటిని నిర్మించమని చెబుతాడు. ఆకలి కోసం ఒక సీమరేగిపండు తిన్నాకూడా దాని విత్తనాలు నీ శరీరంలో పెరుగుతాయన్నంత స్పృహతో ఆ పనిచేయమని చెబుతాడు. ఆనందమూ దుఃఖమూ వేర్వేరు కాదు; నీ హృదయానికి సాంత్వన ఇచ్చే వేణువు కూడా కత్తి గాట్లకు గురైందని అంటాడు. జీవితాన్ని ఎంత సుతారంగా, సుందరగా సమీపించవచ్చో అత్యంత మృదువుగా, సరళంగా వివరిస్తాడు.

స్వయంగా చిత్రకారుడు కూడా అయిన జిబ్రాన్ పుస్తకంలోని పన్నెండు చిత్రాలను స్వయంగా గీశారు. విడుదలైన సంవత్సరం ప్రచురించిన రెండు వేల కాపీలకుగానూ 1,500 మాత్రమే అమ్ముడుపోయింది. కానీ ఆ తర్వాత అది పునర్ముద్రణలు వరుసగా పొందుతూనే ఉంది. లక్షల కాపీలు అమ్ముడుపోయిన ఈ పుస్తకం ఒక దశలో వారంలో సగటున 5,000 కాపీలు ఎక్కడో ఓచోట అమ్ముడవుతూనే ఉంది. ఈ నూరేళ్లలో ఏ ఒక్క సందర్భంలోనూ ఈ చిరుపొత్తం అచ్చులో లేకుండా లేదు. ఒక ఆధ్యాత్మిక స్ఫూర్తిని రగిలించేట్టుగా రాయడం వల్ల ఇది తరచుగా బహుమానాలు ఇచ్చుకునే పుస్తకంగా కూడా ఉంటోంది. అయితే మేధావులు మాత్రం దీన్నొక పంచదార పాకంగా భావించకపోలేదు.

'శాండ్ అండ్ ఫోమ్', 'ద వాండెరర్' లాంటి ఇతర ప్రసిద్ధ రచనలు కూడా వెలువరించిన జిబ్రాన్– అరబిక్, ఆంగ్లం రెండు భాషల్లోనూ రాయగలరు. ఆయన్ని బహాయీ, సూఫీ మతాలు విశేషంగా ఆకర్షించాయి. వాటి అంతస్సారమైన నిశ్శబ్దం, ప్రేమ 'ద ప్రాఫెట్' నిండుగా పరుచుకొని ఉంటాయి. చిత్రంగా జిబ్రాన్ తల్లిదండ్రులు క్రైస్తవులు. తాతల కాలంలో ముస్లింలు. అలా అన్ని మతాలనూ ఇముడ్చుకునే గుణం ఆయనకు చిన్నతనంలోనే అలవడింది. అందుకే ఒక చోట నేను నీ మసీదులో, నీ చర్చిలో, నీ సినగాగ్‌లో కూడా ప్రార్థిస్తాను అంటాడు. ప్రపంచంలో శాంతి నెలకొనాలంటే అన్ని మతాల మధ్య సమన్వయం జరగాలన్న భావన ఆయనది. దానికి కావాల్సిన హృదయ వైశాల్యాన్ని పెంచేదిగా ఈ పుస్తకం ఉంటుంది. ప్రతి ఒక్క చెడుకూ ప్రతి ఒక్కరూ బాధ్యులేనన్న సామూహిక ఇచ్ఛ ఇందులో దర్శనమిస్తుంది. వ్యాపారంలో ప్రేమ, కరుణపూరిత న్యాయం చూపకపోతే, అది కొందరి దురాశకూ, మరికొందరి ఆకలికీ కారణమవుతుందని చెబుతుంది.

అల్‌ముస్తఫా నిజానికి వెళ్లింది స్వస్థలానికేనా? తన కాలం ముగిసి, మళ్లీ మరో జీవితపు చక్రానికి సిద్ధం చేసే సముద్రాన్ని దాటాడు. ఇప్పుడిక జీవితం అనేది ఒక కల. అనంత శక్తి ప్రవాహంలో లిప్తకాలపు జీవులం మనం. ఈ భావన మనశ్శాంతినీ, సాంత్వననూ ప్రసాదిస్తుంది. జీవితం నుంచి ఒక విముక్త భావనను కలిగిస్తుంది. ముఖ్యంగా మతాల్లోని అసలైన ఆధ్యాత్మిక గంధం ఇగిరిపోయి, కేవలం అవి బల ప్రదర్శనలకు మాత్రమే పనికొస్తున్నప్పుడు– అన్ని జీవుల్లోనూ దేవుడిని చూసుకోవడమనే ప్రాచ్య భావనను రేకెత్తిస్తుంది. పుస్తకం ఒక పంచదార పాకమే కావొచ్చు. కానీ ఈ కల్లోల ద్వేషాల కాలంలో అప్పుడప్పుడూ నోటికి అత్యవసరమైన తీపి!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** బ.విదియ ఉ.7.34 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ఆశ్లేష పూర్తి (24గంటలు), **వర్జ్యం:** రా.6.53 నుండి 8.39 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.30 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.40 నుండి 3.23 వరకు, **అమృతఘడియలు:** తె.5.32 నుండి ఉ.7.17 వరకు (తెల్లవారితే మంగళవారం).

సూర్యోదయం : 6.37
సూర్యాస్తమయం: 5.37
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

కుట్రపూరితం వీధి నాటకం!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

ఒకనాడు కొండంత రాగం తీసిన మన తెలుగు పద్యనాటక వైభవం అంతరించిందని చింతించవలసిన అవసరం లేదు. రంగస్థలం మీద మహేంద్ర జాలం చేయగలిగిన సురభి వారి ప్రజ్ఞా ధురీణత మాయమైపోయిందని బాధ పడనవసరం లేదు. ఇప్పుడు తెలుగు దేశం పార్టీ వారు ఆ లోటును తీర్చేస్తున్నారు. నిజ రాజకీయాన్నే వీధి నాటకంగా మార్చి అధునాతన కళా కౌశలాన్నంతా అందులో రంగరిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల వ్యూహకర్తగా రాబిన్‌సింగ్ అనే ఆయన వ్యవహరిస్తున్నారట! చంద్రబాబు సభలకు వస్తున్న జనం సంఖ్య, వారి స్పందన ఆయనకు నిరాశ కలిగించిందట!

ఈ మేరకు పార్టీ నాయకత్వానికి తన అభిప్రాయాలను వ్యూహకర్త నివేదించారట. జనం నాయకుని కోసం ఎదురు చూస్తున్నట్టుగా, నాయకుని కోసం ఎగబడుతున్నట్టుగా చిక్కగా తనకు విజువల్స్ కావాలని, అందుకు ఏర్పాట్లు చేయాలని అడిగారట. పార్టీ మేధో బృందం ఓ మూడు పద్ధతులను ఇందుకోసం రూపొందించింది. మొదటిది కుంభాకార దర్పణ (convex lens) టెక్నిక్. రెండోది ప్రలోభ (luring) టెక్నిక్, మూడోది కట్–పేస్ట్ టెక్నిక్.

మొదటి పద్ధతికి ఉదాహరణ కందుకూరు విషాదం. కుంభాకార దర్పణం అంటే గోరంతను కొండంతగా చూపడమన్నమాట. సభకు వచ్చిన జనాన్ని పది పన్నెండింతలు పెంచి చూపెట్టే ప్రయత్నం. ఈ ప్రయోగం ఫలితమే కందుకూరు విషాదం. పోలీసులు అనుమతించిన సర్కిల్‌లోనే సభ జరిగి వుంటే ఎనిమిది ప్రాణాలు పోయేవి కాదు. కానీ సభ పేలవంగా జరిగినట్టు కనిపించేది. జనాకర్షణలో బాబు బలహీనత స్పష్టంగా తెలిసేది. అందుకని పక్కనే ఉన్న ఇరుకు సందులోకి వచ్చిన రెండువేల మందిని గొర్రెల మందను మళ్లించినట్టుగా తరిమేశారు. సందులో ఒత్తిడి పెరిగింది. వాళ్లు తిరిగి సర్కిల్‌లోకి రాకుండా చంద్రబాబు తన వాహనాన్ని 50 మీటర్లు ముందుకు ఉరికించి సందుకు అడ్డంగా నిలబెట్టారు. సీసా మూతికి బిరడా బిగించినట్టుగా తొక్కిసలాట మొదలైంది. అదే టీడీపీ బృందానికి కావల్సింది.

రెండో టెక్నిక్‌ను ప్రయోగాత్మకంగా గుంటూరులో అమలు చేశారు. సమాజ సేవనే గాలిగా పీల్చుకునే ఒకానొక ఎన్‌ఆర్‌ఐ మహానుభావుడు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాడని చెబుతున్నారు. ఆ వ్యక్తిపేరు ఉయ్యూరు శ్రీనివాస్. కార్యక్రమానికి అనుమతి మాత్రం టీడీపీ తీసుకున్నది. వచ్చినవాళ్లకు ఈ మహానుభావుడు చీరెసారెలు పంచుతారని పది రోజులపాటు ప్రచారం చేసుకున్నారు. సుమారు 30 వేలమందికి టోకెన్లు పంచారట. వచ్చినవాళ్లకు కానుకలు పంచకుండా చంద్రబాబు వచ్చేంతవరకు నాలుగు గంటలపాటు కూర్చోబెట్టారు. చంద్రబాబు ప్రసంగిస్తున్నంతసేపు డ్రోన్ కెమెరాలు వాటి పని అవి నిర్వర్తించాయి. 'బాబుకోసం తండోపతండాలుగా తరలివచ్చి ఆయన ఉపన్యాసాన్ని వింటున్న జనం' అనే కాన్సెప్టుకు తగినట్టు ఫోటోలు తయారుచేసుకున్నారు. పాపం వచ్చిన వారు మాత్రం 'చిత్తం శివుడి మీద భక్తి చెప్పుల మీద' అన్నట్టుగా కానుకల కోసం ఎదురు చూస్తున్నారు. చంద్రబాబు వెళ్లిపోయిన తర్వాత రెండువేల మందికి సరిపడా తెచ్చిన కానుకలను బిస్కెట్ల మాదిరిగా విసిరేశారు. ఫలితంగా దుర్ఘటన చోటుచేసుకున్నది. ఉయ్యూరు శ్రీనివాస్ తరహా సంఘసేవకులను మరో పదిహేను మందిని చంద్రబాబు సిద్ధం చేసి ఉంచారని చెబుతున్నారు. ఎన్నికలయ్యేవరకు నెలకొకరు చొప్పున గుంటూరు తరహా చీరెసారెల సభలు నిర్వహించాలి. అందుకుగాను సదరు సేవకుల అభిరుచిని బట్టి ఎమ్మెల్యే టిక్కెట్లు గానీ, గెలిస్తే కాంట్రాక్టులు గానీ హామీ ఇచ్చారట!

ఇక మూడో టెక్నిక్ – 'కాపీ–పేస్ట్' పద్ధతి. బహుశా సోషల్ మీడియాకే పరిమితం చేస్తారు కాబోలు. కర్ణాటకలో సిద్ధేశ్వర స్వామి అనే మఠాధిపతి చనిపోతే ఆయన అంతిమయాత్రకు రెండు లక్షలమంది హాజరయ్యారు. ఆ ఫొటోను తెచ్చి చంద్రబాబు కుప్పం పర్యటనలో పాల్గొన్న జనసందోహమంటూ ప్రచారంలో పెట్టారు. ఎవరూ కనిపెట్టి కౌంటర్ చేయకపోతే ఇటువంటి ఫోటోలతో సోషల్ మీడియా ప్రచారం ముమ్మరంగా సాగించే అవకాశమున్నది. ఎన్నికలు దగ్గరపడేకొద్దీ ఏదో ఒకరోజున అన్నాదురై అంతిమయాత్ర ఫోటో కూడా టీడీపీ ఖాతాలో పడుతుందేమోనని భయంగా ఉన్నది. కోటిన్నర మంది పాల్గొని ప్రపంచంలోనే అతి పెద్ద జనసందోహంగా రికార్డయిన ఘట్టమది.



చంద్రబాబునాయుడు కుట్రపూరిత రాజకీయాల గురించి, ఆయన గురువింద నీతిపై తెరలు కప్పే ఎల్లో మీడియా మ్యాజిక్ గురించి తెలుగు ప్రజల్లో చాలామందికి తెలుసు. కానీ, ఇప్పుడు జరుగుతున్న కుట్ర మరింత ప్రమాదకరమైనది. ఈ కుట్రకు సంబంధించిన అంశాలు ఒక్కటొక్కటే ఆవిష్కృతమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని సంపన్న వర్గాలు... ముఖ్యంగా రెండున్నర పాత జిల్లాల సంపన్నవర్గాల కనుసన్నల్లో ఈ దారుణమైన కుట్ర పురుడు పోసుకున్నది. ఈ వర్గాల ప్రయోజనాలకోసం భుజంకాసే నాయకత్వ శ్రేణులు కుడినుంచి ఎడమకు అన్ని పార్టీల్లోనూ ఉన్నారు. సాంస్కృతిక సాహిత్య రంగాల నుంచి ప్రజాసంఘాల వరకు విస్తరించి ఉన్నారు. వివిధ వృత్తి సంఘాల్లోనూ పాతుకొనిపోయి ఉన్నారు. రకరకాల వ్యవస్థల్లో స్లీపర్‌సెల్స్ అవతారంలో పొంచి ఉన్నారు. కుట్రకు సంబంధించిన ప్రణాళిక, అందులో భాగస్వాములు పోషించవలసిన పాత్రల గురించి మార్గదర్శకాలు ఇప్పటికే అందరికీ జారీ అయ్యాయి. ఇంతకూ ఏమిటా కుట్ర?

ఆంధ్రరాష్ట్ర సహజ వనరులనూ, ఆదాయాలను ఇంతకాలంగా దోచుకు తింటున్న కొన్ని పందికొక్కులకు ఇప్పుడు ఊపిరి సలపడంలేదు. వాటికి 'మేత' దొరకడం లేదు. ఆ 'మేత'కు అభివృద్ధి అనే అందమైన పేరును పందికొక్కులు తగిలించుకున్నాయి. 'అభివృద్ధి ఎక్కడుందీ?' అని అవి ప్రశ్నిస్తున్నాయి. 'ఔనౌను అభివృద్ధే కానరావడం లేద'ని ఈ 'మేత' కొక్కులకు వంతపాడే నేతలంతా అభిప్రాయపడుతున్నారు. ఎల్లో మీడియా అదే పాట పాడుతున్నది. దాని అనుబంధ సోషల్ మీడియా కోరస్ పాడుతున్నది.

రెండు లక్షల కోట్ల రూపాయలను లబ్ధిదారులకు ప్రత్యక్షంగా బదిలీ చేస్తే పందికొక్కులు తవ్వుకునేదెట్లా? ఇంకో లక్షన్నర కోట్లను నవరత్నాల పేరుతో పేదవర్గాల సాధికారతకు ఖర్చుపెడితే పందికొక్కులు చిక్కిపోవా? విద్య, వైద్యం, వ్యవసాయం, చిన్న పరిశ్రమల పునరుజ్జీవం కోసం వేలకోట్లు ధారపోస్తుంటే తాము మింగేందుకు ఏం మిగులుతుంది? పతితులుగా, భ్రష్టులుగా, దగాపడిన తమ్ములుగా ముద్ర వేయించుకున్న నిరుపేదలు నిటారుగా నిలబడితే, మనుషులుగా బలపడితే చీప్ లేబర్ దొరికేదెట్లా? వనరులన్నింటినీ తమ చేతికి అందివ్వకుండా, ఆదాయాన్ని తమ నోట్లో కుక్కకుండా, చీప్ లేబర్ దొరక్కుండా ప్రభుత్వమే పూనుకుంటే ఇక 'అభివృద్ధి' ఎట్లా? ఇదే ఇప్పుడు అభివృద్ధిపై జరుగుతున్న తర్కవితర్కం.

ఈ రకమైన 'అభివృద్ధి'కి అడ్డుగోడగా నిలబడిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూలదోయాలి. యాభై శాతానికి పైగా ప్రజా మద్దతున్న ప్రభుత్వాన్ని ఓడించడం ఎలా సాధ్యం? ఆ మద్దతును తగ్గించాలి. నాన్–వైసీపీ పార్టీల ఓట్లు చీలకుండా ఒక్కచోటుకు చేర్చాలి. అలా ఒకచోటుకు చేర్చడం కోసం 'సేవ్ డెమోక్రసీ' అనే ముసుగు కావాలి. ఆ ముసుగు కోసమే వీధి నాటకాల ప్రదర్శనలు. ప్రతిపక్ష నేతల సభలకు జనం విరగబడుతున్నారన్న మూడ్‌ను సృష్టించడంతోపాటు తొక్కిసలాటలూ, గలాటాలూ జరగాలి. కొన్ని ప్రాణాలు పోయినా ఫరవాలేదు. శాంతిభద్రతలు క్షీణించాయని ప్రచారం చేసుకోవచ్చు. ప్రజా భద్రతకు ప్రభుత్వం ఏ రకమైన చర్యలు తీసుకున్నా 'సేవ్ డెమోక్రసీ' నినాదంతో అందరినీ ఏకం చేయాలి. ఇదీ ఇప్పుడు చంద్రబాబు పార్టీ, ఎల్లో మీడియాల సారథ్యంలో పెత్తందారీ వర్గాలు ప్రదర్శిస్తున్న నాటక సారాంశం. నాటకం పేరు ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక.

'సేవ్ డెమోక్రసీ' పేరుతో విజయవాడలో సకలపక్ష సమావేశం జరిగింది. పవన్ కల్యాణ్ – చంద్రబాబులు మొన్న విజయవాడలోనూ, నేడు హైదరాబాద్‌లోనూ సమావేశమయ్యారు. ఈ భేటీలకు కూడా అదే పేరు పెట్టారు. పేద పిల్లల ఇంగ్లిష్ మీడియానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన ప్రపంచ రచయితల సభలైనా, వికేంద్రీకరణకు వ్యతిరేకంగా గురిపెట్టిన ఉత్తరాంధ్ర చర్చా వేదికైనా ఈ మొత్తం కుట్రలో భాగంగానే పరిగణించాలి. తెలుగు సినిమాల ప్రీరిలీజ్ ఈవెంట్లు హైదరాబాద్ గడప దాటి ఆంధ్రలోకి ఎంట్రీ ఇవ్వడాన్ని, సినిమా నటులు నిర్వహిస్తున్న టాక్ షోలను కూడా నిశితంగా పరిశీలించవలసిన అవసరం ఉన్నదేమో!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 1 పై జరుగుతున్న ప్రచారాన్ని చూస్తుంటే దిగ్భ్రాంతికి గురికావలసి వస్తున్నది. దిగజారుడుతనం చిట్టచివరి మెట్టును కూడా దిగేసింది. అసలా జీవోలో రోడ్డు షోలపై, ర్యాలీలపై నిషేధమే లేదు. సభలను కూడా రోడ్డు మీద కాకుండా సమీపంలో ఉండే మైదానాల్లో పోలీసుల అనుమతితో నిర్వహించుకోవచ్చని చెప్పింది. జీవో అనేది బహిరంగ రహస్యం. ఎవరైనా చదువుకునే అవకాశం ఉన్నది. అటువంటి నగ్నసత్యంపై మసిపూయడానికి తెగించడం ఎల్లో మీడియా, ప్రతిపక్షాల తెంపరితనానికి నిదర్శనం. ఈ అసత్య ప్రచారం ప్రాతిపదికగా ఒక ప్రజాస్వామ్య పరిరక్షణ వేదికను నిర్మించడానికి పూనుకోవడం ఒక దుర్మార్గమైన నిస్సిగ్గు ఎత్తుగడ. ప్రజల వివేకాన్ని కూడా అవహేళన చేసే చర్య.

నిజానికి రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కులపై సైతం రాజ్యాంగ బద్ధమైన కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, క్లాజు 1లోని సబ్‌క్లాజు 'బి' ప్రకారం 'పౌరులందరికీ శాంతియుతంగా, ఆయుధాల్లేకుండా సమావేశమయ్యే హక్కు' ఉన్నది. క్లాజు 3లో ఇందుకు సంబంధించిన వివరణ కూడా ఉన్నది. దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను పరిరక్షించడానికి, 'పబ్లిక్ ఆర్డర్'ను కాపాడటానికి ఉద్దేశించి ఇప్పటికే అమలులో ఉన్న చట్టానికి కానీ, కొత్తగా చేసే చట్టానికి గానీ ఈ సమావేశ హక్కు అవరోధంగా ఉండదు. పబ్లిక్ ఆర్డర్ అనే మాటలో ప్రజల భద్రత అనే అంశం కూడా ఇమిడి ఉంటుందని న్యాయకోవిదుల అభిప్రాయం. అంటే ప్రజాభద్రతకోసం ఈ ప్రాథమిక హక్కుపై కొన్ని ఆంక్షలు పెట్టవలసి వస్తే అవి చెల్లుబాటు అవుతాయి. కానీ, ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలూ పెట్టలేదు. కేవలం సమావేశాలను రోడ్డుపై కాకుండా మైదానంలో పెట్టుకోవాలని జీవో సూచించింది. ఈ జీవోను నల్ల చట్టానికి పుట్టిన బిడ్డగా విపక్షం, ఎల్లో మీడియా అభివర్ణిస్తున్నాయి. నిజాల మీద మసి పూస్తున్నాయి. బరి తెగించి బట్టలూడదీసుకొని నర్తిస్తున్నాయి. చంద్రబాబు హయాంలో ఇదే చట్టాన్ని యథేచ్ఛగా వాడిన వైనాన్ని దాచేస్తున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు అనేక ఆంక్షలు పెడుతూ అప్పటి డీజీపీ ప్రెస్‌మీట్ పెట్టిన విషయాన్ని కూడా మరుగుపరిచే ప్రయత్నం చేస్తున్నారు.

vardhelli1959@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



మీకేం సంబంధం?



పాకిస్తాన్ మాజీ ప్రధాన మంత్రి బేనజీర్ భుట్టో 1990లో ఇండియాతో పాకిస్తాన్ వెయ్యేళ్ల యుద్ధం కొనసాగిస్తుందని అన్నారు. తన తండ్రి జుల్ఫికర్ అలీ భుట్టో అంతకుముందు చెప్పిన మాటలనే ఆమె పునరుద్ఘాటించారు. మరి అలాంటప్పుడు 'ఐద్వా' పోస్టర్లలో ఆమెను ఎందుకు తీసుకున్నారో తెలుసుకోవచ్చా?

– శ్రీజిత్ పణిక్కర్, వ్యాఖ్యాత

దేశం వదులుతున్నారు



1.8 కోట్ల సంఖ్యతో ప్రపంచంలోనే అత్యధిక వలసదారులు ఉన్న దేశంగా ఇండియా నిలుస్తోంది. భవిష్యత్ అంధకారంలో ఉందని అనుకున్నప్పుడు మాత్రమే జనాలు తమ దేశాన్ని వదులుతారు. 2014 సంవత్సరం నుంచీ, మోదీ ప్రభుత్వపు విధ్వంసకరమైన విధానాలు, ఆర్థిక వైఫల్యాల వల్ల భారతీయులు మహాప్రవాహంలా వెళ్లిపోతున్నారు.

– షమా మొహమ్మద్, కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి

ఇన్‌బాక్స్

ద్రవిడుల ప్రాచీన శాస్త్రీయ వైద్యం

భారతీయ వైద్యవిధానాలలో 'సిద్ధ' ఒకటి. ఇది ప్రభుత్వ ఆయుష్ వైద్య శాఖలో ఒక భాగం. దాదాపు 4,000 సంవత్సరాల పురాతనమైనది. దీనికి ప్రాచుర్యం కల్పించిన వారిని 'సిద్ధార్థులు' లేక శైవ భక్తులైన ఋషులు అంటారు. వీరు 18 మంది. వీరిలో అగస్త్యుడు ముఖ్యమైనవాడు. ఆయన రాసిన వైద్య గ్రంథాలు ప్రామాణికం. అందుకే అగస్త్య మహర్షిని సిద్ధ వైద్య పితామహుడిగా పరిగణిస్తున్నారు. ఈ సిద్ధ విజ్ఞానాన్ని మొట్టమొదట శివుడు, పార్వతీదేవికి ఉపదేశించాడనీ, ఆమె దీనిని నందిదేవునికి అందించిందనీ, నందికేశుడు దీనిని సిద్ధులకు అందజేశాడనీ తమిళ గ్రంథాలు చెబుతాయి. 'అగస్తియార్' రాసిన గ్రంథాలు సిద్ధవైద్యంలో అనేక చికిత్స పద్ధతులైన వరమమ్ (ప్రెజర్ చికిత్స), తక్కానమ్ (మసాజ్ చికిత్స), నాటి (నాడీ పరీక్ష), శస్త్ర చికిత్స, రస వైద్యం, ఆవిరి చికిత్స, యోగ, ముద్ర, ప్రాణాయామం వంటి 99 రకాల పద్ధతులు ఉన్నట్లు తెలియ చేస్తున్నాయి. నేటికీ ఇవి సిద్ధ వైద్యులకు మార్గదర్శకం అవుతున్నాయి.

ప్రాచీన గ్రంథం 'తొలకప్పియం' అనేక సిద్ధ వైద్య విషయాలను అందిస్తుంది. క్రీ.పూ 2వ శతాబ్దపు 'తిరుక్కురై' సిద్ధ విలువల గురించి చెబుతుంది. 'మణిమేఖలై' త్రిదోషాల గురించి చెబుతుంది. 13వ శతాబ్దంలో రాణి 'కుందవై నాచియార్' తన తండ్రి 'కుంత్రకోజన్' పేరు మీద ఉచిత వైద్యశాల నిర్వహించిందని తెలుస్తోంది. ఈ విధానంలోని సూత్రాలు, సిద్ధాంతాలు ఆయుర్వేదంతో సారూప్యతను కలిగి ఉంటాయి. క్రీ.పూ. 2వ శతాబ్దంలోనే వాలి (వాత), అజల్ (పిత్త), అయమ్ (కఫ) దోషాలుగా ఉంటాయనీ, వీటిని బట్టే ఔషధాలు నిర్ణయిస్తారనీ రాశారు.

సిద్ధ వైద్య విధానంలో రస ఔషధాలు ప్రాముఖ్యత వహిస్తాయి. మొక్కల వేర్లు, బెరడులు, ఆకులు, రత్నాలు, పశు ఉత్పత్తులతో ఔషధాల తయారీ ఉంటుందని 'ఆయుష్' ప్రచురించిన 'హోలిస్టిక్ హెల్త్' పుస్తకం ద్వారా తెలుస్తుంది. ఈ విధానం శ్రీలంక, సింగపూర్, మలేషియా, చైనా, తైవాన్ వంటి అనేక దేశాలలోనూ ఆదరణ కలిగివుంది. కరోనా సమయంలో కబాసురనీర్ ఔషధం తమిళనాడులో అనేక కేసులను తగ్గించడం వలన ప్రత్యేక ప్రజాదరణ పొందింది.

– డాక్టర్ బాలాజీ దీక్షితులు పి.వి. । మొబైల్: 88853 91722
(నేడు అగస్త్య మహర్షి జయంతి, జాతీయ సిద్ధ దినోత్సవం)

అజ్ఞానం కంటే అహంకారం ప్రమాదం

కామెంట్




కరణ్ థాపర్

సంవత్సరం ఇప్పుడే ప్రారంభమైంది. మనం ఇప్పటికీ కాసింత సరదాగా ఉండేందుకు అర్హులమే అని నా అభిప్రాయం. నిస్సందేహంగా మిగిలిన 357 రోజుల్లో అంటే ముమ్ముందు జరిగే కార్యక్రమాలు మనల్ని ఉద్వేగంతో ముంచెత్తుతాయి. కానీ ఇప్పటికైతే మనం కాస్త తేలిగ్గానే ఉండగలం. కాబట్టి ఇంటర్నెట్ నుంచి నేను కూడబెట్టిన కొన్ని రత్నాలను మీతో పంచుకోనివ్వండి.

నాకు బాగా నచ్చే అంశాల్లో ఒకటి అల్బర్ట్ ఐన్‌స్టీన్ పలుకులు. 'ఈ=ఎంసీ స్క్వేర్' అనే ఆయన సుప్రసిద్ధ సూత్రీకరణను నేను ఇప్పటికీ అర్థం చేసుకోలేక పోయాను. కానీ ఆయనకు సంబంధించిన ఇతర వివేకంతో నేను అనుసరించి సాగుతాను. ఆయనకు చెందిన ఈ కోణం మనకు పెద్దగా తెలియకపోవడం సిగ్గుచేటు. కాబట్టి ఈరోజు మనకు పెద్దగా తెలియని ఐన్‌స్టీన్ గురించి మీకు చెప్పనివ్వండి.

ఐన్‌స్టీన్ చెప్పారంటూ కీర్తిస్తున్న కొన్ని అద్భుతమైన విషయాల్లోని విశేషమైన ఉదాహరణలతో నేను దీన్ని ప్రారంభిస్తాను. ఈ సమయంలో నా మనసును విశేషంగా ఆకర్షించిన ఉల్లేఖనలను నేను ఎంపిక చేసుకుంటాను. 'అజ్ఞానం కంటే ప్రమాదకరమైన ఒకే ఒక్క అంశం ఏమిటంటే అహంకారం'. 'ఏ మతిహీనుడైనా తెలుసుకోవచ్చు, విషయమేమిటంటే దాన్ని అర్థం చేసుకోవాలి'. 'బలహీనులు ప్రతీకారం తీర్చుకుంటారు, బలవంతులు క్షమిస్తారు, తెలివైనవారు పట్టించుకోకుండా ఉంటారు'. 'నేను నేర్చుకునేదానికి అడ్డుతగిలే ఒకే ఒక విషయం ఏమిటంటే, అది నా చదువు మాత్రమే'. 'మూర్ఖత్వానికీ, మేధాతనానికీ మధ్య వ్యత్యాసం ఏమిటంటే, మేధాతనానికి దానివైన హద్దులుంటాయి'. 'విజ్ఞానానికి ఏకైక వనరు అనుభవమే'.

నాకు బాగా ఇష్టమైనవాటిల్లో రెండు మరీ సారవంతంగా ఉండి, ముక్కుసూటిగా ఉంటాయి. మొదటిది ఇదీ: 'మీరు దాన్ని సులభంగా వివరించలేనట్లయితే, దాన్ని మీరు తగినంత అర్థం చేసుకోలేరు'. రెండోది ఇదీ: 'చిలిపితనం వర్ధిల్లాలి! ఈ ప్రపంచంలో ఇదే నన్ను సంరక్షించే దేవదూత'.



ఇప్పుడు ఐన్‌స్టీన్ చెప్పినవాటిల్లో నిర్దిష్ట విభాగాలకు చెందిన వ్యక్తులకు వర్తించే అంశాలకు వస్తాను. ఉదాహరణకు, మన రాజకీయ నేతలు వాటిని ఉపయుక్తంగా వాడుకునే సలహాలు ఆయన ఇచ్చారు. 'సమాధానాలు ఉన్న వ్యక్తులు చెప్పేది వినవద్దు, ప్రశ్నలు ఉన్న వ్యక్తులు చెప్పేది మాత్రమే వినాలి' అని ఆయన అన్నారు. 'ఆలోచన లేకుండా అధికారాన్ని గౌరవించడం అనేది సత్యానికి మహా శత్రువు' అని ఐన్‌స్టీన్ చెప్పింది మరింత ప్రాసంగికమైనది.

ఐన్‌స్టీన్ వివేకంలో ఎక్కువ భాగం మన లాంటి సామాన్యులను లక్ష్యంగా చేసుకున్నది. 'మీ జీవితాన్ని గడపడానికి రెండే మార్గాలు ఉన్నాయి. ఒకటి ఏమిటంటే ఏదీ అద్భుతం కాదన్నట్టుగా, మరొకటి ఏమిటంటే ప్రతిదీ అద్భుతమే అన్నట్టుగా.' సులభంగా అలిసిపోయే వారికీ, లేదా ఎదురుదెబ్బలు, వైఫల్యాలతో నిస్పృహ చెందేవారికీ కూడా ఒక హామీ ఉంటుంది. 'మీరు నిజంగా ఏం చేయాలని అనుకుంటున్నారో దాన్ని ఎన్నటికీ వదిలిపెట్టొద్దు. అన్ని వాస్తవాలు చేతిలో ఉన్న వ్యక్తులకంటే పెద్ద స్వప్నాలు కనే వ్యక్తి చాలా శక్తిమంతుడు.' బహుశా, తడబడటాన్నీ, పడిపోవడాన్నీ అధిగమించాలంటే ఇదే మార్గం. 'జీవితం అనేది సైకిల్ స్వారీ లాంటిది. మీ సమతౌల్యాన్ని సాధించాలంటే, మీరు ముందుకు కదులుతూనే ఉండాలి.'

ఐన్‌స్టీన్ చెప్పిన కొన్ని విషయాలను తీసుకుంటే, ఆయన 2023 నాటి భారతదేశాన్ని మనసులో ఉంచుకుని చెప్పారా అని మీరు ఆశ్చర్యపడేలా చేస్తుంది. దీన్ని గురించి ఆలోచించండి: 'హాని తలపెట్టేవారి వల్ల ప్రపంచం ప్రమాదకరంగా లేదు, దానికేసి చూస్తూ కూడా ఏమీ చేయకుండా ఉండటం వల్ల ప్రమాదం ఉంటోంది'. ఇది కూడా చూడండి: 'నిత్యం విశ్రాంతి లేనితనంతో వచ్చే విజయం కంటే కూడా ప్రశాంతమైన, నిరాడంబర జీవితం మరింత సంతోషాన్ని తీసుకొస్తుంది'.

బహుశా, ఐన్‌స్టీన్‌ని ప్రపంచం కనీవినీ ఎరుగనంత గొప్ప శాస్త్రవేత్తగా భావిస్తున్నారు. అయినా సరే, భౌతిక శాస్త్రం మీద ఉన్నంత గ్రహణ శక్తి ఆయనకు దేవుడి మీదా ఉంది. 'యాదృచ్ఛికత అనేది దేవుడు అజ్ఞాతంగా ఉండిపోవడానికి ఎంచుకున్న మార్గం'. అలాగే చిన్న పిల్లల గురించీ, వారికి ఏది ప్రేరణ కలిగిస్తుందో ఆయన బాగా అర్థం చేసుకున్నారు. 'మీరు మీ పిల్లలు తెలివైనవారిగా ఉండాలని కోరుకుంటున్నట్లయితే, జానపద సాహస గాథలు చదివి వినిపించండి. మీరు వారిని మరింత తెలివైనవారిగా ఉండాలని కోరుకుంటున్నట్లయితే, వారికి మరింత ఎక్కువ అద్భుత గాథలను చదివి వినిపించండి'.

మానవుల గురించిన ఐన్‌స్టీన్ గ్రహణశక్తి ఎంత లోతైనదో, ఎంత పదునైనదోనని నాకులాగే మీక్కూడా ఆశ్చర్యంతో పాటు ఆనందం కలిగించినట్లయితే– ఆయనకు తనపట్ల తనకు ఉన్న అవగాహన కూడా అంతే సరిసమానంగా పదునుగా ఉంటుందని నేను చెబుతాను. 'ఒక గొప్ప శాస్త్రవేత్తను రూపొందించేది మేధస్సే నని చాలామంది జనం చెబుతుంటారు. వారి అభిప్రాయం తప్పు. నడవడికే దానికి కారణం'. దీన్నే ఐన్‌స్టీన్ మరింత స్పష్టంగా చెబుతారు: 'సహజాతాలనూ, ప్రేరణనూ నేను విశ్వసిస్తాను. ఒక్కోసారి, నాకు కారణం తెలియకుండానే నేను చెప్పినది సరైనది అని భావిస్తుంటాను'. పైగా, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఆయన ఊహాశక్తే ఆయనకు అంతర్ దృష్టిని ఇచ్చి ఉంటుందనిపిస్తుంది. 'నా ఊహాశక్తి ఆధారంగా స్వేచ్ఛగా చిత్రించే కళాకారుడిగా నేను ఉంటాను. జ్ఞానం కంటే ఊహ ముఖ్యమైనది. జ్ఞానం పరిమితి కలది, ఊహాశక్తి ఈ ప్రపంచాన్ని చుట్టేస్తుంది'.

చివరగా, మహాత్మాగాంధీ గురించి ఐన్‌స్టీన్ ఇలా చెప్పారు: 'రక్తమాంసాలు కలిగిన ఇలాంటి వ్యక్తి ఒకరు భూమ్మీద నడియాడి ఉంటారనే విషయాన్ని రాబోయే తరాలు నమ్మలేవు'. గాంధీని ఇప్పటికే మర్చిపోతున్న తరుణంలో, అలా మర్చిపోతున్న తరాల్లో మనమే మొదటివాళ్లుగా ఉంటున్నామా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

క్లుప్తంగా...

26న భీమిలిలో మహా కుంభయాగం

- హాజరుకానున్న కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి

సీతంపేట(విశాఖ ఉత్తర): భీమిలిలో ఈ నెల 26న మహా కుంభయాగం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి హాజరుకానున్నారు. నగరంలోని శంకరమఠంలో విజయేంద్ర సరస్వతిని ఆదివారం టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి దర్శించుకున్నారు. చాతుర్మాసం సందర్భంగా రాష్ట్రంలో విజయేంద్ర సరస్వతి చేస్తున్న పర్యటన ఆధ్యాత్మిక చింతనను మరింత పెంచిందన్నారు. సింహాచలం సందర్శన సందర్భంగా కంచి పీఠాధిపతికి ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేశామని సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొన్నారు.

పొత్తుల కోసమే బాబు, పవన్ కలయిక

- 833వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు




రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజకీయ అజెండాలో భాగంగా పొత్తుల కోసమే బాబు, పవన్ భేటీ జరిగిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 833వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో ఆదివారం పలువురు మాట్లాడారు. బాబు పెట్టిన సభల కారణంగా బహుజనుల జీవితాలు ముగిసిపోయాయని, అమాయకుల ప్రాణాలు తీసేలా బాబు వ్యవహరించిన తీరుపై ప్రజలంతా చర్చించుకుంటుంటే.. వీరు రాజకీయ చెట్టపట్టాలు వేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కందుకూరు, గుంటూరులో జరిగిన బహుజనుల మరణాలపై నోరెత్తకుండా, వారికి కనీస సానుభూతి తెలియజేయకుండా పవన్‌కళ్యాణ్ సిగ్గులేకుండా బాబుకు సంఘీభావం తెలిపాడని మండిపడ్డారు. ప్రతిపక్షాలు ప్రజా సమస్యలు, పేదల సమస్యలపై పోరాటం చేయాలి కానీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కాదని వామపక్షాలు, పవన్, బాబు గుర్తుంచుకోవాలన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని మేలు చేస్తూ.. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలను అక్కున చేర్చుకున్నందునే ఆయనకు నేడు బహుజనులు మద్దతు పలుకుతున్నారనే కులవాదుల అక్కసు అన్నారు. బాబు మాటలు విని పవన్ కాపులను మోసం చేయడం ఖాయమని, ఇందుకోసం పవన్‌కు ప్యాకేజీ ఇచ్చేందుకే వీరిద్దరి కలయిక జరిగిందన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.


శక్తిపీఠాల సందర్శనకు ప్రత్యేక రైలు

- రైల్వేశాఖ, ప్రైవేటు భాగస్వామ్యంతో 'శక్తి పీఠాల యాత్ర' ఏర్పాటు
- ఈ నెల 16న తమిళనాడు నుంచి రైలు ప్రారంభం



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): కుటుంబ సభ్యులతో కలసి తీర్థయాత్రలు, పర్యాటక ప్రదేశాలను సందర్శించే వారి కోసం భారతీయ రైల్వే–ఉలా రైల్ టూరిజం సంయుక్తంగా 'శక్తి పీఠాల యాత్ర' చేపట్టినట్లు ట్రావెల్ టైమ్స్ ఎండీ విఘ్నేష్ గణేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న తమిళనాడు నుంచి బయలుదేరే ఈ రైలు గూడూరు, ఒంగోలు, తెనాలి, గుంటూరు మీదుగా సికింద్రాబాద్, ప్రయాగ, వారణాశి, గయ, కామాఖ్య, కోల్‌కతా పూరి, కోణార్క్ తదితర పుణ్యక్షేత్రాలలో ఉన్న కామాఖ్యదేవి శక్తిపీఠం, వారణాసి విశాలాక్షి శక్తిపీఠం, కోల్‌కత్తా కాళీ శక్తిపీఠం, అలహాబాద్ అలోపిదేవి శక్తిపీఠం, గయ మంగళగౌరి శక్తిపీఠం, పూరి విమలాదేవి శక్తిపీఠం, కోణార్క్ సూర్యనారాయణ ఆలయంతో పాటు ఇతర పర్యాటక ప్రదేశాలను చుట్టివస్తుందని పేర్కొన్నారు. 13 రోజుల పాటు సాగే ఈ ప్రయాణంలో విజయవాడలో బుకింగ్ చేసుకున్న వారిని బస్సులో గుంటూరు తీసుకెళ్లి రైలు ఎక్కిస్తామని తెలిపారు. ప్రయాణంలో ఉదయం అల్పాహారం, టీ, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలు, పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు రోడ్డు మార్గంలో రవాణా, వసతి ఏర్పాట్లు ఉంటాయని పేర్కొన్నారు. టికెట్ ధర అన్ని పన్నులతో కలసి స్లీపర్ క్లాస్ ఒక్కొక్కరికి రూ.19,950, ఏసీ 3 టైర్ ధర రూ.26,300 ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు విజయవాడలోని తమ కార్యాలయంలో లేదా 74167 18800, 87545 80851 ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

ఈసారి 'క్రాస్' పుంజులతో..



ఈ ఏడాది కోడి పందేలకు కొత్తరూపు

- రాష్ట్రంలో గత ఏడాది కంటే ఈ ఏడాది ఇంకా ఎక్కువగా ఉంటాయని అంచనా
- లాడ్జిలు, అతిథి గృహాలన్నీ ఇప్పటికే హౌస్‌ఫుల్
- కుటీర పరిశ్రమగా మారిన కోడిపుంజుల నిర్వహణ
- జూదాలు వద్దు.. క్రీడలే ముద్దంటున్న పోలీసు శాఖ

కైకలూరు: సంక్రాంతి అంటేనే కోడిపందేలకు పెట్టింది పేరు. కత్తులతో కుత్తుకలు తెగే పుంజుల పోరాటాన్ని రక్తికట్టించేందుకు నిర్వాహకులు ఎప్పటిలాగే ఈ ఏడాదీ ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నారు. ఈసారి విభిన్నంగా క్రాస్డ్ జనరేషన్ పుంజులను బరిలోకి దించుతున్నారు. ఈ రోమాంచిత పోటీలకు జస్ట్ ఆరు రోజులే గడువు మిగిలి ఉంది.

టిక్..టిక్..టిక్..

గతేడాది జనవరిలో కోడిపందేల రూపంలో రాష్ట్రవ్యాప్తంగా రూ.900 కోట్లు చేతులు మారాయన్నది ఓ అంచనా. ఇందులో కోడిపందేలకు పెట్టింది పేరైన ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల వాటా అత్యధికంగా రూ.500 కోట్లు ఉండొచ్చు. నోట్ల రద్దు, కరోనా ప్రభావంతో గతంలో పందేల జోరు తగ్గినా, ఈ ఏడాది పరిస్థితులు అనుకూలించడంతో రాష్ట్రంలో ఈ ఏడాది ఇంకా ఎక్కువగా పందేలు ఉంటాయని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో పశ్చిమ గోదావరి, ఏలూరు, తూర్పు గోదావరి, గుంటూరు, కోనసీమ, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో కోడిపందేల నిర్వాహకులు పందెపు బరులను సిద్ధంచేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు.. ఇప్పటికే పలు జిల్లాల్లో లాడ్జిలు, అతిథి గృహాలు బుక్కయిపోయాయి.

కోడి పందేలు.. కొత్త పుంతలు..

ఈ ఏడాది కోడిపందేలు కొత్త రూపును సంతరించుకుంటున్నాయి. క్రాస్ జనరేషన్ కోడిపుంజుల హవా కొనసాగుతోంది. అమెరికన్ గేమ్ పాల్, అమెరికన్ పెర్విన్, బ్రెజిల్ జాతి కోళ్లను తీసుకొచ్చి దేశీయ నెమలి, డేగ వంటి జాతి కోళ్లతో క్రాసింగ్ చేయిస్తున్నారు. పందేనికి సిద్ధమైన వీటి ధర రూ.లక్ష పైమాటగానే ఉంది. ఇక కోడిపుంజుల పెంపకాన్ని పలు జిల్లాల్లో నిర్వాహకులు కుటీర పరిశ్రమగా మార్చుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల్లో దాదాపు 300 కోడిపుంజుల శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేశారు. 18 నెలల పాటు పుంజులను పోటీలకు సిద్ధంచేయడానికి ఒక్కో శిక్షకుడికి రూ.15 వేలు జీతం ఇస్తున్నారు. యంత్రాలలో కోడిగుడ్లను పొదిగించి నాణ్యమైన పుంజు జాతులను తయారు చేస్తున్నారు.



మార్పు కోసం పోలీసుల యత్నం

హైకోర్టు ఆదేశాలతో కోడిపందేలను అడ్డుకోవడానికి గతంలో పోలీసులతో పాటు ఆదాయపు పన్ను శాఖ అధికారులు కూడా రంగంలోకి దిగారు. పోలీసు యాక్ట్ 144 సెక్షన్‌ను విధించారు. బైండోవర్లు చేసి, వేలాదిగా కోడి కత్తులను సీజ్ చేశారు. ఈ ఏడాది కూడా భారీగా కోడికత్తులను సీజ్ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కోడిపందేలకు సంబంధించి 900 కేసులు నమోదు చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్, క్రికెట్ వంటి పోటీలను మార్పు కోసం నిర్వహిస్తున్నారు.

కమిటీలతో కట్టడి చేస్తాం..



సంక్రాంతి పండుగ సమయంలో కోడిపందేలు, జూదాలను కట్టడి చేయడానికి గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటుచేశాం. ఏలూరు జిల్లాలో కేవలం 15 రోజుల్లోనే 45 కేసులు నమోదు చేశాం. ఇప్పటికే పెట్రోలింగ్ టీంలు పనిచేస్తున్నాయి. ముఖ్యంగా జూదాల వైపు దృష్టి మళ్లకుండా పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాలీబాల్, క్రికెట్ వంటి పోటీలను పోలీసు శాఖ ఏర్పాటుచేసింది.

– రాహుల్‌దేవ్ శర్మ, ఎస్పీ, ఏలూరు జిల్లా



కోడిపందేలు



వీరోచితంగా పోరాడే నెమలి పుంజు



తెల్లపర్ల పుంజు

జోరుగా ఈ-క్రాప్ నమోదు

రబీ సాగు విస్తీర్ణం 59.93 లక్షల ఎకరాలు

- ఈ-క్రాప్ నమోదైన విస్తీర్ణం 16.95 లక్షల ఎకరాలు
- ఇప్పటివరకు పంటలు వేసినది 29.50 లక్షల ఎకరాలు
- 25లోగా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఈ-క్రాప్ పూర్తి
- మిగిలిన జిల్లాల్లో ఫిబ్రవరి 20 కల్లా పూర్తి
- ఫిబ్రవరి 28 వరకు ఆర్బీకేల్లో జాబితాల ప్రదర్శన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రబీ సాగుతో పాటు పంటల నమోదు కూడా జోరందుకుంది. రబీ సీజన్‌లో 56.49 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, 2.44 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగుచేయాల్సి ఉంది. ఇప్పటివరకు సుమారు 29.50 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. ప్రధానంగా 15.57 లక్షల ఎకరాల్లో అపరాలు, 6.94 లక్షల ఎకరాల్లో వరి, 3.84 లక్షల ఎకరాల్లో ముతక ధాన్యాలు, 1.84 లక్షల ఎకరాల్లో నూనెగింజలు, 1.20 లక్షల ఎకరాల్లో పొగాకు పంటలు సాగవుతున్నాయి. దీంతో రాష్ట్రంలో ఈ-పంటల (ఈ-క్రాప్) నమోదు జోరుగా సాగుతోంది. గత నెల 8న వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖల సిబ్బంది సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈసారి ఈ-క్రాప్‌తోపాటు ఈ-కేవైసీ కూడా నమోదు చేసేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేశారు. చేపలు, రొయ్యల సాగు వివరాలను నమోదు చేస్తున్న ఈ-ఫిష్‌తో అనుసంధానం చేశారు. ప్రైవేటు విత్తన కంపెనీలు విత్తనోత్పత్తి కోసం సాగుచేసే పంటలను కూడా నమోదు చేస్తున్నారు. మాండూస్ తుపాను వల్ల దెబ్బ తిన్న పంటల స్థానంలో రెండోసారి విత్తుకుంటున్న పంటల వివరాలను కూడా స్థానిక వ్యవసాయాధికారి ధ్రువీకరణతో నమోదు చేస్తున్నారు. ఈసారి ప్రతి 15 రోజులకు ఒకసారి ర్యాండమ్‌గా పంటలను తనిఖీ చేస్తారు. తనిఖీ చేసే పంటల వివరాలను కమిషనరేట్ నుంచే జిల్లాలకు పంపిస్తున్నారు. రెవెన్యూ గ్రామాలవారీగా వెబ్‌ల్యాండ్ డేటా, పంట సాగు హక్కు పత్రాల (సీసీఆర్సీ) డేటా ఆధారంగా ఈ-పంట నమోదు చేస్తున్నారు. జిరాయితీ, పట్టాదార్, అసైన్డ్, ఆర్‌వోఎఫ్‌ఆర్, ఎండోమెంట్, వక్ఫ్, ఇనాం, లంక, సీజేఎఫ్‌ఎస్, మిగులు, ఆక్రమిత తదితర కేటగిరీ కింద గుర్తించిన ప్రభుత్వ భూముల్లో సాగవుతున్న ఆహార, నూనె గింజలు, పశుగ్రాసం, పంటలు, పండ్ల తోటలు, సుగంధ ద్రవ్యాలు, కూరగాయలు, పూలు, మల్బరీ పంటలను కూడా నమోదు చేస్తున్నారు. భూ యజమానులు, సీసీఆర్సీ కార్డు పొందిన కౌలుదారులు సాగు చేస్తున్న పంటల వివరాలను మాత్రమే నమోదు చేస్తున్నారు.

16,95,860 ఎకరాల్లో పంటల వివరాలు నమోదు

తొలుత ఆర్బీకేలకు వచ్చిన రైతులు పంట వివరాలను యాప్‌లో నమోదు చేసిన తర్వాత ఎస్‌ఎంఎస్ రూపంలో డిజిటల్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ పంపిస్తున్నారు. ఇప్పటివరకు 6,63,122 మంది రైతులు సాగు చేసిన 16,95,860 ఎకరాల్లోని పంటల వివరాలను నమోదు చేశారు. వీటిలో 16,17,956 ఎకరాల్లో వ్యవసాయ, 76,726 ఎకరాల్లో ఉద్యాన పంటలు ఉన్నాయి. తూర్పు గోదావరి, చిత్తూరు, విశాఖ జిల్లాల్లో ఇప్పటివరకు సాగైన పంటలను 100 శాతం ఈ క్రాపింగ్ చేశారు. పశ్చిమ గోదావరి, తిరుపతి, కాకినాడ జిల్లాల్లో ఈ-క్రాప్ నమోదు 70 శాతం దాటగా, పల్నాడు, పార్వతీపురం మన్యం, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో 60 శాతం దాటింది. ముందుగా రబీ సాగు మొదలైన ప్రకాశం, నెల్లూరు తిరుపతి జిల్లాల్లో ఈ నెల 25వ తేదీ కల్లా నమోదు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. మిగిలిన జిల్లాల్లో ఫిబ్రవరి 20వ తేదీలోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. సామాజిక తనిఖీ కోసం ఫిబ్రవరి 21 నుంచి 28 వరకు ఆర్బీకేల్లో పంటల జాబితా ప్రదర్శిస్తారు. మార్చి 1 నుంచి 5 వరకు అభ్యంతరాలను స్వీకరించి, పరిష్కరిస్తారు. మార్చి 7న తుది జాబితా ఆర్బీకేల్లో ప్రదర్శిస్తారు.

రూ.33 లక్షల విరాళంతో ఒక రోజు అన్నప్రసాద వితరణకు అవకాశం

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం దేశ విదేశాల నుంచి విచ్చేసే లక్షలాది మంది భక్తులకు రుచిగా, శుచిగా ఒక రోజు అన్నప్రసాదాలు అందించేందుకు టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టు ఒకరోజు విరాళ పథకం ప్రారంభించింది. ఇందు కోసం ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణ కోసం రూ.33 లక్షలు విరాళం ఇవ్వాల్సి ఉంటుంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం సమయంలో దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించవచ్చు. విరాళం అందించే దాత పేరును వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ప్రదర్శిస్తారు.

డిగ్రీలు లేని పరిశోధకుడు

- వృత్తి ముఠా కూలీ.. ప్రవృత్తి చరిత్ర అన్వేషణ
- గుంటూరు జిల్లాలో 500 అదృశ్య గ్రామాల చరిత్ర వెలికితీత
- గ్రంథస్తం చేసిన అతి సామాన్యుడు శివశంకర్



'గుంటూరు జిల్లా అదృశ్య గ్రామాలు' గ్రంథం.. (ఇన్‌సెట్లో) మణిమేల శివశంకర్

తెనాలి: అతడో సాధారణ ముఠా కార్మికుడు. లారీ ఎప్పుడొస్తే అప్పుడు బస్తాలు దించటం.. లారీలోకి ఎత్తడమే అతడి పని. కానీ.. నిరంతరం చరిత్ర అన్వేషణలో మునిగి తేలుతుంటాడు. శాసనాలను శోధిస్తుంటాడు. సారాన్ని క్రోడీకరిస్తాడు. గుంటూరు జిల్లా పరిధిలో ఇప్పటివరకు 500 అదృశ్య గ్రామాల చరిత్రను ఆయన వెలికితీశారు. డిగ్రీలు లేకపోయినా పరిశోధకుడుగా చరిత్రకారుల సరసన నిలిచారు. అతడి పేరు మణిమేల శివశంకర్. గుంటూరు జిల్లా పొన్నూరు మండలంలోని మామిళ్లపల్లి స్వగ్రామం. నిరుపేద కుటుంబంలో పుట్టిన శివశంకర్ అయిదో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. జీవనోపాధి కోసం ముఠా కార్మికుడిగా గుంటూరులో స్థిరపడ్డారు. దైవదర్శనం కోసం ఆలయాలకు వెళుతున్నపుడు ఆలయ చరిత్రను తెలుసుకుంటూ.. అక్కడ శాసనాలుంటే వాటిని ఆరా తీసే క్రమంలో శివశంకర్‌కు చరిత్రపై ఆసక్తి ఏర్పడింది. క్రమేపీ అదే హాబీగా మారింది. తన పని పూర్తవగానే శాసనాల అన్వేషణ కోసం తిరుగుతుంటారు. ఆర్కియాలజీ విభాగం అందుబాటులోకి తెచ్చిన శాసనాలు చదవటం, కొత్త శాసనాలను సేకరించటం నిత్యకృత్యంగా మార్చుకున్నారు. కొన్నేళ్లుగా సాగుతున్న ఈ అధ్యయనంలో పాత తెలుగు శాసనాలను చదవటం సాధించారు. సంస్కృతంలో ఉన్న శాసనాలకు తెలిసిన వారిపై ఆధారపడుతున్నారు.

500 అదృశ్య గ్రామాలను గుర్తించి..

శివశంకర్ గుంటూరు జిల్లాలోని ఎన్నో అదృశ్యమైన గ్రామాలకు కాలినడకన వెళ్లారు. అందుబాటులో ఉన్న స్థానిక రికార్డుల్ని తిరగేసి.. కల్నల్ మెకంజీ రాతల్ని తడిమి చూశారు. సమీప గ్రామాల్లోని పెద్దల్ని పలకరించారు. ఈ విధంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 500 అదృశ్యమైన గ్రామాల పుట్టుపూర్వోత్తరాలు, చరిత్ర, సంస్కృతి వివరాలను సేకరించగలిగారు. మండలాల వారీగా అదృశ్య గ్రామాల వివరాలను 'గుంటూరు జిల్లా అదృశ్య గ్రామాలు' పేరుతో గ్రంథస్తం చేశారు. జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య పూర్వీకుల గ్రామం పింగళి గురించి రచయిత ఇచ్చిన వివరణ చరిత్రకారులను ఆకట్టుకుంది. పింగళి అనగానే ఆధునిక సినీకవి పింగళి నాగేంద్రరావు, మధ్యయుగంలో అష్టదిగ్గజాల్లో ప్రముఖుడు, 'కళా పూర్ణోదయం' సృష్టికర్త పింగళి సూరనకవి, కాకునూరి అప్పకవీంద్రుల పుట్టుపూర్వోత్తరాలను తిరగదోడటం ద్వారా శివశంకర్, సాహిత్యంపై తనకు గల మమతానురాగాన్ని బహిర్గతం చేశారు. రెంటాల బ్రహ్మీ శాసనంలో ప్రస్తావించిన 'నిడిగల్లు' గ్రామం, క్రీ.శ 3వ శతాబ్దం నాటి ఇక్ష్వాకు రాజధానిగా నాగార్జునిని కోట విజయపురిలో ఉన్నదనే ఆధారం ఇచ్చారు. దుర్గి మండలంలోని అదృశ్య గ్రామం 'దద్దనాలపాడు' ఒకప్పుడు రాజస్త్రీల సతీసహగమనం జరిగిన ప్రదేశమట. తెనాలి రామలింగకవి స్వస్థలం గార్లపాడు తెనాలి మండల గ్రామం కొలకలూరుకు సమీపంలోని అదృశ్య గ్రామమని తేల్చారు శివశంకర్. అదృశ్య గ్రామ చరిత్రలను అందించిన శివశంకర్‌ను 'అయ్యంకి-వెలగా పురస్కారం' వరించింది.

పేదలకు ఆరోగ్య 'సిరులు' అందించేలా..!

- రేషన్ లబ్ధిదారులకు మేలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు
- ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చిరుధాన్యాల సరఫరా
- రెండు కిలోల బియ్యం బదులు రాగులు, జొన్నలు పంపిణీ
- వలంటీర్లు, ఐవీఆర్ఎస్ పద్ధతి ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ
- రైతులకూ మేలు చేసేలా మద్దతు ధరకు చిరుధాన్యాల కొనుగోలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చిరుధాన్యాల సరఫరాకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. చిరుధాన్యాలను అందించడం ద్వారా పేదలకు అధిక పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగానే రేషన్ లబ్ధిదారుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతోంది. చిరుధాన్యాలతో కలిగే ఆరోగ్య లాభాలను వివరిస్తూ ప్రత్యేకంగా కరపత్రాలను ముద్రించింది. క్షేత్ర స్థాయిలో వలంటీర్ల ద్వారా, ఐవీఆర్ఎస్ సాంకేతిక సాయంతోనూ ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోంది.

రాగులు, జొన్నల పంపిణీ..

ప్రస్తుతం రాష్ట్రంలో 1.45 కోట్ల బియ్యం కార్డులు ఉన్నాయి. ప్రభుత్వం కొత్తగా మరో 70 వేలకు పైగా కార్డులను మంజూరు చేసింది. కార్డులోని ఒక్కో సభ్యుడికి ఐదు కిలోల చొప్పున సార్టెక్స్ బియ్యాన్ని ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి ముంగిటకే అందిస్తోంది. ఇందులో ప్రతి నెలా రెండు కిలోల బియ్యం బదులు రాగులు, జొన్నలు అందించేలా పౌరసరఫరాల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ధాన్యం సేకరణ మాదిరిగానే చిరుధాన్యాలను కూడా రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసి ప్రజలకు పంపిణీ చేయనుంది. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం వచ్చిన వివరాలను బట్టి అవసరానికి అనుగుణంగా వ్యవసాయ శాఖతో కలిసి చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేలా పౌరసరఫరాల శాఖ ప్రణాళికలు రూపొందించింది.

ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు..

చిరుధాన్యాలు ఆరోగ్య పరిరక్షణలో కీలకంగా మారుతున్నాయి. జొన్నలతో వండిన ఆహార పదార్థాలు సులభంగా జీర్ణం అవడంతో పాటు జీవ క్రియను మెరుగుపరుస్తాయి. అధిక పీచు పదార్థం బరువును తగ్గించడానికి ఉపకరిస్తుంది. చర్మ వ్యాధులను నివారిస్తుంది. రక్త ప్రసరణ పెరుగుతుంది. జొన్నల్లో బీకాంప్లెక్స్ విటమిన్లు అయిన పైరిడాక్సిన్, రైబోఫ్లావిన్, థయామిన్ అధికంగా ఉంటాయి. పొటాషియం, భాస్వరం, మెగ్నీషియం, జింకు ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. రాగుల్లోని అమినోయాసిడ్స్ ఆకలిని తగ్గిస్తుంది. మధుమేహ వ్యాధికి రాగులతో చేసిన ఆహారం చక్కని ఔషధంగా పని చేస్తుంది. పాలల్లో కంటే అధికంగా కాల్షియం రాగుల్లో ఉంటుంది. అధిక మోతాదులో ఉన్న కాల్షియంతో ఎముకలు బలంగా మారతాయి.

ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నాం

చిరుధాన్యాల్లో ఎన్నో ఆరోగ్యకర లక్షణాలున్నాయి. శారీరక రుగ్మతలు, మానసిక ఒత్తిడి తగ్గడానికి చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని శాస్త్రవేత్తలు సైతం చెబుతున్నారు. మార్కెట్‌లో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉంది. వీటిని పండించడం ద్వారా రైతులకు మంచి ఆదాయం లభిస్తుంది. వాటిని పీడీఎస్ ద్వారా ప్రజలకు అందిస్తే ఆరోగ్యకర సమాజం తయారవుతుంది. ఇందుకే రైతులకు, ప్రజలకు మేలు చేసేలా ప్రభుత్వం జొన్నలు, రాగుల సాగును ప్రోత్సహిస్తోంది. అలాగే పంపిణీ చేయాలని ఆలోచిస్తోంది. ప్రస్తుతం ప్రజల నుంచి అభిప్రాయాన్ని సేకరిస్తున్నాం.

– హెచ్. అరుణ్‌కుమార్, కమిషనర్, పౌరసరఫరాల శాఖ

నిర్ణీత సమయంలో శ్రీవారి దర్శనం

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. నిర్ణీత సమయంలో కేటాయించిన టైమ్స్ స్లాట్ టికెట్లకు త్వరితగతిన దర్శనం అవుతోంది. శనివారం అర్ధరాత్రి వరకు 62,856 మంది స్వామి వారిని దర్శించుకోగా 22,115 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.21 కోట్లు సమర్పించారు.

క్లుప్తంగా...

రష్యా రాకెట్ దాడుల్లో...

600 మంది సైనికులు మృతి!

మాస్కో: తూర్పు ఉక్రెయిన్‌లో సైనికుల తాత్కాలిక నివాసాలపై తాము జరిపిన రాకెట్ దాడుల్లో 600 మంది మరణించారని రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. రష్యా అధీనంలో ఉన్న డాన్‌టెస్క్ ప్రాంతంపై ఉక్రెయిన్ దాడుల్లో 89 మంది రష్యా సైనికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనకు ప్రతీకార చర్యగానే తాము క్రమటోర్క్స్‌పై ప్రాంతంలో సైనికుల ఇళ్లపై దాడులు చేసినట్టు పేర్కొంది. సైనికులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న ఇళ్లకు సంబంధించిన కచ్చితమైన సమాచారం అందడంతో తాము రాకెట్ దాడులు చేశామని ఒక ప్రకటనలో తెలిపింది. ఒక ఇంట్లో 700 మంది సైనికులు ఉంటే, మరొక ఇంట్లో 600 మంది ఉన్నారని తాము చేసిన రాకెట్ దాడుల్లో 600 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని వివరించారు. ఇదే నిజమైతే గత ఫిబ్రవరి 24న యుద్ధం మొదలు పెట్టినప్పట్నుంచి ఉక్రెయిన్‌కు భారీగా ప్రాణనష్టం జరిగిన ఘటన ఇదే.

సెనెగల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

40 మంది దుర్మరణం

దాకర్: ఆఫ్రికా దేశం సెనెగల్‌లో శనివారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 40 మంది మృతి చెందారు. కఫ్రిన్ ప్రాంతం గ్నివీ గ్రామం వద్ద ఒకటో నంబర్ జాతీయ రహదారిపై ఘటన చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు టైర్ పేలిపోవడంతో అదుపుతప్పి, ఎదురుగా వస్తున్న మరో బస్సును వేగంగా ఢీకొట్టింది. ఘటనలో రెండు బస్సుల్లోని 40 మంది చనిపోగా, మరో 78 మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. రెండు బస్సులు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయన్నారు. ఘోర విషాదం నేపథ్యంలో దేశంలో మూడు రోజులు సంతాప దినాలుగా పాటిస్తామని అధ్యక్షుడు మాకీ సాల్ ప్రకటించారు.

కెన్యా–ఉగాండా సరిహద్దుల్లోనూ...

నైరోబీ: ఉగాండాలోని ఎంబాలె నగరం నుంచి కెన్యా రాజధాని నైరోబీ వెళ్తున్న బస్సు రెండు దేశాల సరిహద్దుల్లో ప్రమాదానికి గురైంది. 21 మంది చనిపోగా 49 మంది గాయపడ్డారు.

అంతిమ యాత్రపైకి దూసుకొచ్చిన ట్రక్కు..

చైనాలో 19 మంది దుర్మరణం

బీజింగ్: అంతిమయాత్ర ఊరేగింపుపై ట్రక్కు దూసుకొచ్చిన ఘటనలో 19 మంది చనిపోగా, మరో 20 మంది గాయపడ్డారు. చైనాలోని జియాంగ్జి ప్రావిన్స్ నాన్‌చంగ్ కౌంటీలో ఆదివారం ఈ విషాదం చోటుచేసుకుంది. ఘటనపై దర్యాప్తు జరుగుతోందని అధికారులు తెలిపారు. ఈ నెల 22 నుంచి చైనీస్ కొత్త ఏడాది మొదలు కానుండగా, ప్రభుత్వం జీరో కోవిడ్ విధానాన్ని ఎత్తివేసి ప్రయాణ ఆంక్షలను సడలించిన సమయంలో ప్రమాదం చోటుచేసుకోవడం గమనార్హం.

వేగంగా స్పందించలేదు

'ఎయిరిండియా' ఘటనపై
టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్

న్యూఢిల్లీ: ఎయిరిండియా విమానంలో ఓ వ్యక్తి తోటి ప్రయాణికురాలిపై మూత్రం పోసిన ఘటనలో సిబ్బంది సరిగా స్పందించలేదని టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. ''ఆ ఘటన వ్యక్తిగతంగా నాకు, ఎయిరిండియా సిబ్బందికి మనస్తాపం కలిగించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించాల్సిన, స్పందించాల్సిన తీరును సమీక్షించి, సరిచేస్తాం'' అన్నారు.

చొరబాటు యత్నం భగ్నం

కశ్మీర్‌లో ఇద్దరు ముష్కరులు హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లా బాలాకోట్ సెక్టార్‌లో శనివారం ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని భద్రతా సిబ్బంది భగ్నం చేశారు. ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని అధికారులు వెల్లడించారు. వారి వద్ద భారీ సంఖ్యలో ఆయుధాలు, మందు గుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముష్కరులు నియంత్రణ రేఖ వద్ద భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తుండగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారని పేర్కొన్నారు.

వణుకుతున్న ఉత్తరాది

న్యూఢిల్లీ: ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో వరుసగా నాలుగో రోజూ శీతల పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఢిల్లీలో ఆదివారం అత్యల్పంగా 1.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గత రెండేళ్లలో జనవరిలో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రత ఇదేనని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. హరియాణాలోని హిస్సార్‌లో 1.4 డిగ్రీలు, రాజస్తాన్‌లోని చురులో మైనస్ 0.5 డిగ్రీలు, పిలానీలో 1.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దేశ ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు 480కి పైగా రైళ్ల రాకపోకలపై ప్రభావం చూపింది. 335 రైళ్లు ఆలస్యం కాగా, 88 రైళ్లను రద్దు చేసి, మరో 33 రైళ్ల ప్రయాణాలను కుదించినట్లు ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. పొగమంచు కారణంగా ఆదివారం ఉదయం 25 విమానాలు ఆలస్యంగా నడిచాయని ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం ట్వీట్ చేసింది. పొగమంచు కారణంగా పంజాబ్‌లోని భటిండా, యూపీలోని ఆగ్రాల్లో ఆదివారం దృగ్గోచరత 25 మీటర్లకు, అమృత్‌సర్, లూధియానా, వారణాసి తదితర నగరాల్లో 50 మీటర్లకు దృగ్గోచరత పడిపోయిందని ఐఎండీ పేర్కొంది. అతి శీతల వాతావరణం కారణంగా ఢిల్లీలో శుక్రవారం రికార్డు స్థాయిలో 5,526 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగించారు. ప్రజలు సాధ్యమైనంత మేర ఇళ్లలోనే ఉండిపోవాలని ఐఎండీ సూచించింది. ఢిల్లీ సహా ఉత్తర భారతానికి ఐఎండీ ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. రానున్న రెండు రోజుల్లో పరిస్థితులు మెరుగుపడవచ్చని అంచనా వేసింది.

'ఆపాత' పాలపుంతలు!



వాషింగ్టన్: అచ్చం మన పాలపుంత మాదిరిగా ఉండే నక్షత్ర మండలాలను నాసా జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తాజాగా గుర్తించింది. ఇవన్నీ విశ్వం ప్రస్తుత వయసులో కేవలం మూడో వంతు ఉన్నప్పుడు, అంటే దాదాపు 1,100 కోట్ల ఏళ్ల కింద ఏర్పడ్డాయట! ఈ క్రమంలో విశ్వంలోకెల్లా అత్యంత పురాతన నక్షత్ర మండలాన్ని కూడా జేమ్స్ వెబ్ గుర్తించింది. అది ఏకంగా 1,350 కోట్ల ఏళ్లనాటిదట. అప్పటికి విశ్వం ఆవిర్భవించి కేవలం 30 కోట్ల ఏళ్లేనట! ఈ నక్షత్ర మండలాల కేంద్ర స్థానం నుంచి ఇతర నక్షత్ర రాశుల దాకా విస్తరించి ఉన్న స్టెల్లర్ బార్స్‌ను కూడా వీటిలో గమనించడం విశేషం. ఈ బార్స్ మన పాలపుంతలోనూ ఉన్నాయి. అయితే విశ్వపు తొలి యుగాల నాటి నక్షత్ర మండలాల్లో ఇవి కన్పించడం ఇదే తొలిసారని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ ఆస్ట్రానమీ ప్రొఫెసర్ శ్రద్ధా జోగీ అన్నారు. ఈ నేపథ్యంలో నక్షత్ర మండలాల పుట్టుక, వికాసాలను గురించిన సిద్ధాంతాలను సరిచూసుకోవాల్సి రావచ్చని అభిప్రాయపడ్డారు. ఇలాంటి నక్షత్ర మండలాలను గతంలో హబుల్ టెలిస్కోప్ కూడా గుర్తించినా వాటిలో ఈ బార్స్ కనిపించలేదన్నారు. ''ఇవి నక్షత్రాలతో పాటు అంతరిక్ష ధూళి, వాయువుల కదలికలను ప్రభావితం చేయడంతో పాటు తారల పుట్టుక ప్రక్రియను వేగవంతం చేయడంలోనూ సాయపడతాయి. అంతేగాక నక్షత్ర మండలాల కేంద్ర స్థానాల్లో అతి భారీ కృష్ణబిలాల పుట్టుకకూ దోహదం చేస్తుంటాయి. ఒకవిధంగా ఇవి నక్షత్ర మండలాల్లో సరఫరా వ్యవస్థ పాత్ర పోషిస్తుంటాయి. విశ్వపు తొలి యుగాల నాటి నక్షత్ర మండలాల్లోని స్టెల్లర్ బార్స్‌పై తొలిసారిగా పరిశోధన చేస్తున్నది మేమే. ఇది ఇప్పటిదాకా ఎవరూ చూడని కీకారణ్యంలోకి తొలిసారి అడుగు పెట్టడం వంటిదే'' అంటూ శ్రద్ధా ముక్తాయించారు.

కూతుళ్ల కోసం 'తల్లి'గా మారాడు!

క్విటో(ఈక్వెడార్): కన్న కూతుళ్లంటే ఆ తండ్రి ఎంతో ఇష్టం. విడిపోయిన భార్య వద్ద ఉన్న ఇద్దరు కూతుళ్ల కస్టడీ తనకే ఇవ్వాలంటూ కోర్టులో కేసు వేశాడు. అయితే, తల్లి వద్దే కూతుళ్లు ఉండాలంటుంది చట్టం. అందుకే, కూతుళ్లకు తల్లి ప్రేమను పంచేందుకు దుస్సాహసమే చేశాడు ఆ తండ్రి. ఏకంగా లింగమార్పిడి చేసుకుని మహిళగా మారాడు. ఇప్పుడైనా చట్టం కూతుళ్లను తన వద్దకే పంపిస్తుందని ఆశపడుతున్నాడు..! ఈ ఘటన దక్షిణ అమెరికా దేశం ఈక్వెడార్‌లో చోటుచేసుకుంది. న్యూయార్క్ పోస్ట్ కథనం ప్రకారం.. రెనె సలినాస్ రమోస్(47), అతని భార్య విడిపోయారు. చట్టం ప్రకారం వీరి సంతానం తల్లి సంరక్షణలోనే ఉండాలి. మహిళ మాత్రమే బిడ్డలకు ప్రేమను అందిస్తుందని చట్టం అంటోంది. భార్య ఐదు నెలలుగా కూతుళ్లను కలుసుకునే అవకాశం లేకుండా చేస్తోందని అంటున్నాడు. తనకెంతో ఇష్టమైన కూతుళ్లు దూరం కావడం తట్టుకోలేని రమోస్ మరో మార్గం ఆలోచించాడు. ఏకంగా లింగమార్పిడి చేయించుకుని, మహిళగా మారాడు. అధికార రికార్డుల్లో మహిళగానే ఉన్నా, నిత్య జీవితంలో పురుషుడిగానే చెలామణి అవుతున్నాడు. మహిళగా మారినందున, కోర్టు కేసు గెలుస్తాననే నమ్మకంతో ఉన్నాడు. తల్లి వద్ద ఇబ్బందులు పడుతున్న తన బిడ్డలకు తల్లిగా మారుతానంటున్నాడు. ఈక్వెడార్ ఎల్జీబీటీఐ హక్కుల సంస్థలు మాత్రం రమోస్ చర్యపై మండిపడుతున్నాయి.

కుల కలం

రాజకీయ తేనెతుట్టెను కదిపిన నితీశ్

- బిహార్ కులగణన ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై పడుతుందా?
- కులాల లెక్కింపుతో ప్రయోజనాలేంటి?

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఏ ఇతర పార్టీ చేయని సాహసానికి పూనుకున్నారు. రాష్ట్రంలో కులగణనకి శ్రీకారం చుట్టారు. బడుగు, బలహీన వర్గాలకు శాస్త్రీయ విధానంలో సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే కులాలు లెక్కలు పక్కాగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ ప్రక్రియను ప్రారంభించారు. రెండు దశలుగా సాగే ఈ ప్రక్రియ కోసం ప్రత్యేకంగా ఒక మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించారు. దేశ ప్రయోజనాల కోసమే కులగణనను చేపడుతున్నామని, ఓబీసీల అసలు లెక్కలు ఎంతో తేల్చాలన్నదే తమ ఉద్దేశమని నితీశ్ కుమార్ బయటకి చెబుతున్నప్పటికీ రాజకీయ లబ్ధి కోసమే ఆయన ఈ సంక్లిష్ట ప్రక్రియను మొదలు పెట్టారన్న విమర్శలు మొదలయ్యాయి. కులగణనపై వివిధ వర్గాల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. దేశంలో సామాజిక న్యాయం జరగాలంటే, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు చేపట్టాల్సిందేనని ఒక వర్గం గట్టిగా పట్టుబడుతోంది. ఓబీసీలకు కేటాయించిన కోటా వారికి సమానంగా పంపిణీ చేయడం కోసం నియమించిన రోహిణి కమిషన్ ఓబీసీల్లో 2,633 కులాలు ఉన్నాయని తేల్చింది. అయితే ప్రస్తుతం మన దేశంలో అమలవుతున్న ఓబీసీల రిజర్వేషన్లలో ఎక్స్‌ట్రీమ్లీ బ్యాక్‌వార్డ్ కేస్ట్స్ (ఈబీసీ)లకే అమలవుతున్నాయి. మరోవైపు 21 శతాబ్దంలో కూడా కులాల వారీగా జనాభా లెక్కిస్తే సమాజంలో మరిన్ని చీలికలు వస్తాయని మరో వర్గం వాదనగా ఉంది. ఇంకా కులాల కుంపట్లలోనే మగ్గిపోతూ ఉంటే గ్లోబల్ సూపర్ పవర్‌గా భారత్ ఎదిగే అవకాశాలకు గండిపడుతుందనే అభిప్రాయాలున్నాయి.

ఎందుకీ కులగణన?

స్వాతంత్ర్యానంతరం ఇప్పటివరకు కులాలవారీగా జనాభా లెక్కింపు చేపట్టలేదు. 1990లో కేంద్రంలో జనతాదళ్ ఆధ్వర్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించింది. జనాభా ప్రాతిపదిక అంటూ ఏమీ లేకుండా 27% రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం 1992 నుంచి అమలవుతోంది. ఇప్పటివరకు మన దగ్గరున్న కులాల లెక్కలకు 1931 నాటి గణాంకాలే ఆధారం. వాటి ప్రకారం జనాభాలో ఓబీసీలు 52 శాతం! పదేళ్లకోసారి జరిగే జనాభా లెక్కింపులో ఎస్సీ, ఎస్టీల జనాభాను లెక్కిస్తున్నారు. జనాభా ప్రాతిపదికన వారికి రిజర్వేషన్లున్నాయి. అందుకే తమకూ అలాగే రిజర్వేషన్లను పెంచాలని ఓబీసీలు డిమాండ్ చేస్తున్నారు. కుల సమీకరణలు అధికంగా ఉన్న బిహార్‌లో ఓబీసీలే కీలకం. ఓబీసీ నాయకుడైన నితీశ్ మొదట్నుంచి కులగణనకు మద్దతుగా ఉన్నారు. ఎన్డీయే నుంచి బయటకు వచ్చాక దాన్ని ఆచరణలో పెట్టి రాజకీయ వేడిని పెంచారు.

ఒక్కసారి చరిత్రలోకి చూస్తే..

భారత దేశంలో మొట్టమొదటి సారిగా బ్రిటిష్ ప్రభుత్వం 1871లో కులగణన చేపట్టింది. మన దేశంలో ఉన్న విభిన్న వర్గాల ప్రజల్ని అర్థం చేసుకోవడానికే ఈ ప్రక్రియ మొదలు పెట్టింది. అప్పట్లో సేకరించిన సమాచారం ఆధారంగా కులాలకు ప్రాధాన్యతా క్రమాలను నిర్దేశించింది. అలా మొదలు పెట్టిన కులగణన 1931లో చివరిసారిగా చేశారు. ఆ నాటి జనాభా గణాంకాల ప్రాతిపదికగానే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించారు. స్వాతంత్ర్యానంతరం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన పార్టీలన్నీ కులగణనకు దూరంగా ఉన్నాయి. పదేళ్లకి ఒకసారి చేసే జనాభా లెక్కింపులో ఎస్సీ, ఎస్టీల డేటా సేకరణకు మాత్రమే పరిమితమయ్యారు.



బిహార్ జనాభా	మొత్తం కుటుంబాలు	మొత్తం జిల్లాలు	ఎస్సీలు
12.70 కోట్లు	2.58 కోట్లు	38	16%

ఎస్టీలు	ఓబీసీలు	ముస్లింలు	కుల గణనకయ్యే ఖర్చు
1.28%	48%	17%	రూ.500 కోట్లు

లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం ఎంత?

బిహార్‌లో కులగణన పూర్తయి లోక్‌సభ ఎన్నికల కంటే ముందే నివేదిక వస్తే నితీశ్ కుమార్, తేజస్వి యాదవ్‌లకే అత్యధికంగా లాభం చేకూరే అవకాశాలే కనిపిస్తున్నాయి. బిహార్‌లో ఓబీసీల్లో మరింతగా వెనుకబడిన వారైన అత్యంత వెనకబడిన తరగతులు(ఈబీసీ), దళితుల్లో మరింత అణగారిన మహాదళితుల కార్డుతో కొత్త సామాజిక సమీకరణలకి తెరతీసిన నితీశ్ రాజకీయంగా లబ్ధి పొందుతూ వస్తున్నారు. వీరి వాస్తవ సంఖ్య వెల్లడైతే ఓటు బ్యాంకు రాజకీయాల్లో ఆయన పై చేయి సాధించవచ్చు. మహారాష్ట్ర, ఒడిశా వంటి రాష్ట్రాలు, ఎస్పీ, బీఎస్పీ, డీఎంకే వంటి పార్టీలు కులగణనకు మద్దతుగా ఉండడంతో దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ చేపట్టాలన్న స్వరం పెరుగుతుంది. . ఇప్పుడు బిహార్‌లో ఓబీసీ జనాభా ఎంత ఉందో వాస్తవాలు వెల్లడైతే వారి ఓటు బ్యాంకే ప్రధానంగా కలిగిన ప్రాంతీయ పార్టీలు బలపడతాయి. ఇది జాతీయ స్థాయిలో ప్రధాన పార్టీలైన బీజేపీకి, కాంగ్రెస్‌కు కూడా ఎదురు దెబ్బగా పరిణమిస్తుంది. అంతే కాకుండా దేశంలో మరోసారి మండల్ వర్సెస్ కమండల్ రాజకీయాలకు తెరలేవచ్చు. 1990 దశకంలో బీజేపీ నేత అద్వానీ రథయాత్రకు కౌంటర్‌గా మండల్ కమిషన్ నివేదికతో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించడం దేశవ్యాప్తంగా హింసకు దారి తీసింది ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలను మినహాయించి మిగిలిన కులాల జనగణన సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఇప్పుడు నితీశ్ కుమార్ చేపట్టిన ప్రక్రియ జాతీయ రాజకీయాలను ఎలాంటి మలుపులు తిప్పుతుందో వేచి చూడాల్సిందే.

2011లో యూపీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన కులాల వివరాలను కూడా సేకరించింది. కానీ వాటిని విడుదల చేయలేదు. ప్రస్తుతం కేంద్రంలో సామాజిక న్యాయశాఖ సహాయ మంత్రి ప్రతిమ భూమిక యూపీఏ హయాంలో జరిగిన కులగణన సరిగా జరగలేదని, అదంతా తప్పులతడకగా సాగిందని చెబుతున్నారు. ప్రస్తుతమున్న పరిస్థితులకు ఆ డేటా పాతబడిపోయిందని వివరించారు.

– సాక్షి, నేషనల్‌డెస్క్

జనాభాను నియంత్రించలేం

- బిహార్‌లో స్త్రీలు నిరక్షరాస్యులు
- పురుషుల్లో నిర్లక్ష్యం ఎక్కువ: నితీశ్

పాట్నా: జనాభా పెరుగుదలను అరికట్టే విషయంలో బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. తమ రాష్ట్రంలో స్త్రీలు నిరక్షరాస్యులని, పురుషుల్లో నిర్లక్ష్యం ఎక్కువని, అందుకే జనాభా పెరుగుదలను నియంత్రించలేమని తేల్చిచెప్పారు. సమాధాన్ యాత్రలో భాగంగా ఆయన ఆదివారం వైశాలీలో బహిరంగ సభలో ప్రసంగించారు. మహిళలు చదువుకుంటే జనాభా తగ్గుతుందని, ఇదే వాస్తవమని అన్నారు. గర్భం రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని అక్షరాస్యులైన మహిళలకు తెలుస్తుందని వెల్లడించారు. జనాభా నియంత్రణపై పురుషులు సైతం దృష్టి పెట్టడం లేదని ఆక్షేపించారు. ఎక్కువ మంది పిల్లలను కనొద్దన్న ఆలోచన వారిలో ఉండడం లేదన్నారు. నితీశ్ కుమార్ వ్యాఖ్యలను ప్రతిపక్ష బీజేపీ నేత సామ్రాట్ చౌదరి తప్పుపట్టారు. బిహార్ ప్రతిష్టను దెబ్బతీసేలా నితీశ్ మాట్లాడారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవికి ఉన్న గౌరవాన్ని దిగజార్చేలా వ్యవహరించారని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ఆ టీలో విషం కలిపారేమో..!

పోలీసులు ఇచ్చిన టీ తాగడానికి
నిరాకరించిన అఖిలేశ్ యాదవ్

లక్నో: ఉత్తరప్రదేశ్ లక్నోలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో తనకు ఇచ్చిన టీని తాగడానికి సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ నిరాకరించారు. ఆ టీలో విషం కలిపారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ''పోలీసులు ఇచ్చిన టీ నేను తాగను. బయట నుంచి తెప్పించుకొని తాగుతాను. ఎందుకంటే ఈ టీలో విషం కలిపారేమో'' అని అఖిలేశ్ అన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినందుకు ఓ ఎస్పీ నేతను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన విడుదల కోసం ఎస్పీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పోలీసు ప్రధాన కార్యాలయానికి చేరుకొని నిరసనకు దిగారు. ఆ సమయంలో వచ్చిన అఖిలేశ్‌కు తాగడానికి టీ ఇవ్వబోతే ఆయన విషం కలిపేరేమోనని తాగడానికి నిరాకరించడం సంచలనంగా మారింది.

2024లో రిషి గెలుపు కష్టమే!



లండన్: భారత సంతతికి చెందిన బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌తో పాటు ఆయన కేబినెట్‌లోని 15 మంది మంత్రులు 2024 ఎన్నికల్లో గెలవడం కష్టమేనని తాజా సర్వేలో తేలింది. ఈ మేరకు వివరాలను ది ఇండిపెండెంట్ వెల్లడించింది. రిషి, డిప్యూటీ పీఎం డొమినిక్ రాబ్, ఆరోగ్య మంత్రి స్టీవ్ బార్క్లేతో పాటు అధికార కన్జర్వేటివ్ పార్టీలోని సీనియర్ సభ్యులకు ఓటమి గండముందని ఒక్కో సీటుకు వేర్వేరుగా చేపట్టిన ఫోకల్‌డేటా పోలింగ్‌లో వెల్లడైంది. బెస్ట్ ఫర్ బ్రిటన్ అనే సంస్థ ఈ వివరాలను వెల్లడించింది. రిషి కేబినెట్‌లో జెరెమీ హంట్, సుయెల్లా బ్రేవర్మన్, మైకేల్ గోవ్, నదీమ్ జహావీ, కేమీ బడెనోక్ మాత్రమే గెలిచే అవకాశాలున్నాయని తెలిపింది. రిషి కేబినెట్ దాదాపుగా తుడిచిపెట్టుకుపోతుందని 'బెస్ట్ ఫర్ బ్రిటన్' చీఫ్ ఎగ్జిక్యూటివ్ నవోమి స్మిత్ చెప్పారు. అయితే తమ సర్వేలో ఓటెవరికో చెప్పలేని వారు ఎక్కువగా ఉన్నారని ఆయనన్నారు. వచ్చే ఎన్నికల నాటికి వీరు కన్జర్వేటివ్ పార్టీ వైపు మొగ్గు చూపితే ఫలితం వేరుగా ఉంటుందని తెలిపారు.

కారు కింద ఇరుక్కుందని తెలుసట!

న్యూఢిల్లీ: ఢిల్లీలో డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి దాటాక స్కూటీపై వెళ్తున్న అంజలీ సింగ్‌ను ఢీకొట్టి, 12 కిలోమీటర్లు లాక్కెళ్లిన ఘటనలో పోలీసు విచారణలో మరికొన్ని విషయాలు వెలుగు చూశాయి. తమ కారు కింద ఒక మహిళ ఇరుక్కుపోయిన విషయం తెలుసునని, కారాపి ఆమెను విడిపించినప్పటికీ హత్య కేసు నమోదవుతుందని భయపడ్డామని నిందితులు తెలిపారని పోలీసులు ఆదివారం వెల్లడించారు. అందుకే, మహిళ శరీరం కారు నుంచి విడిపోయేదాకా ఆపకుండా నడిపినట్లు చెప్పారన్నారు. సుల్తాన్‌పురి నుంచి కంఝావాలా వరకు పలుమార్లు కారును యూ టర్న్ తీసుకుని 12 కిలోమీటర్ల మేర అంజలిని లాక్కెళ్లగా ఆమె తీవ్ర గాయాలతో చనిపోయిన విషయం తెలిసిందే. తమ కారు కింద ఒక మహిళ ఇరుక్కున్న విషయం తెలియదని, విషయం తెలిశాక అక్కడి నుంచి పరారైనట్లు అంతకుముందు నిందితులు తెలిపిందంతా అబద్ధమని తేలింది. అంజలి, తన స్నేహితురాలు నిధి కలిసి స్కూటీపై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో నిధి స్వల్పగాయాలతో బైటపడగా, అంజలి కారు కింద ఇరుక్కుంది. కాగా, ఈ కేసులో పోలీసులు ఇప్పటి వరకు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.







రుచికరమైన చక్కని చిక్కని టీ అందించే రోబోటిక్ బార్‌టెండర్ ఇది. పేరు ఆడమ్. అమెరికాలోని లాస్ వెగాస్ సిటీలో కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ షోలో దీనిని ప్రదర్శించారు. దీనితోపాటు డివైజ్‌లో మనం చూసే సీన్‌కు తగ్గట్లు వాసనలు వెదజల్లే పరికరం, స్విమ్మింగ్ పూల్ అడుగు భాగం, గోడలు, వాటర్‌లైన్లను చక్కగా శుభ్రం చేసే పూల్ క్లీనర్‌లనూ ఆయా సంస్థలు ప్రదర్శనకు ఉంచాయి.

మరిన్ని 'జోషి మఠ్'లు!

నైనిటాల్ వంటి పట్టణాలకూ ముప్పే ● కుటుంబాల తరలింపు, పీఎంఓ సమీక్ష



నేల కుంగడంతో జోషి మఠ్‌లో కూలిపోయిన ఓ ఆలయం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని జోషి మఠ్‌లో ఇళ్లు పగుళ్లివ్వడానికి విపరీతమైన వర్షాల వల్ల భూమి క్రమక్షయం, నేల లోపలి భాగం గుల్లబారడం వంటివి కారణమని నిపుణులు చెబుతున్నారు. ''వీటితో పాటు ఇష్టారాజ్యంగా తవ్వకాలు, ఇళ్లతో పాటు డ్యాముల వంటి భారీ నిర్మాణాలు కూడా సమస్యకు కారణమే. అయితే భూమి లోపలి పొరల్లోని (టెక్టానిక్) కదలికలే దీనికి ప్రధాన కారణం. ఇటీవల ఇది వేగం పుంజుకుంది. దీన్ని అడ్డుకోవడం మన చేతుల్లో లేదు '' అని వారంటున్నారు. రాష్ట్రంలోని నైనిటాల్, ఉత్తరకాశి, చంపావత్ తదితర పట్టణాలకూ ఇలాంటి ముప్పు పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ ప్రాంతాల్లోని సున్నితం, బలహీనమైన నేల, దాని లోపలి పొరలతో ఎప్పటికైనా ప్రమాదమేనని చెబుతున్నారు. మరోవైపు, జోషి మఠ్‌ను కొండచరియలు విరిగిపడే ముప్పున్న ప్రాంతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటిదాకా 60కి పైగా కుటుంబాలను ఖాళీ చేయించారు. మరో 90 కుటుంబాలను కూడా తరలించనున్నారు. కలెక్టర్ సారథ్యంలో ప్రభావిత ఇళ్ల పరిశీలన కొనసాగుతోంది. పట్టణంలోని 4,500 పై చిలుకు ఇళ్లలో 610 ఇళ్లు పగుళ్లిచ్చి నివాసానికి పనికిరాకుండా పోయినట్టు గఢ్వాల్ కమిషనర్ సుశీల్ కుమార్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా సీఎం పుష్కర్‌సింగ్ ధామితో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని ఆరా తీశారు. ఇప్పటిదాకా తీసుకున్న చర్యలపై నివేదిక కోరారు. ప్రధాని కార్యాలయం కూడా ఆదివారం దీనిపై ఉన్నత స్థాయి సమీక్ష జరిపింది. ప్రజల క్షేమమే తొలి ప్రాధాన్యమని ఒక ప్రకటనలో పేర్కొంది. ఐఐటీ రూర్కీ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణులు కూడా సమీక్షలో పాల్గొన్నారు. జోషి మఠ్ పరిస్థితిపై హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ ఇమేజరీ ద్వారా అధ్యయనం చేయనున్నాయి.

మా అమ్మ పార్థివ దేహం వద్ద...
కరువుదీరా ఏడ్వలేకపోయా

రాచరికపు కట్టుబాట్లే కారణం: హ్యారీ

లండన్: బ్రిటన్ రాచ కుటుంబంపై ప్రిన్స్ హ్యారీ (38) విమర్శలు, ఆరోపణల పరంపర కొనసాగుతూనే ఉంది. ప్రేమకు ప్రతిరూపమైన తన తల్లి డయానా చనిపోతే కనీసం కరువుదీరా ఏడవలేకపోయానని మంగళవారం విడుదల కానున్న తన స్వీయచరిత్ర 'స్పేర్'లో ఆయన వాపోయారు. రాచ కుటుంబపు కఠినమైన నైతిక కట్టుబాట్లే అందుకు కారణమని ఆరోపించారు. ''ఏం జరిగినా ఏడవకూడదన్నది రాజకుటుంబంలో అలిఖిత నియమం. ఇలాంటి వాటిని చిన్నతనం నుంచే రుద్దీ రుద్దీ నా హృదయాన్ని బండబార్చారు. దాంతో మా అమ్మ చనిపోయి అంతులేని శూన్యాన్ని మిగిల్చినా ఆ దుర్భర ఆవేదనను బయట పెట్టే స్వేచ్ఛ కూడా లేకపోయింది. దాన్నంతటినీ గుండెల్లోనే అదిమి పెట్టి మా అమ్మ కడసారి చూపు కోసం భారీగా తరలివచ్చిన అభిమానులను నవ్వుతూ పలకరించాల్సి వచ్చింది. కానీ వారిలో ఎవరితో కరచాలనం చేసినా అరచేతులన్నీ తడితడిగా తగిలాయి. అవన్నీ వారి కన్నీళ్లతో తడిశాయని అర్థమై చాలా సిగ్గుపడ్డా. ఆ వీడియోలను ఇప్పుడు చూసినా సిగ్గేస్తుంటుంది'' అన్నారు.



పూజల పార్టీ బీజేపీ

తపస్సుగా పాదయాత్ర: రాహుల్ గాంధీ

కురుక్షేత్ర: సమాజంలో పెచ్చరిల్లుతున్న విద్వేషం, పెరిగిపోతున్న భయంతోపాటు నిరుద్యోగం, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా భారత్ జోడో యాత్ర చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ తెలియజేశారు. పాదయాత్రను ఒక తపస్యగా భావిస్తున్నామని చెప్పారు. పాదయాత్ర అనేది నిరాడంబరతను సూచిస్తుందని, ఇదొక ధ్యానం లాంటిదేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ తపస్యను నమ్ముతోందని, అధికార బీజేపీ ఒక పూజల సంస్థ అని విమర్శించారు. తపస్యపై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు ఏమాత్రం గౌరవం లేదన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కే ప్రజలంతా పూజలు (ఆరాధన) చేయాలని అవి కోరుకుంటున్నాయని ఆక్షేపించారు. బలవంతంగానైనా జనంతో పూజలు చేయించుకోవాలని ప్రధాని మోదీ ఆశిస్తున్నారని మండిపడ్డారు. జర్నలిస్టుల తపస్య అంటే మోదీకి భయమని, అందుకే మీడియా ముందుకు రావడానికి జంకుతున్నారని దుయ్యబట్టారు. హరియాణాలో పాదయాత్ర కొనసాగిస్తున్న రాహుల్ గాంధీ ఆదివారం మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటం అనేది తపస్య కోసం జరిగిన యుద్ధమని అన్నారు. ఆ సమయంలో బీజేపీ/ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు బ్రిటిష్ పాలకులకు పూజలు చేశారని ఎద్దేవా చేశారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పూజల ప్రభావాన్ని ఎదిరించడానికి లక్షలాది మంది నేడు కాంగ్రెస్ పార్టీతో కలిసి తపస్యలో నిమగ్నమయ్యారని ఉద్ఘాటించారు. హిందూ దేవుళ్ల అభయ ముద్ర నుంచే కాంగ్రెస్ పార్టీ గుర్తు (హస్తం) పుట్టిందని రాహుల్ అన్నారు. తాను ఒక తపస్వినని చెప్పారు. ఇకపైనా తపస్విగానే కొనసాగుతానని వివరించారు. తన యాత్ర రాజకీయ పోరాటం కాదని స్పష్టంచేశారు. బీఎస్పీ లేదా తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్‌ఎస్)కు వ్యతిరేకంగా పోరాడితే అది రాజకీయ పోరాటం అవుతుందన్నారు. తమది ధర్మం కోసం సాగుతున్న సిద్ధాంతపరమైన పోరాటమని చెప్పారు. బీజేపీ ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల దేశంలో రైతన్నలు కష్టాల ఊబిలో చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



హరియాణాలోని కురుక్షేత్రలో రాహుల్ పూజలు



'గురి' కుదిరింది

అండర్-9, అండర్-14 బాలబాలికల జాతీయ ఆర్చరీ పోటీలు కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ పర్యవేక్షణలో ఎన్టీపీసీ సంస్థ ఈ పోటీలను నిర్వహిస్తోంది. సిద్ధార్థ అకాడమీ చైర్మన్ పాలడుగు లక్ష్మణరావు పోటీలను ప్రారంభించారు. ఆయా వయసుల విభాగాల్లో 400 మంది క్రీడాకారులు పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు.

– విజయవాడ స్పోర్ట్స్

న్యూస్‌రీల్

ఫ్యాప్టో కృష్ణా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

చిలకలపూడి(మచిలీపట్నం): ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కృష్ణాజిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర పరిశీలకుడు, ఎస్సీ, ఎస్టీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మద్ది బాబురాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా బి. లంకేశ్వర రావు (ఏపీటీఎఫ్), సెక్రటరీ జనరల్ డి. అశోక్‌కుమార్ (ఎస్సీ, ఎస్టీ యూఎస్), కో–చైర్మన్లు కె. రాజేంద్రప్రసాద్ (డీటీఎఫ్), ఎం. రాజేష్ (బీటీఏ), ఎన్. బానాల్డ్ (ఏపీఆర్‌ఈఐటీఏ), డెప్యూటీ సెక్రటరీ జనరల్స్ బి. కనకరావు(యూటీఎఫ్), పి. ఇమ్మానుయేల్ (ఎస్టీయూ), ఈవీ రామారావు (ఏపీటీఎఫ్), ట్రెజరర్‌గా ఏఆర్ అస్లాం ఎన్నికైనట్లు తెలిపారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా హ్యాండ్‌బాల్ జట్లు ఎంపిక



గన్నవరం: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 13, 14 తేదీల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి కృష్ణాజిల్లా జూనియర్, సబ్ జూనియర్ బాలుర జట్లను ఆదివారం స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కేవీఆర్ కిశోర్ నేతృత్వంలో జరిగిన ఈ సెలక్షన్స్‌కు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అత్యుత్తమ క్రీడా నైపుణ్యం కనబరిచిన 15 మందిని జూనియర్ జట్టుకు, మరో 15 మందిని సబ్‌జూనియర్ జట్టుకు ఎంపిక చేసినట్లు కిశోర్ తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా గన్నవరంలో జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు.

దుర్గమ్మ నివేదనకు 365 దేశవాళీ రకాల బియ్యం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ మహా నివేదనకు 365 రకాల దేశవాళీ బియ్యాన్ని అందించనున్నామని ఎన్ఆర్ఐ కోమటిరెడ్డి మౌనిక తెలిపారు. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం ఎన్ఆర్ఐ కోమటిరెడ్డి మౌనిక, రైతు యర్రు బాపారావుతో పాటు పలువురు భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి దేశవాళీ బియ్యం గురించి వివరించారు. 365 రోజులు 365 రకాల దేశవాళీ బియ్యంతో అమ్మవారి మహా నివేదనకు ఉపయోగించేందుకు వీలుగా అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మన ఇష్టదైవానికి ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే నైవేద్యాన్ని స్వచ్ఛమైనదిగా ఉండాలనే భావనతో సేంద్రియ పద్ధతిలోనే ఈ బియ్యాన్ని పండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి, ఈఈ రమా పాల్గొన్నారు.

నేడు స్పందన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్, మండలస్థాయిలోనూ స్పందన కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రంగు మారినా కొనుగోలు చేయండి

మిల్లర్లకు కృష్ణా జేసీ ఆదేశం

పెడన: రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కృష్ణా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ మిల్లర్లను ఆదేశించారు. ఆమె ఆదివారం పెడన మండలంలోని గురువిందగుంట, గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు పరిసర ప్రాంతాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఆర్బీకేల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోందని, అయితే రంగుమారిన ధాన్యం విషయంలో పది శాతం వరకు మాత్రమే ఆన్‌లైన్ చేసి కొనుగోలు కేంద్రాల ద్వారా తీసుకుంటున్నామన్నారు. పది శాతం కంటే అధికంగా ఉంటే రైతులు ఆర్బీకేల ద్వారా రంగుమారిన శాతం లెక్కింపును గణించి నేరుగా మిల్లర్లకు విక్రయించుకునే అవకాశం కల్పించామని చెప్పారు. రంగు మారిన ధాన్యం విషయంలో రైతులకు ప్రభుత్వం ఇచ్చే ధర కంటే అధికంగా ధర వస్తే మిల్లర్లకు అమ్ముకోవచ్చన్నారు. బయట మార్కెట్‌లో ప్రభుత్వం ఇచ్చే ధర కంటే మిల్లర్లు తక్కువ ధర ఇస్తే రైతులు ఆలోచన చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్ఓ పార్వతి, తహసీల్దార్ మధుసూదనరావు, గుడ్లవల్లేరు తహసీల్దార్ రహమాన్, పెడన ఏఓ జీవీ శ్రీనివాసరావు, ఆర్ఐ మణికుమార్, రైతులు పాల్గొన్నారు.

నిధుల వరద

కాలువల మరమ్మతులు, సుందరీకరణ పనులు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహణకు నిధులు మంజూరు
- మొత్తం 274 పనులకు రూ. 50.57 కోట్లు కేటాయింపు
- కాలువల్లో పూడికతీత, పలుచోట్ల అవుట్ ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణాలు
- ప్రకాశం బ్యారేజీ సుందరీకరణ చర్యలు
- ఈ సీజన్‌లోనే ప్రతిపాదిత పనులన్నీ పూర్తి చేసేందుకు ప్రణాళిక



కృష్ణానది రక్షణ గోడ వెంబడి ఫిల్లింగ్ చేస్తున్న సిబ్బంది


సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లాలో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో కాలువల మరమ్మతులు, సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం కృష్ణా తూర్పు డెల్టా పరిధిలో కాలువల్లో పూడికతీత, గేట్ల మరమ్మతులు, రిటైనింగ్‌వాల్ పనులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే డెల్టా పరిధిలో బందరు, రైవస్, ఏలూరు కాలువల పరిధిలో రైతులకు నీటి అవసరాలు తీరాయి. దీంతో జనవరి 15వ తేదీ నుంచి కాలువల్లో పనులు చేసేందుకు వీలుగా కాంట్రాక్టు సంస్థలు సిద్ధం చేసుకొంటున్నాయి. కాలువల పరిధిలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద 274 పనులకు రూ. 50.57 కోట్లతో టెండర్లు పూర్తయ్యాయి. కాలువల్లో తూటి కాడను తొలగించారు. కాలువలకు నీటిని విడుదల చేయడంతో, మిగిలిన పనులు అసంపూర్తిగా మిగిలాయి. ఆ పనులను ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన చేయనున్నారు. అవనిగడ్డ ప్రాంతంలో సాగు చేసిన పంటలకు నీటి అవసరం ఉన్నందున కేఈబీ కెనాల్‌కు సంబంధించిన పనులు ఫిబ్రవరి చివరి వారంలో చేయనున్నారు.

పెడన నియోజకవర్గంలోనే అధికం..

పెడన నియోజకవర్గం పరిధిలోని లజ్జబండ మేజర్ డ్రైన్‌లో పూడిక తీసేందుకు రూ.8 కోట్లు మంజూరయ్యాయి. అలాగే పెదలంక అవుట్ ఫాల్ స్లూయిస్ పనుల కోసం రూ. 40 కోట్లు కేటాయించారు. వీటికి సంబంధించి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని కోడూరు, నాగాయలంక సముద్ర తీర ప్రాంత అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణంలో రూ. 25 కోట్లతో చేపట్టనున్న పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు.

ప్రకాశం బ్యారేజీకి న్యూ లుక్..

ప్రకాశం బ్యారేజీ పైన తారు రోడ్డు రిపేరు చేసి, పుట్‌పాత్‌లను అందంగా తీర్చిదిద్ది రంగు రంగుల చిత్రాలతో అలంకరిస్తున్నారు. దీంతో పాటు కరకట్ట నుంచి, మంతెన సత్యనారాయణ ఆశ్రమం వరకు 5 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులు చేపడుతున్నారు. వీటికి సంబంధించి రూ.2.8 కోట్లతో పనులు సాగుతున్నాయి. కెనాల్ బ్యూటిఫికేషన్‌లో భాగంగా మొదటి, రెండో దశలో నిర్మించిన కృష్ణా నది వరద కరకట్ట రిటైనింగ్ వాల్ వెంబడి, 25 మీటర్ల వెడల్పుతో బండ్ ఫిల్లింగ్ చేసి పార్కుగా తీర్చిదిద్దుతున్నారు. దీనికోసం రూ. 20కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపారు. మొత్తం మీద వర్కింగ్ సీజన్ కావడంతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో పనులు చకచకా చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



డెల్టా పరిధిలో జరుగుతున్న పనుల వివరాలు..

విభాగం పేరు	పనుల సంఖ్య	పనుల విలువ (రూ. కోట్లలో)
కృష్ణా మధ్య	67	20.56
కృష్ణా తూర్పు	79	10.07
ప్రత్యేక విభాగం	34	2.68
డ్రైనేజీ	94	17.26
మొత్తం	274	50.57

పనులు వేగవంతం చేశాం..



కృష్ణా డెల్టా పరిధిలో కాలువల పూడికతీత, గేట్ల మరమ్మతులు, స్లూయిస్ నిర్మాణం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. జనవరి 15వ తేదీ నుంచి పనులు ఊపందుకొనున్నాయి. ప్రకాశం బ్యారేజీ సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. కెనాల్ బ్యూటిఫికేషన్‌లో భాగంగా కృష్ణానది రక్షణ గోడ వెంబడి రూ.20 కోట్లతో ఫిల్లింగ్ పనులు చేస్తున్నాం, ఇంకా జిల్లాలో ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నాం. వర్కింగ్ సీజన్‌లో పనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నాం.

– తిరుమలరావు, ఎస్ఈ, నీటిపారుదల శాఖ, ఉమ్మడి కృష్ణా జిల్లా

సంగీత నాదం..
సుస్వర వేదం

జనవరి అనగానే తెలుగింట పెద్ద పండుగ సంక్రాంతి అందరికీ గుర్తుకువస్తుంది. అయితే సంగీత ప్రియులకు, అలాగే సాహిత్య ప్రియులకు మాత్రం మరో రెండు పండుగలు జ్ఞప్తికి వస్తాయి. ముఖ్యంగా విజయవాడ వాసులకు ఇక్కడ నిర్వహించే బుక్ ఫెస్టివల్, సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన, సంగీతోత్సవాలు మధురానుభూతిని మిగుల్చుతాయి. దక్షిణ భారతదేశంలో చెన్నై తర్వాత సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు అత్యంత వైభవంగా జరిగేది విజయవాడ నగరంలోనే. సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో సంగీత సన్మండలి సంస్థ ఆధ్వర్యంలో పక్కా ఏర్పాట్లు చేశారు.



సంగీత విద్వాంసులు నిర్వహిస్తున్న పంచరత్న కృతుల గోష్టిగానం(ఫైల్)

- నేటి నుంచి సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన, సంగీతోత్సవాలు
- వారం పాటు నిర్వహణ
- దేశ, విదేశాల నుంచి విద్వాంసుల రాక
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



విజయవాడ కల్చరల్: నాదోపాసకుడు నిరంతర రామనామ జపంతో తరించి, అనేక కీర్తనలను రచించిన త్యాగరాజ స్వామి తెలుగు వారు. సంగీత విద్య అభ్యాసం కోసం తమిళనాడులోని తిరువయ్యార్‌లో స్థిరపడ్డారు. కోట్లాది సంగీత ప్రియులను సంగీతం వైపు నడిపించిన త్యాగరాజ స్వామి జన్మదినం అయిన జనవరి 6న ప్రపంచంలోని సంగీత ప్రియులందరూ భక్తిగా జరుపుకొంటారు. తిరువయ్యార్‌లో జరిగే త్యాగరాజ స్వామి సంగీతోత్సవాలలో సంగీత ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. అదే స్థాయిలో నగరంలోని సంగీత సన్మండలి ఆధ్వర్యంలో ఏటా జనవరిలో ఆరాధనోత్సవాలను వైభవంగా జరుపుతున్నారు.

26 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం..

1995లో తొలిసారిగా సంగీత సన్మండలి త్యాగరాజ స్వామి ఆరాధాన ఉత్సవాలను ప్రారంభించింది. నాటి సంగీత ప్రముఖులు పెమ్మరాజు సూర్యారావు, కేవీ రెడ్డి, మహదేవపు లక్ష్మీనారాయణరాజు ప్రారంభించిన సంగీత సన్మండలి నేటికీ క్రమం తప్పకుండా సంగీత ఉత్సవాలను ఏటా నిర్వహిస్తోంది. 9వ తేదీ మంగళవారం సాయంత్రం దుర్గాపురంలోని సంగీత కళాశాలలో సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖ శర్మ ప్రారంభిస్తారు. వారం పాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి.

ప్రముఖుల కచేరీలు..

సంగీత ఉత్సవాలలో విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, నేదునూరి కృష్ణమూర్తి, నూకల చిన సత్యనారాయణ, హైదరాబాద్ సోదరులు, ద్వారం దుర్గాప్రసాద్, వి. కమలాకరరావు, ఎల్లా వెంకటేశ్వరరావు, అన్నవరపు రామస్వామి, దండమూడి సుమతీ రామ్మోహనరావు, మల్లాది సూరిబాబు, మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, అంపోలు మురళీ కృష్ణ మల్లాది సోదరులు తమ కచేరీల ద్వారా సంగీత సన్మండలి ప్రతిష్టను పెంచారు.

ఇవి ప్రధానం..

12వ తేదీ త్యాగ రాజ స్వామి ఉత్సవ సంప్రదాయాన్ని పాటిస్తూ, నగర సంకీర్తన.. 15వ తేదీ ఆదివారం ఉదయం నిర్వహించే పంచతర్న కృతుల గోష్టిగానంలో దాదాపు రెండువందల మంది కళాకారులు త్యాగరాజస్వామి రచించిన సంకీర్తనలను గానం చేస్తారు.

పక్కాగా ఏర్పాట్లు..



సంగీతమే ఊపిరిగా చేసుకున్న త్యాగరాజ స్వామి సంగీత ఉత్సవాలను వారం రోజులపాటు నిర్వహిస్తున్నాం. సమయపాలనకు ప్రాధాన్యమిస్తూ సంగీత కార్యక్రమలను నిర్వహిస్తాం. త్యాగరాజ స్వామి రచించిన కృతులను మాత్రమే సంప్రదాయ దుస్తులను ధరించి గానం చేయాలి.

– మోదుమూడి సుధాకర్, సన్మండలి కార్యదర్శి

26న శ్రీపంచమి వేడుకలు

సరస్వతి దేవిగా దర్శనమివ్వనున్న దుర్గమ్మ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ శ్రీపంచమిని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శ్రీపంచమి నేపథ్యంలో అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద వేదికను ఏర్పాటు చేసే వేదికపై ఉత్సవ మూర్తిని సరస్వతిదేవిగా అలంకరిస్తారు. అమ్మవారిని దర్శించుకునేందుకు నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు తరలిరానున్న నేపథ్యంలో దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 26వ తేదీ రిపబ్లిక్ డే నేపథ్యంలో పాఠశాలలు, స్కూళ్లకు సెలవు కావడంతో విద్యార్థులు పెద్ద సంఖ్యలో దేవస్థానానికి విచ్చేస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

విద్యార్థులకు పెన్నులు పంపిణీ..

రానున్న వార్షిక పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కాంక్షిస్తూ దేవస్థానం ఉచితంగా పెన్నులను పంపిణీ చేయనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యార్థులు అమ్మవారిని ముఖ మండపం ద్వారా దర్శించుకోవచ్చు. అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసే విద్యార్థులు కళాశాల యూనిఫాం, ఐడీ కార్డును ధరించి రావాల్సి ఉంటుంది. అమ్మవారి దర్శనం అనంతరం విద్యార్థులకు పెన్ను, అమ్మవారి ఫొటో, రక్షాకంకణం, కుంకుమ ప్రసాదాలను అందజేస్తారు. విద్యార్థులకు పంపిణీ చేసే పెన్నులను దాతలు విరాళంగా అందించవచ్చని అధికారులు పేర్కొన్నారు. దాతలు దేవస్థాన సమాచార కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

చివరి గింజ వరకూ కొంటాం : ఎమ్మెల్యే కైలే



మొవ్వ(పామర్రు): రంగు మారిన ధాన్యాన్ని సైతం చివరి గింజ వరకు కొనే విధంగా ప్రభుత్వం పూర్తి ఏర్పాట్లు చేసిందని, ప్రభుత్వం అన్న దాతలకు అండగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని పీఏసీఎస్‌లో ఆదివారం సివిల్ సప్లయీస్ డీఎం శ్రీధర్, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి కె. శివప్రసాద్, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతిలతో కలిసి ధాన్యం కొనుగోలుపై రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొవ్వ సొసైటీ పరిధిలో రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించారు. వారికి అవసరమైన సంచులను తక్షణమే తెప్పించి, నాలుగు లోడుల ధాన్యం మిల్లులకు తరలించారు. అలాగే మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులను పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మిల్లర్ల వద్దకు రైతు వెళ్లవలసిన అవసరం లేదని ఏవైనా సమస్యలు ఉంటే కస్టోడియం అధికారులకు తెలపాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లుగా తూకం వేసి మిల్లులకు తరలించే విధంగా ప్రభుత్వం పక్కాగా ఏర్పాట్లు చేసిందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అడ్వైజరీ కమిటీ సభ్యుడు గోగినేని పెరుమాళ్లు, రైతులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య



మాట్లాడుతున్న ఎంపీ ఆర్ కృష్ణయ్య, చిత్రంలో మారేష్, బోను దుర్గానరేష్

మధురానగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం బీసీలపై మొండి వైఖరి వీడి, ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసి రూ.2 లక్షల కోట్లు మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విజయవాడ గాంధీనగర్‌లో ఆదివారం సాయంత్రం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము బీసీలకు విద్య, ఉద్యోగాలు, అభ్యున్నతి కోసం పోరాటం చేశామని.. కానీ రాజ్యాధికారంతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని అన్నారు. చట్టసభల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీసీలకు స్వయం ఉపాధి పథకం ద్వారా రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల రుణాలను 80 శాతం రాయితీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు కేవలం 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వటం సరికాదన్నారు. బీసీలకు చట్టసభలలో రిజర్వేషన్‌లు కల్పించేంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్‌లు కల్పించాలని, దేశవ్యాప్తంగా ఖాళీగా 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ క్రిమీలేయర్ ఎలా ఏర్పాటు చేశారో తెలియజేయాలన్నారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ మాట్లాడుతూ.. బీసీలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారని కొనియాడారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీల పక్షాన పోరాటం చేసిన ఆర్. కృష్ణయ్యకు రాజ్యసభ సీటు ఇచ్చి బీసీలకు న్యాయం చేశారని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు వేముల బేబీరాణి, రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు రాజులపాటి కల్యాణి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అర్షద్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్ల మహీధర్ పాల్గొన్నారు.

విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలలోకి వెళ్తున్న గ్రూప్-1 అభ్యర్థులు



విజయవాడ బిషప్ అజరయ్య పరీక్ష కేంద్రంలో కలెక్టర్ ఢిల్లీరావు



గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతం

ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విజయవాడలోని 13 కేంద్రాలలో పరీక్ష నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం కలిపి మొత్తం 6,432 మంది అభ్యర్థులకు గానూ 4,490 మంది పరీక్షకు హాజరుకాగా 1,952 మంది గైర్హాజరయ్యారు. బిషప్ అజరయ్య జూనియర్ కళాశాలను కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, మేరీ స్టెల్లా కళాశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో జేసీ ఎస్. నుపూర్ అజయ్, శ్రీచైతన్య జూనియర్ కళాశాల, వీపీ సిద్ధార్థ కళాశాలను డీఆర్ఓ కె. మోహన్‌కుమార్ పరిశీలించారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ బెంజిసర్కిల్ సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాల కేంద్రంలో కొల్లూరు వెంకటేష్ అనే అభ్యర్థి సెల్‌ఫోన్ పరీక్ష కేంద్రానికి తీసుకువచ్చినట్లు గుర్తించి, చీఫ్ సూపరింటెండెంట్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని తెలిపారు.

– గాంధీనగర్(విజయవాడ సెంట్రల్)

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రూ.12 లక్షల విలువైన సొత్తు రికవరీ



రికవరీ చేసిన బంగారం, ఇతర వస్తువులు, నిందితుడిని చూపిస్తున్న రైల్వే పోలీసులు

గుడివాడరూరల్: రైలులో ప్రయాణికుల నుంచి ఆభరణాలు, ఇతర సామగ్రి చోరీ చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి రూ.12 లక్షల విలువైన సొత్తు రికవరీ చేశామని రైల్వే ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లకు వివరాలు వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్ నెల 2వ తేదీన లింగంపల్లి నుంచి నర్సాపురం వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుల వద్ద పలు రకాల వస్తువులు అపహరణకు గురయ్యాయని తెలిపారు. నిందితుడిని పట్టుకునేందుకు రైల్వే ఎస్పీ విశాల్ గున్నీ, డీఎస్పీ పి.నాగరాజురెడ్డి ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు అధికారులైన కె.సాయినాథ్, విజయవాడ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టి.చంద్రశేఖరరెడ్డి, ఆర్పీఎఫ్ సీఐడీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది సహాయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఈ కేసుకు సంబంధించి నిందితుడు గుంటూరు జిల్లాకు చెందిన వెలువోలు వెంకటేష్‌ను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. 412 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు లాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, ఒక బైక్, కొన్ని ఎలక్ట్రానిక్ వస్తువులను రికవరీ చేశామని వెల్లడించారు. చోరీ కేసు ఛేదించే విషయంలో ప్రతిభ చూపిన గుడివాడ పోలీస్ సిబ్బంది సాయికృష్ణ, గుమ్మడి అజయ్, ఆర్పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, అక్బర్‌ను ఉన్నతాధికారులు అభినందించినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వివరించారు.

వీఎంసీలో యూనిఫైడ్ సర్వీస్ రూల్స్

- కేటగిరీల వారీగా ఉద్యోగులకు బదిలీలు, ప్రమోషన్లు
- డిగ్రీ విద్యార్హతే ప్రామాణికం
- శానిటేషన్ విభాగానికి మినహాయింపు



పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ఇకపై అన్ని స్థానిక సంస్థలకు ఒకే విధమైన సర్వీస్ రూల్స్ అమలు చేయనుంది. నియామకాలు, బదిలీలు, పదోన్నతుల వ్యవహారంలో వీఎంసీకి సైతం వర్తించేలా ప్రణాళికలు రూపొందించనుంది. విజయవాడ నగరపాలక సంస్థకు యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ వర్తించాలని ప్రభుత్వం భావిస్తోంది. 1981 లో పురపాలక సంస్థ నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఆవిర్భవించినా వీఎంసీ ఉద్యోగుల నియామకాలు, బదిలీలు, పదోన్నతులు తదితర అంశాలన్నీ రాష్ట్ర విడిపోయే వరకు గ్రేటర్ హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్ సర్వీస్ రూల్స్‌నే అనుసరిస్తుంది. రాష్ట్ర విభజన అనంతరం విజయవాడ నగర పాలక సంస్థకు ఎలాంటి సర్వీస్ రూల్స్ లేకపోవటంతో నియామకాలు, పదోన్నతులు, బదిలీలు సమస్యగా మారింది. దీనిపై 2019లో వీఎంసీ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపగా రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, మెట్రోరీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు ఒకే విధమైన సర్వీస్ రూల్స్ ఉండాలని భావించింది. దీంతో మార్పులపై కసరత్తు చేసింది. కార్పొరేషన్‌లోని ఇంజినీరింగ్, పబ్లిక్‌హెల్త్, ఎస్టేట్స్, రెవెన్యూ, అకౌంట్స్, పట్టణ ప్రణాళిక విభాగంలో విధులు నిర్వహిస్తున్న వివిధ కేడర్‌ల మినిస్టీరియల్ ఉద్యోగులకు నూతన సర్వీస్ రూల్స్ వర్తించేలా అన్ని విభాగాల నుంచి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ నివేదికలు కోరింది. దీనిపై వీఎంసీ ఇప్పటికే నివేదిక అందించగా నియామకాలు, పదోన్నతులు, బదిలీల అంశంలో డిగ్రీ విద్యార్హతలను ప్రామాణికంగా తీసుకునే అమలు చేయాలని సూచించింది. అయితే ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మాత్రం ప్రభుత్వం డిగ్రీ విద్యార్హత నుంచి మినహాయింపు ఇచ్చింది.

కేటగిరీల విభజన ఇలా....

వ.నెం	కేటగిరీ	పోస్టు
1	కేటగిరీ-1	మేనేజర్/సూపరింటెండెంట్/రెవెన్యూ అధికారి
2	కేటగిరీ-2	సీనియర్ అసిస్టెంట్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, అప్పర్ డివిజన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్ స్టెనోగ్రాఫర్, ఇదే స్కేల్ పొందుతున్న మినిస్టీరియల్ సిబ్బంది
3	కేటగిరీ-3	జూనియర్ అసిస్టెంట్, జూనియర్ స్టెనోగ్రాఫర్, డివిజన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇదే స్కేలులో వేతనం పొందుతున్న మినిస్టీరియల్ ఉద్యోగులు
4	కేటగిరీ-4	బిల్‌కలెక్టర్‌లు

బదిలీలు ఇలా

కేటగిరీ-1 : ఉద్యోగులు మల్టీజోన్ పరిధిలోకి వస్తారు. వీరిని రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, ఉడా (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)ఏపీఎంఆర్‌డీఏ (ఆంధ్రప్రదేశ్ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ)లకు, బదిలీ/పదోన్నతి కల్పించవచ్చు.

కేటగిరీ-2 : జోనల్ విభాగంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, ఉడా (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏపీఎంఆర్‌డీఏ (ఆంధ్ర ప్రదేశ్ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ)లకు, బదిలీ/పదోన్నతి కల్పించవచ్చు.

కేటగిరీ-3, 4 : జిల్లాను యూనిట్‌గా తీసుకుని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, ఉడా (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ), ఏపీఎంఆర్‌డీఏ(ఆంధ్రప్రదేశ్ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ లకు, బదిలీ/పదోన్నతి కల్పించవచ్చు.

డిగ్రీ అర్హతే ప్రామాణికం.....

ఇప్పటి వరకు నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే ఉద్యోగుల పదోన్నతుల వ్యవహారంలో విద్యార్హతపై గందరగోళం నెలకొనేది. పదోన్నతుల కల్పించే విషయంలో సర్వీస్/విద్యార్హతను ఏదీ ప్రామాణికగా తీసుకోవాలో అధికారులు తలలు పట్టుకునేవారు. ఇటీవల ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు గ్రేటర్ విశాఖ అనుసరిస్తున్న విధానాల ప్రకారం సబార్డినేట్ల పదోన్నతులు రోస్టర్ విధానంతోపాటు డిగ్రీ విద్యార్హత ప్రామాణికంగా తీసుకుని పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం వీఎంసీకి సూచన చేసింది.

010 అనుసరిస్తూ..

ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల పద్దు 010 పద్దు కోసం సుదీర్ఘకాలం పోరాటం చేసిన వీఎంసీ మినిస్టీరియల్ ఉద్యోగులు ఎట్టకేలకు 2019లో సాధించారు. సర్వీస్ రూల్స్ కూడా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో అనుసరిస్తున్న హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్, విశాఖ పట్నం మున్సిపల్ యాక్ట్‌ను అనుసరించి సర్వీస్ నిబంధనలు వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్లకు గ్రీన్‌సిగ్నల్

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- జీఓ నంబర్ 4 విడుదల చేసిన ప్రభుత్వం
- 24,330 కుటుంబాలకు మేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు ఏళ్ల తరబడి నుంచి ఎదురుచూస్తున్న ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్‌ను ఇచ్చిందని, పేద ప్రజల ఇళ్ల రిజిస్ట్రేషన్ల కోసం ఈ నెల 3వ తేదీన జీఓ ఎంఎస్ నంబర్ 4ను ప్రభుత్వం విడుదల చేసిందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెంట్రల్ నియోజకవర్గంలోని పాయకాపురం, రాధానగర్, ప్రకాష్‌నగర్, కుందావారి కండ్రిక, ప్రజాశక్తినగర్, శాంతినగర్, సుందరయ్యనగర్ పరిసర ప్రాంతాల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్ల సౌకర్యం లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలంతా ఏళ్ల తరబడి నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీటన్నింటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన దానికి సానుకూలంగా స్పందించి పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పిస్తూ జీఓను విడుదల చేశారని పేర్కొన్నారు. దీనిద్వారా మొత్తం 24,330 మంది కుటుంబాలకు మేలు కలగనుందని వెల్లడించారు. అలానే 22ఎ జీఓ ప్రకారం గుణదల, గాంధీనగర్ సబ్ రిజిస్ట్రేషన్ల పరిధిలో ఉన్న సుమారు 4500 నుంచి 5000 ప్లాట్లు నిషేధిత జాబితాలో ఉన్నాయని, వీటన్నింటిని పరిశీలించి వాటిని ఆ జాబితాలో నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేలా కలెక్టర్లకు కూడా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు వివరించారు. నగరంలో అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో ఏళ్ల తరబడి ఉంటున్న వారికి కూడా ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్లు కల్పించేందుకు పరిశీలిస్తున్నామని తెలిపారు. 150 గజాల లోపు ఉన్న వారికి, వాంబేకాలనీ, న్యూరాజరాజేశ్వరీపేట ప్రాంతాల్లోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పించనున్నామన్నారు. తదుపరి క్యాబినేట్‌లో ఈ అంశాలు ఆమోదం పొందే అవకాశం ఉందన్నారు. నగరంలో ఇళ్ల పట్టాలు లేని వారందరికి ఇంటి పట్టాలను కూడా జారీ చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

- **రూ.77 కోట్లతో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు...**

నగర శివారు ప్రాంతాల్లో మంచినీటి సమస్యను శాశ్వతంగా తొలగించి, ఆయా ప్రాంతాల్లో రూ.77 కోట్లతో తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఎమ్మెల్యే విష్ణు వివరించారు. దీనికి సంబంధించిన జీఓ కూడా త్వరలోనే విడుదల చేస్తారన్నారు. వాంబేకాలనీలో ప్లాంట్‌ను నెలకొల్పి అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు నీటి సరఫరా అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

ఓవరాల్ చాంపియన్‌షిప్ గుడ్లవల్లేరు



ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని దక్కించుకున్న గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కాలేజీ క్రీడాకారులు



చెస్‌లో ప్రథమ స్థానం సాధించి బహుమతి అందుకుంటున్న విజయవాడ కళాశాల క్రీడాకారిణి

విజయవాడ స్పోర్ట్స్: పాలిటెక్నిక్ అంతర్ కళాశాలల జిల్లా స్థాయి 25వ స్పోర్ట్స్, గేమ్స్ మీట్-2023లో ఏఏఎన్‌ఎం వీవీఎస్‌ఆర్ పాలిటెక్నిక్ కాలేజీ (గుడ్లవల్లేరు) విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజుల పాటు ఎనిమిది క్రీడాంశాల్లో జరిగిన పోటీల్లో కళాశాల బాలబాలికలు పతకాల వేటను కొనసాగించారు. మొత్తం 19 పతకాలతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. అథ్లెటిక్స్‌లో 14 పతకాలను సాధించడంతో పాటు చెస్ బాలుర విభాగంలో ప్రథమ స్థానం, వాలీబాల్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం, బాలుర విభాగంలో ద్వితీయ స్థానం, టేబుల్ టెన్నిస్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం, ఖోఖో బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. కబడ్డీ బాలుర విభాగంలో జీపీటీ కాలేజీ గన్నవరం విన్నర్‌గా, ఆర్‌కే కాలేజీ, కేతనకొండ రన్నర్‌గా నిలిచాయి. కళాశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రమేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.ఎం.ఎస్.మూర్తి పాల్గొని విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయసారథి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయాల్లో పద్మశాలీయులకు సముచిత స్థానం

కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్

ఉయ్యూరు: రాజకీయాల్లో పద్మశాలీయులకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మానికొండ భవన్‌లో పద్మశాలీయుల చైతన్య వేదిక ఆదివారం నిర్వహించారు. ఎంపీ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ పద్మశాలీయులు రాజకీయ చైతన్యంతో ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. పద్మశాలీ కులస్తుడైన తనను పార్లమెంటుకు పంపిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఐక్యంగా ఉంటేనే సమాజంలో గుర్తింపు ఉంటుందని చెప్పారు. మార్కండేయ జయంతి, భావనా రుషి కల్యాణం వంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభావంతులైన పద్మశాలీయ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి ప్రోత్సహించాలని కోరారు. పద్మశాలీ సేవా సంఘం నాయకులు మూర్తి, అందే జగదీష్, బోస్, ఈశ్వర్, శ్రీధర్, భాస్కర్ పాల్గొన్నారు.

మేలు జాతి పశువులను సంరక్షించుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డెప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మండలి చైర్మన్ మోషేన్‌రాజు, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు తదితరులు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ముగిసిన జాతీయస్థాయి పశువుల పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రపంచ స్థాయిలో ఒంగోలు జాతి ఎద్దులకు ఎంతో గుర్తింపు ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని భారతీయ విద్యాభవన్స్‌లో మూడు రోజులుగా జరిగిన జాతీయ స్థాయి ఆరో మేలు జాతి పశువుల అందాలు, పాల పోటీలు ముగింపు సభను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి కొట్టు మాట్లాడుతూ మేలు జాతి పశు సంపదను వృద్ధి చేసి భావితరాలకు అందించాలన్నారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ పశుపోషకులను ప్రోత్సహించాలని తెలిపారు. ఆచంట ఎమ్మెల్యే, దేశీయ గోజాతి సంవర్ధక అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పశుసంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ అమరేంద్ర మాట్లాడారు. శాస్త్రవేత్త రాజీవ్‌కుమార్ జోషి, కామధేను యూనివర్సిటీ డీన్ భరత్ రాథోడ్, దేశీయ గోజాతి సంవర్ధక అసోసియేషన్ సభ్యుడు కేవీవీ సత్యనారాయణరాజు (అబ్బాయిరాజు), కొప్పాక వెంకటనారాయణ, ఉప్పలపాటి చక్రపాణి, పశుసంవర్ధకశాఖ అధికారులు డీఎం నాయక్ తదితరులు పాల్గొన్నారు. ముర్రా గేదెల విభాగంలో.. దేవభక్తుని సుబ్బారావు (కానూరు, కృష్ణా జిల్లా), చిలకపాటి రాజీవ్ (వీరవల్లి), టి.దుర్గాభవన్ చౌదరి పశువులు విజేతలుగా నిలిచాయి.

రౌడీషీటర్ నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడ స్పోర్ట్స్: నగరంలో శాంతిభద్రతలకు, సామాన్య ప్రజల జీవనానికి విఘాతం కలిగిస్తున్న రౌడీ షీటర్ మాచర్ల బాలస్వామి అలియాస్ పండు నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాచవరం ప్రాంతానికి చెందిన పండు గతంలో అనేక నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించినా ఎలాంటి మార్పు రాలేదన్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది జూన్‌లో ఆరు నెలలపాటు నగర బహిష్కరణ చేశామన్నారు. ఇప్పటికీ పండులో మార్పు రాలేదని, నగరంలో అనేక అలజడులు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నాడనే నిఘా వర్గాల సమాచారంతో ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. నేర ప్రవృత్తి మార్చుకోకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తే నగరం నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుడివాడరూరల్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. గుడివాడ రైల్వే పోలీసు పరిధిలోని 49/42-44 పరిధిలోని మోటూరు రైల్వే ట్రాక్‌పై సుమారు 50 సంవత్సరాలు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పేర్కొన్నారు. నలుపు రంగు షర్టు, పచ్చ, ఎరుపు రంగు లుంగీ ధరించినట్లు పేర్కొన్నారు. అలానే చేతిపై లవ్ సింబల్, పావురం పచ్చబొట్టు ఉందన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు గుడివాడ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఫిబ్రవరి 12 నుంచి ఎడ్ల బండలాగుడు పోటీలు

రెంటచింతల: మన సంస్కృతి సంప్రదాయాలలో భాగంగానే ఎడ్ల పోటీలు అని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఫిబ్రవరి 12 నుంచి రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగు పోటీల పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న అతి పురాతనమైన శైవక్షేత్రం సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి సన్నిధిలోని అఖిల భారత భక్త కుంటి మల్లారెడ్డి రెడ్ల అన్నదాన సత్రంలో ఎడ్లపోటీలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు.

రైలు పట్టాలపై వృద్ధుడి మృతదేహం



రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహం

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూజివీడురోడ్డులోని రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వృద్ధుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. స్థానికులు వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించి ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరకున్న ఏలూరు రైల్వే ఎస్‌ఐ డి.నరసింహరావు మృతుడి వివరాల గురించి ఆరా తీశారు. ప్రమాదవశాత్తూ రైలు కింద పడి మృతి చెందాడా? లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. వృద్ధుడి వద్ద లభించిన ఆధారాలను బట్టి హనుమాన్‌జంక్షన్, నూజివీడు ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి జేబులో నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రికి చెందిన ఓపీ చీటి, హనుమాన్‌జంక్షన్-నూజివీడు ఆర్టీసీ బస్సు టికెట్ లభించాయి. ఆస్పత్రి చీటిపై పి.నాగేశ్వరరావు, వయస్సు 65 సంవత్సరాలుగా రాసి ఉండటం మృతుడు ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. తెలుపు రంగు గళ్ల చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, ఎడమ కాలు వైకల్యంతో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామవరప్పాడు: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం తెల్లవారుజామున విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమానూరు నుంచి ఎనికేపాడుకు నడుచుకుంటూ వస్తున్న సుమారు 43 సంవత్సరాల గల వ్యక్తిని జాతీయరహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పటమట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతి చెందిన వ్యక్తి వివరాలు సేకరిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పటమట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గుంటూరు జిల్లా తెనాలిలోని మారీసుపేటకు చెందిన మీసాల సాయిచరణ్‌తేజ్ (26) సెల్‌ఫోన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈయనకు సంవత్సరం క్రితం వివాహమైంది. శనివారం ఉదయం పని నిమిత్తం తన ముగ్గురు స్నేహితులతో కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై నగరానికి వచ్చారు. పని ముగించుకుని ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో తెనాలికి వెళ్లే క్రమంలో సాయిచరణ్‌తేజ్ ద్విచక్ర వాహనాన్ని నడుపుతుండగా స్నేహితుడు రోషన్ వెనుక వైపు కూర్చున్నాడు. సత్యంగారి హోటల్ సమీపానికి రాగానే రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం పైనుంచి ఇద్దరూ కింద పడిపోయారు. సాయిచరణ్‌తేజ్ అక్కడికక్కడే మృతి చెందగా రోషన్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



వెంకటరత్నం మృతదేహం

ఉయ్యూరు: వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలో పైపుల షాపు నిర్వహిస్తున్న పడమట వెంకటరత్నం (51) శనివారం రాత్రి బైక్ ఢీకొని జాతీయ రహదారిపై మృతి చెందాడు. ఇటుకలు కొనే నిమిత్తం బైక్‌పై ఉయ్యూరు నుంచి గండిగుంట వెళ్లిన వెంకటరత్నం బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి ఇటుకల బట్టీలోకి వెళ్లాడు. ఇటుకలు చూసి రోడ్డు దాటుతుండగా ఆకునూరు వైపు నుంచి వేగంగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటరత్నం తీవ్రగాయాలపాలు కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

చెరువులో పడి బాలుడి మృతి...



ఉదయ్‌కుమార్ మృతదేహం విలపిస్తున్న కుటుంబసభ్యులు

మండలంలోని కాటూరు గ్రామంలో పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న చెరువులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పులి ఉదయ్ కుమార్ (16) చెరువులో పడవ ఎక్కి లోనికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ పడవ బోల్తా పడి ఉదయ్‌కుమార్ నీట మునిగి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

క్లుప్తంగా

ముస్లిం మైనార్టీల హక్కుల సాధనకు కృషి



సల్మాకు నియామకపత్రాన్ని అందిస్తున్న నాగుల్‌మీరా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం ఆజాద్ ముస్లిం కమిటీ నిరంతరం పాటుపడుతుందని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగులీమీరా అన్నారు. సింగ్‌నగర్‌లోని ఏఎంసీ కార్యాలయంలో కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఎంసీ సభ్యులందరూ తమ పరిధిలో ఉన్న ముస్లిం మైనార్టీలంతా ఈ పథకాలు వినియోగించుకునేలా చూడాలన్నారు. మైనార్టీల హక్కుల సాధన కోసం ఏఎంసీ నిరంతరం శ్రమిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ముస్లిం మైనార్టీలకు సముచితస్థానం లభిస్తుందన్నారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన షేక్ సల్మాను ఆజాద్ ముస్లీం కమిటీ సెంట్రల్ నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ తీర్మానించారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. ఏఎంసీ నాయకులు సయ్యద్ మౌలాలి, షేక్ సాజిద్ అలీ, హుస్సేన్, హబీ, మస్తాన్, ఇర్ఫాన్‌పాషా, బిలాల్ పాల్గొన్నారు.

గోదాదేవి, శ్రీ కృష్ణుని వేషధారణ పోటీలు

విజయవాడ కల్చరల్: ధనుర్మాసం సందర్భంగా శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా గోదాదేవి శ్రీ కృష్ణుని వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 సెకన్ల నిడివిగల వీడియోలను 94402 63055కు ఈ నెల 16వ తేదీ లోపల పంపాలని కోరారు. విజేతల వివరాలను తరువాత ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడు



ప్రసంగిస్తున్న గరికపాటి గురజాడ

విజయవాడ కల్చరల్: భారతీయుల ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడని యువ ఆధ్యాత్మికవేత్త గరికపాటి గురజాడ పేర్కొన్నారు. శృంగేరీ శారదాపీఠం ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించే సాహిత్యంలో సూర్యభగవానుడు ఆధ్యాత్మిక ప్రసంగాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గరికపాటి గురజాడ మాట్లాడుతూ రామయణం, భారతం, అష్టాదశ పురాణాల్లో సూర్యుని ప్రస్తావన కనిపిస్తుందన్నారు. ప్రాచీన కవులు తమ కావ్యాలలో సూర్యోదయం. సూర్యాస్తమయం వర్ణన కనిపిస్తుందన్నారు. సూర్యధ్యానం వల్లనే పాండవులకు అక్షయ పాత్ర లభించిందని పేర్కొన్నారు. ఆదిత్య హృదయం పఠించడం వల్లనే రామాయణంలో శ్రీ రామచంద్రునికి విజయం లభించిందన్నారు. కవుల కవితా వస్తువు సూర్యభగవానుడుగా భావించవచ్చన్నారు. సూర్యుని ద్వారా ప్రసారమయ్యే కిరణాల ద్వారా కొన్ని రకాలైన దీర్ఘవ్యాధులు నయం అవుతాయని సైన్స్ చెబుతోందన్నారు. భారత దేశంలో అనేక సూర్యదేవాలయాలు న్నాయన్నారు. సూర్యమానం అనుసరించి సంక్రాంతి పండగను తెలుగు వారు జరుపుకుంటారని తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ గరికపాటి గురజాడ విశేషాలను వివరించారు. గరిపాటి నరసింహారావు వారసుడిగా అనేక ఆధ్యాత్మిక ప్రసంగాలను చేసి, యువతను ధర్మమార్గం వైపు నడిపిస్తునట్లు తెలిపారు.

విద్యతో భావజాల ప్రచారం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రస్తుత సమాజంలో విద్యారంగం వెనక్కు నడుస్తోందని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత, ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ప్రజా వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం 'గ్రంథాలయాలు - విద్య - ప్రజాసంస్కృతి' అంశాలపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ, పత్రికారంగం వ్యవస్థల్లో పనిచేసేవారు ఉత్పత్తి చేసేది విద్య అని చెప్పారు. విద్య భావాజాలాన్ని ప్రచారం చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ ఆర్థిక, రాజకీయ, సమానత్వ న్యాయం జరగాలని బీఆర్ అంబేద్కర్ కోరుకున్నారని గుర్తుచేశారు. రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి మాట్లాడుతూ ప్రజాసంస్కృతి ఎదుర్కొంటున్న పెద్ద సమస్య మతతత్వం, కార్పొరేటుతత్వమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ రామచంద్రయ్య మాట్లాడుతూ సైన్స్ పరిశోధనలకు కేటాయించే బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రముఖ విద్యావేత్త రమేష్ పట్నాయక్, ప్రొఫెసర్ అంజయ్య, ఎం.వి.ఎస్.శర్మ మాట్లాడారు. ఎంబీ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ, రావి శారద, బుడ్డిగ జమీందార్ పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆసరా వైఎస్సార్ పెన్షన్ కానుక

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): వైఎస్సార్ పెన్షన్ కానుక ఎంతోమంది అభాగ్యులకు ఆసరాగా నిలుస్తూ లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంకలోని శ్రీపొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ ఆవరణలో ఆదివారం కృష్ణలంక 20, 21, 22 డివిజన్లలో అర్హత కలిగిన లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ కుల, మత, పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్లను పెంచుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.2వేలు పెన్షన్‌ను వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న చెప్పినట్లు పెన్షన్‌ను ప్రతి సంవత్సరం రూ.250 పెంచుతూ ప్రస్తుతం రూ.2750 అందజేస్తున్నామన్నారు. 20వ డివిజన్‌లో 56మందికి, 21వ డివిజన్‌లో 35మందికి, 22వ డివిజన్‌లో 47 మందికి నూతనంగా పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్, 20వ డివిజన్ కార్పొరేటర్ అడపా శేషు మాట్లాడుతూ వైఎస్సార్ పెన్షన్ కానుక పేదలకు వరం లాంటిదన్నారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా సీఎం జగన్ ప్రతి ఏటా పింఛన్‌ను పెంచుకుంటూ వెళ్తున్నారన్నారు. అంతేకాకుండా పింఛన్ పొందేందుకు అర్హతను 65 ఏళ్ల నుంచి 60ఏళ్లకు కుదించారని తెలిపారు. కార్యక్రమంలో 21, 22 డివిజన్ల కార్పొరేటర్లు పుప్పాల కుమారి, తాటిపర్తి కొండారెడ్డి, కృష్ణలంక శివాలయం చైర్మన్ మూలంరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు విజయలక్ష్మీ, గోగు గౌరి, జోగారాజు, పల్లెం రవి పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు





పటమట జెడ్పీ పాఠశాల్లో జరిగిన ముగ్గుల పోటీలు

పటమట(విజయవాడతూర్పు): సిటీ కేబుల్ వ్యవస్థాపకులు పొట్లూరి రామకృష్ణ జయంతి ఉత్సవాల్లో భాగంగా సిటీ కేబుల్, లియో, శ్రీ చక్ర, జీ తెలుగు, జీ సినిమా సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పటమటలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పటమటలోని కేబీసీ జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిటీకేబుల్ ఎండీ పొట్లూరి సాయిబాబు మాట్లాడుతూ సిటీ కేబుల్ వ్యవస్థాపకులు స్వర్గీయ పొట్లూరి రామకృష్ణ 59వ జయంతి ఉత్సవాల్లో భాగంగా సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించామన్నారు. సంక్రాంతి సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జనవరి 28వ తేదీన పొట్లూరి రామకృష్ణ జయంతి కార్యక్రమాల్లో అందజేస్తామన్నారు. సాయి ప్రాపర్టీస్ అండ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ అధినేత సీహెచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సిటీకేబుల్ వారితో కలిసి రెండో సంవత్సరం ఈ ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ సంస్థ తరఫున ముగ్గురు విజేతలకు, 10 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు. ఈ పోటీల్లో మచిలీపట్టణానికి చెందిన భవాని మొదటి బహుమతిని, నందిగామకు చెందిన జి దీపికా ద్వితీయ బహుమతిని, గుంటూరుకు చెందిన మణి మంజరి తృతీయ బహుమతిని సాధించారు. కార్యక్రమంలో నక్షత్ర ఎక్స్‌క్లూసివ్ నైట్ వేర్, రెడీ మేడ్ డ్రెస్సెస్ అధినేత బాజీ పాల్గొన్నారు.

దంత సమస్యలను అశ్రద్ధ చేయొద్దు



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): దంత సమస్యలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి చికిత్స తీసుకోవడంతో ఆరోగ్యకరమైన దంతాలను పొందవచ్చని దంత వైద్యనిపుణురాలు బి.ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక బోయపాటి మాధవరావు రోడ్డులోని ఆదివారం ప్రశాంతి డెంటల్ క్లీనిక్ ప్రారంభోత్సవం జరిగింది. అనంతరం దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రోజూ ఉదయం, రాత్రి పళ్లను శుభ్రం చేసుకోవడం ద్వారా దంత సమస్యలను చాలా వరకు తగ్గించుకోవచ్చన్నారు. చిగుళ్ల నుంచి రక్తం కారడం, చిగుళ్ల వాపు వంటి వాటిని గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర హెల్త్ ఎడ్యుకేషన్, మీడియా అధికారులు సంఘం 2023 క్యాలెండర్‌ను ఆదివారం ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆవిష్కరించారు. జిల్లా డెమో విభాగం ఉప జిల్లా విస్తరణ మీడియా అధికారి కొవ్వూరి ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో వివిధ విభాగాల్లో మీడియా ప్రోగ్రామ్స్, సమాచార, విద్య, భావ ప్రసారం వంటి వాటిని అమలు ద్వారా ఆరోగ్య కార్యక్రమాలు విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తారన్నారు. లక్ష్యాల సాధనకు, ఆరోగ్య కార్యక్రమాలు అమలు పరిచే మాస్ మీడియా అధికారుల పాత్ర ఎనలేనిదని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె.నరసింహనాయక్, డీపీఎంఓ డాక్టర్ నవీన్, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవి, స్టాటికల్ అధికారి ఎస్.లక్ష్మోజీ, వి.శ్రీనివాసరావు, ప్రసూనాంబ పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): చిన్నారుల చేత గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో పటమట పోలీసులు రెండు రోజుల నుంచి తనిఖీలు చేస్తున్నారు. పటమట డొంక రోడ్డుతో పాటు తోటవారి వీధిలో పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. అంతేకాకుండా అనుమానం వచ్చిన వారిని విచారిస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో గ్యాంగ్‌వార్ జరిగింది. ఇందులో ఉన్న పలువురు గంజాయి అమ్ముతున్నట్టు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. పోలీసులు ఈ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. అంతే కాకుండా గతంలో గంజాయితో పట్టుబడిన వారి నుంచి కూడా పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. మూడు రోజుల క్రితం యనమలకుదురులో ఇద్దరు యువకులను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్టు తెలిసింది.

చదువుతోనే వ్యక్తిత్వ వికాసం

పటమట(విజయవాడ తూర్పు): విద్యార్థి వ్యక్తిత్వం స్కూల్లోనే రూపుదిద్దుకుంటుందని నగర ప్రముఖులు కె.ఎస్.చలపతిరావు అన్నారు. పటమట గురునానక్‌కాలనీలోని డాన్‌బాస్కో స్కూల్ 40వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చలపతిరావు మాట్లాడుతూ చదువు మనిషి జీవితాన్నే మార్చేస్తుందన్నారు. చదువును ఎవరూ దొంగిలించలేరన్నారు. ఉపాధ్యాయులను గౌరవిస్తూ చదువులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. డాన్‌బాస్కో స్కూల్‌ను నేషనల్ ఇన్నోవేషన్ హబ్‌గా నీతిఆయోగ్ గుర్తించడం అభినందనీయమన్నారు. పాఠశాల సాధించిన అనేక అవార్డుల వెనుక ఉపాధ్యాయుల కృషి ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు డాక్టర్ కృష్ణచంద్, డాక్టర్ రాకేష్, డాక్టర్ రామబ్రహ్మం, డాక్టర్ రామశేషయ్య పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

పింఛన్ వారోత్సవాల్లో దేవినేని అవినాష్



పింఛన్‌ను అందజేస్తున్న దేవినేని అవినాష్, కార్పొరేటర్లు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ స్కూల్ మైదానంలో 7, 8, 19 డివిజన్లల్లో నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎవరి సిఫార్సు అవసరం లేకుండా వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వార్డు వలంటీరే ఇంటికి వచ్చి పింఛను ఇస్తారని చెప్పారు. తూర్పు నియోజకవరంలో సుమారు వెయ్యి కోట్ల రూపాయల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సంక్షేమం, అభివృద్ధితో పాటుగా అవినీతిరహిత పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు ఆశీస్సులు అందించి వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఏడో డివిజన్‌లో 58, 8వ డివిజన్‌లో 15, 19వ డివిజన్‌లో 15 నూతనంగా ఫించన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్పొరేటర్లు ఎం.మాధురి, రహేనా నాహీద్, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీమ్, వైఎస్సార్ సీపీ ఏడో డివిజన్ అధ్యక్షుడు వడ్లమూడి సంపత్, 8వ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిల జయప్రకాష్, డివిజన్ నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

దేవునికి విధేయులుగా జీవించాలి



భక్తులతో నిండిన మేరీమాత పుణ్యక్షేత్రం

గుణదల(విజయవాడ తూర్పు): దేవునికి విధేయులుగా జీవిస్తే సకల ఆశీర్వాదాలు లభిస్తాయని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ అన్నారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం ఉదయం సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ దేవుని యెడల విశ్వాసంతో ఉన్న భక్తుల జీవితాలు దీవెనకరంగా ఉంటాయన్నారు. తన ప్రజలను రక్షించుకునేందుకు దేవుడు ఎల్లవుడు తోడుగా ఉంటాడని తెలిపారు. సర్వ మానవాళి రక్షణ ప్రణాళికలో భాగంగా క్రీస్తు ఈ లోకానికి మానవ రూపిగా అరుదెంచారని పేర్కొన్నారు. శిలువ పై బలి యాగమై రక్తాన్ని చిందించి మనలను రక్షణ మార్గంలో నడిపించారని చెప్పారు. యేసు క్రీస్తు శిలువ మరణ త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. బైబిల్ గ్రంథం ద్వారా ఆయన మనకు నేర్పించిన జీవన సూత్రాలను ఆచరించాలని సూచించారు. తోటి వారితో ప్రేమగా మెలగటం, సహోదర భావంతో నడుచుకోవాలని తెలిపారు. దేవుని కట్టడలను మన జీవితాలలోకి అన్వయించుకోవడం ద్వారా ప్రపంచ శాంతి సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఆదివారం సెలవు దినం కావడంతో యాత్రికులు అధిక సంఖ్యలో గుణదల పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. దీంతో భక్తులతో గుణదల కొండ కిక్కిరిసి పోయింది.

అ'పూర్వ' సమ్మేళనం



ప్రతిభానికేతన్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వారంతా 1990 సంవత్సరంలో మాచవరంలోని ప్రతిభానికేతన్ స్కూల్లో పదో తరగతి సెక్షన్-ఏలో కలిసి చదువుకున్నారు. 32 సంవత్సరాల తర్వాత ఆదివారం విజయవాడ నగరంలోని పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్డులోని హోటల్లో సమావేశమయ్యారు. ఇక వారి సంతోషానికి హద్దులు లేవు. ఆత్మీయంగా ఒకరినొకరు పలకరింపులు, ఆలింగనాలు, పరిచయాలు చేసుకున్నారు. విద్యార్థి దశలో చేసిన చిలిపి చేష్టలు, తరగతిలో చేసిన అల్లరిని ఒకసారి గుర్తు చేసుకున్నారు. ఒకరి సెల్‌ఫోన్ నంబర్లు ఒకరు పంచుకున్నారు. ఈ మధుర క్షణాలను సెల్‌ఫోన్ కెమెరాలో బంధించుకుని రోజంతా బాల్య స్నేహితులతో సరదాగా గడిపారు. వచ్చే ఏడాది మళ్లీ కలుద్దాం.. ఫ్రెండ్స్ అంటూ ఇంటి బాటపడ్డారు పూర్వ విద్యార్థులు. అమెరికా, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల నుంచి ఆత్మీయ కలయికకు వచ్చిన వీరు ముందుగా స్కూల్ కరస్పాండెంట్ ఏబీకే ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పించారు.

మల్లేశ్వర స్వామి ఆలయ ద్వారబంధానికి పూజలు



ద్వారబంధానికి పూజలు చేస్తున్న ఆలయ ఈఓ భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయానికి ద్వారబంధం ఏర్పాటుకు ఆదివారం ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులలో భాగంగా ఆలయానికి ద్వారాల ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఆదివారం ఆలయ ఈఓ భ్రమరాంబ గ్రానైట్‌తో రూపొందించిన ద్వారబంధానికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి, ఈఈ కేవీఎస్ కోటేశ్వరరావు, ఏఈఓ ఎస్.రమేష్ బాబు, బీ వెంకటరెడ్డి, ఇతర ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణను అలవర్చుకోవాలి



తారక్ రామ్ కాంతారా నృత్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవరచుకోవాలని, అప్పుడే జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని ఆదాయపు పన్ను శాఖ విజయవాడ కమిషనర్ ఎం.అనిల్ కుమార్ చెప్పారు. వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ 44వ వార్షికోత్సవం స్కూల్ ఆవరణలో శనివారం జరిగింది. అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తిని అలవరచుకోవాలన్నారు. చక్కగా చదువుకుని రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలన్నారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు చదలవాడ నాగేశ్వరరావు, కార్యదర్శి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. అకాడమీ కోశాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, స్కూల్ కన్వీనర్ విష్ణు, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.సీతారామయ్య, స్కూల్ ప్రైమరీ విభాగం హెచ్‌ఎం సీహెచ్.జయలక్ష్మి పాల్గొన్నారు.

అకట్టుకున్న 'కాంతారా' నృత్యం

స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా సభ అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యూకేజీ విద్యార్థి ఎస్.తారక్ రామ్ చేసిన కాంతారా చిత్రంలోని నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ముగిసిన కోవే-సిడ్బీ స్వావలంబన్ మేళా




స్టాల్స్ ఏర్పాటు చేసిన వారికి సర్టిఫికెట్స్ అందిస్తున్న సిడ్బీ మేనేజర్ శ్రీరామచంద్రమూర్తి

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సిడ్బీ మేనేజర్ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. బెంజిసర్కిల్‌లోని వేదిక కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సిడ్బీ-కోవే స్వావలంబన్ మేళా ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీరామచంద్రమూర్తి మేళాలో స్టాల్స్ ఏర్పాటు చేసిన మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల ఉత్పత్తులు మార్కెటింగ్ చేసుకునేందుకు సిడ్బీ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. కోవే(కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో మొదటిసారిగా ఏర్పాటు చేసిన స్వావలంబన్ మేళాకు మంచి స్పందన లభించిందన్నారు. కోవే రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక మాట్లాడుతూ కోవే-సిడ్బీ సంయుక్తంగా రానున్న రోజుల్లో మరింత పెద్ద స్థాయిలో ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా మహిళలు వారి ఆర్థిక అవసరాలను తీర్చుకునేవిధంగా చిన్న వ్యాపార సంస్థల ద్వారా వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశం కల్పించడమే కోవే ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ ప్రదర్శనలో 60 స్టాల్స్ ఏర్పాటు చేశామని, ప్రతిస్టాల్ నిర్వాహకులకు సర్టిఫికెట్స్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోవే జాతీయ జాయింట్ సెక్రటరీ అపర్ణ, ఏపీ శాఖ కార్యదర్శి విజయలక్ష్మి, మోహిని, శ్రావణి, సత్యవతి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సెల్‌ఫోన్ దొంగలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్ దొంగలు ఇద్దరిని పటమట పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడెక్కడ వాహనాలు, సెల్ ఫోన్‌లను దొంగిలించారో వీరి వద్ద నుంచి వివరాలు సేకరిస్తున్నారు.











ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల, బిషప్ అజరయ్య జూనియర్ కళాశాల, మేరీ స్టెల్లా కళాశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల, పీవీ సిద్ధార్థ తదితర కళాశాలల్లో పరీక్షకు అభ్యర్థులు హాజరయ్యారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ


ఏలూరు జిల్లా బువ్వనపల్లిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


ప్రకాశం జిల్లా కూటాగుండ్లలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

గడప గడపకు మన ప్రభుత్వం


కృష్ణా జిల్లా ఇందుపల్లిలో మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్


తిరుపతి 8వ డివిజన్ పరిధిలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తెలంగాణ

ముగ్గురు సజీవ దహనం

జిన్నారం(పటాన్‌చెరు): మైలాన్ రసాయన పరిశ్రమ యూనిట్–1లో రసాయనాలను వేరు చేస్తున్న క్రమంలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటన సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఆదివారం జరిగింది. కార్మికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రసాయనాలను వేరు చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఒత్తిడి ఎక్కువై మెరుపులు వచ్చాయి. యాసిడ్ మాదిరి కాలే గుణం ఉన్న రసాయనాలు ఒక్కసారిగా బయటకు ఎగజిమ్మాయి. అవి వంటి మీద పడటంతో చర్మం కాలి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళానికి చెందిన వేర్‌హౌస్ అసిస్టెంట్ మేనేజర్ లోకేశ్వర్‌రావు (38), కార్మికులు వెస్ట్ బెంగాల్‌కు చెందిన పరితోష్ మెహతా (40), బిహార్‌కు చెందిన రంజిత్‌కుమార్ (27) అక్కడికక్కడే కాలిపోయారు. మంటలు కూడా చెలరేగినప్పటికీ సిబ్బంది వెంటనే స్పందించి ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

'పబ్లిక్ వైఫై' వాడుతున్నారా? అయితే జర జాగ్రత్త..!

సాక్షి, హైదరాబాద్: ఇప్పుడంతా ఇంటర్నెట్ జమానా...నెట్‌తో కనెక్ట్ కాకుండా క్షణం ఉండలేని పరిస్థితి. ఆన్‌లైన్ షాపింగ్ మొదలు..ఆఫీస్‌కు ఇన్ఫర్మేషన్ పంపే వరకు ఎప్పుడైనా ఎక్కడైనా..ఇంటర్నెట్ సదుపాయం తప్పనిసరి. కొన్నిసార్లు ప్రయాణంలో ఉన్నప్పుడు, బయట అనుకోని పరిస్థితుల్లో మన ఫోన్‌లో నెట్ బ్యాలెన్స్ లేనప్పుడు ఫ్రీ వైఫైల వైపు చూడడం పరిపాటి. అయితే ఇకపై పబ్లిక్ వైఫైలు వాడుతున్నట్లయితే జాగ్రత్తగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ నిపుణులు సూచిస్తున్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో అందుబాటులో ఉండే వైఫై వినియోగించి మనం ఈ మెయిల్, ఇతర సోషల్ మీడియా ఖాతాలు ఓపెన్ చేయడం, ఆన్‌లైన్ బ్యాంక్ లావాదేవీలు చేస్తే మనం నమోదు చేసే యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను సైబర్ నేరగాళ్లు మాల్‌వేర్ ద్వారా హ్యాక్ చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఆశాజనకంగా పొగాకు సాగు

ఈ ఏడాది 142 మిలియన్ కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి

- రికార్డు స్థాయిలో 150 మిలియన్ కిలోలు దాటుతుందని అంచనా
- కర్ణాటకలో తగ్గిన దిగుబడి.. ఏపీలో పెరుగుతున్న సాగు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో ఈ ఏడాది పొగాకు సాగు ఆశాజనకంగా ఉంది. గత ఏడాది కన్నా ఈ సంవత్సరం సాగు విస్తీర్ణంతోపాటు ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగే అవకాశం ఉందని పొగాకు బోర్డు అంచనా వేసింది. ఈ ఏడాది పొగాకు బోర్డు రాష్ట్రంలో 142 మిలియన్ కిలోల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్ణయించింది. ప్రస్తుత పరిస్థితులను చూస్తే 150 మిలియన్ కిలోలు దాటుతుందని భావిస్తోంది.

గత ఏడాది కన్నా ఎక్కువ ఉత్పత్తికి అనుమతి

మన దేశం నుంచి ప్రపంచంలోని 50 దేశాలకు పొగాకు ఎగుమతి అవుతోంది. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో పొగాకును ఎక్కువగా పండిస్తున్నారు. గత ఏడాది 130 మిలియన్ కిలోల ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతివ్వగా, 43వేల మంది రైతులు 66వేల హెక్టార్లలో 121 మిలియన్ కిలోలను పండించారు. ఈ ఏడాది పొగాకు బోర్డు 142 మిలియన్ కిలోల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్ణయించింది. డిసెంబర్‌లో మాండూస్ తుపాను వచ్చే నాటికి 53,500 హెక్టార్లలో పంట సాగు చేశారు. తుపాను కారణంగా 26,197 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లింది.



అందులో తొమ్మిది వేల హెక్టార్ల వరకు మళ్లీ పంట వేయాల్సి వచ్చింది. ఇంకా పలుచోట్ల పొగాకు నాట్లు కొనసాగుతున్నాయి. అందువల్ల గత ఏడాది కన్నా సాగు విస్తీర్ణం, ఉత్పత్తి పెరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు సాగు ఖర్చుల కోసం పొగాకు ఉత్పత్తిదారుల సంక్షేమ నిధి నుంచి రైతులకు రూ.10వేలు చొప్పున ఇస్తున్నారు. ఈ ఏడాది అదనంగా రూ.50 వేలు రుణం ఇవ్వాలని బ్యాంకర్లకు పొగాకు బోర్డు లేఖ రాసింది.

కర్ణాటకలో తగ్గిన దిగుబడి.. ఏపీలో డిమాండ్ పెరిగే అవకాశం

మన రాష్ట్రం కన్నా ముందుగా కర్ణాటకలో పంట దిగుబడి వస్తుంది. ప్రస్తుతం అక్కడ పొగాకు వేలం జరుగుతోంది. కర్ణాటకలో అధిక వర్షాల కారణంగా పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. ఆ రాష్ట్రంలో వంద మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, 66 మిలియన్ కిలోల వరకే వచ్చిందని అంచనా. ఇప్పటి వరకు 27 మిలియన్ కిలోల పంట మాత్రమే రైతులు విక్రయించారు. సంక్రాంతి తర్వాత పొగాకు అమ్మకాలు పుంజుకుంటాయని బోర్డు అంచనా వేస్తోంది. ఈ ఏడాది ధర కూడా గణనీయంగా వచ్చింది. అత్యధికంగా కిలోకు రూ.271లు ధర పలకగా, సగటున కిలోకు రూ.239.16లు వచ్చింది. కర్ణాటకలో దిగుబడి తగ్గడం, ధర బాగుండటంతో మన రాష్ట్రంలోని పంటకు డిమాండ్ వస్తుందని రైతులు పొగాకు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అందువల్లే ఇప్పటికీ పలు ప్రాంతాల్లో నాట్లు వేస్తూనే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫిబ్రవరి నెలాఖరులో గానీ మార్చి మొదటి వారంలో గానీ పొగాకు వేలం ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ఆశాజనకంగా ఉంది

రాష్ట్రంలో పొగాకు సాగు ఆశాజనకంగా ఉంది. పొగాకుకు గత ఏడాది మంచి ధర ఉండటంతో ఈ సంవత్సరం ఎక్కువ మంది సాగు చేస్తున్నారు. పొగాకు రైతులకు అన్ని విధాలుగా బోర్డు అండగా నిలుస్తోంది. గతంలో పొగాకు రైతులకు సగటున పది రోజుల్లో వారి ఖాతాల్లో నగదు జమయ్యేది. ఇప్పుడు ఎనిమిది రోజుల్లోనే వారి ఖాతాల్లోకి డబ్బులు పడేలా ఏర్పాట్లుచేశాం.

–అద్దంకి శ్రీధర్‌బాబు, టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

రాష్ట్రం గజగజ!

మొదటిసారిగా అరకు ఏజెన్సీలో అత్యల్పంగా 1.5 డిగ్రీల నమోదు

- చలిపులి పంజాతో వణుకుతున్న జనం
- కోల్డ్ వేవ్‌తో పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- మరో 3 రోజులు ఇంతే

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/సాక్షి, పాడేరు(అల్లూరి సీతారామరాజు జిల్లా) : చలి పులి పంజాకు రాష్ట్రం గజగజా వణికిపోతోంది. కోల్డ్ వేవ్ ప్రభావం రాష్ట్రాన్ని తాకడంతో మునుపెన్నడూ లేని విధంగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలి గాలుల తీవ్రత పెరిగింది. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి పడిపోయాయి. అక్కడ సాధారణం కంటె 3 నుంచి 5 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి, హుకుంపేట, జి.మాడుగుల మండలం కుంతలం, గూడెం కొత్తవీధి మండలం జీకే వీధిలో ఆదివారం తెల్లవారుజామున అత్యల్పంగా 1.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. డుంబ్రిగూడ మండలకేంద్రం, పెదబయలు మండలం గంపరాయిలో 2.6, హుకుంపేట మండలం కొక్కిసలో 2.7, ముంచంగిపుట్టు మండలం గొర్రెలమెట్టలో 2.8, పెదబయలులో 2.9, పాడేరులో 3.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతంలో ఇక్కడ అత్యల్పంగా 3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. తొలిసారిగా ఇప్పుడు 1.5 డిగ్రీలకు పడిపోవడంతో ప్రజలు, పర్యాటకులు ఆశ్చర్యపోతున్నారు. బయటకు రావడానికే బెంబేలెత్తిపోతున్నారు. అరకు తదితర ప్రాంతాల్లోనూ పలుచోట్ల కనిష్ట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. విజయవాడలో ఆదివారం ఉదయం 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.


అరకు వద్ద కారుమీద పేరుకున్న మంచు

రాష్ట్రాన్నీ కోల్డ్‌వేవ్ తాకినట్టే..

ఇప్పటికే భారత వాతావరణ శాఖ ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో కోల్డ్ వేవ్ ప్రభావం ఉంటుందని ప్రకటించింది. కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటె 5 నుంచి 6 డిగ్రీలు పడిపోతే కోల్డ్ వేవ్‌గా పరిగణిస్తారు. అరకు ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో 3 నుంచి 5 డిగ్రీలు పడిపోయాయి. దీంతో కోల్డ్ వేవ్ మన రాష్ట్రాన్ని తాకినట్లే వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. బంగ్లాదేశ్‌లో ఉన్న అప్పర్ ఎయిర్ సర్క్యులేషన్(వాతావరణంలోని ఎత్తయిన ప్రదేశాల్లో వీచే గాలులు), పశ్చిమ గాలుల ప్రభావంతో కోల్డ్‌వేవ్ కొనసాగుతోంది. మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ చెబుతోంది. మరీ ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొంది.

ఆక్వా ఎగుమతుల్లో భారత్‌ది రెండో స్థానం

- మత్స్యశాఖ మంత్రి అప్పలరాజు
- కాకినాడలో ఆకట్టుకున్న ప్రాన్స్ ఫుడ్ ఫెస్టివల్
- రొయ్యలతో చేసిన 26 రకాల వంటకాలు ప్రదర్శన

బోట్ క్లబ్ (కాకినాడ సిటీ): ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో ఉందని మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. అగ్రస్థానానికి చేరడానికి దేశవ్యాప్తంగా కృషి జరగాల్సి ఉందని పేర్కొన్నారు. ఆక్వా రంగం అభివృద్ధి చెందితే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. కాకినాడలో ఏర్పాటు చేసిన ప్రాన్స్ ఫుడ్ ఫెస్టివల్‌ను మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్న దేశాలు సైతం రొయ్యల ఉత్పత్తుల్ని పెంచడంతో మన రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో రొయ్యలు, చేపలు పెంపకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. ఫిష్ ఆంధ్ర పేరుతో చేపలు విక్రయించే కార్యక్రమం చేపడితే చాలామంది హేళన చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ఆలోచించి, ఇతర దేశాలకు ఎగుమతులు నిలిచిపోతే రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో మన రాష్ట్రంలోనే అమ్మకాలు పెంచుకునేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.



దేశంలో రొయ్యల వినియోగం తక్కువ

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ.. 30 కోట్ల జనాభా ఉన్న అమెరికా ఏటా 8 లక్షల టన్నుల రొయ్యలు వినియోగిస్తోందని.. మన దేశంలో మాత్రం అది ఎంతో తక్కువగా ఉందన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రాంతీయ మార్కెట్లు లేకపోవడంతో ఆక్వా రంగం ఇబ్బందులు పడుతోందన్నారు. దేశీయ వినియోగం పెరిగితే ఆక్వా రంగం మరింత బలోపేతమవుతుందని చెప్పారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఆక్వా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

26 వంటకాలతో విందు

ఈ ఫెస్టివల్‌లో రొయ్యలతో తయారు చేసిన 26 రకాల వంటకాలను భోజన ప్రియులకు వడ్డించారు. రొయ్యల ఉపయోగాలను తెలియజేస్తూ రూపొందించిన పుస్తకాన్ని మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, పెండెం దొరబాబు, మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు, అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి ద్వారంపూడి వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

దమ్ముంటే సీఎం అభ్యర్థి ఎవరో తేల్చాలి

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు విప్ ఉదయభాను సవాల్

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లో 2024 ఎన్నికల్లో సీఎం అభ్యర్థి ఎవరో దమ్ముంటే ప్రకటించాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సవాల్ విసిరారు. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. కందుకూరు, గుంటూరు ఘటనల్లో అమాయకులు 11 మంది ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలను పరామర్శించని పవన్‌కల్యాణ్ జీఓ నంబర్–1 సాకుతో పొత్తులు, ప్యాకేజీ కోసం చంద్రబాబు ఇంటికి వెళ్లి మాట్లాడుకోవటం నీచమన్నారు. జీఓ నంబర్–1 వల్ల ప్రజల ప్రాణాలకు రక్షణ కలుగుతుందన్నారు. దీని వల్ల ఎవరికీ ఎటువంటి ఇబ్బందీ ఉండదని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు అంటే లెక్కలేని చంద్రబాబును పవన్ కలవటం ఏమిటని ప్రశ్నించారు. జనసేన కార్యకర్తలకు ఏమి సమాధానం చెబుతారని నిలదీశారు. రాష్ట్ర ప్రయోజనాలకంటే స్వలాభం కోసమే చంద్రబాబు, పవన్ పాకులాడుతున్నారని విమర్శించారు. వారికి ప్రత్యేక అజెండా అనేది ఏమీ లేదని పేర్కొన్నారు. చంద్రబాబును పవన్ పరామర్శించటాన్ని చూసి జనాలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.


మాట్లాడుతున్న విప్ ఉదయభాను

ఇప్పుడెవరిని చెప్పుతో కొట్టాలి పవన్?


విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చంద్రబాబుకు దత్త పుత్రుడంటే చెప్పుతో కొట్టాలని ఓ మీటింగ్‌లో ఆగ్రహించిన జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, పక్క రాష్ట్రంలో ఉన్న చంద్రబాబును ఏ మొహం పెట్టుకొని కలిశారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రశ్నించారు. ఇప్పుడు ఎవరిని చెప్పుతో కొట్టాలని నిలదీశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణు ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడేమీ కొత్తగా కలవడం లేదన్నారు. అందరూ అనుకున్నట్లుగానే పవన్ చంద్రబాబుకు దత్తపుత్రుడని, ప్యాకేజీ స్టారేనని ఈ కలయికతో మరోసారి రుజువైందన్నారు. చంద్రబాబు పర్యటనతో అంతమంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలను పట్టించుకోకుండా చంద్రబాబును ఆయన ఇంటికి వెళ్లి పవన్ కల్యాణ్ పరామర్శించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ–1ను చంద్రబాబు, పవన్ ఇద్దరూ పూర్తిగా చదువుకోవాలని హితవుపలికారు. ఆ జీఓపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. వ్యక్తిత్వం లేని వ్యక్తి పవన్‌కల్యాణ్ అని, చంద్రబాబు ఎలా చెబితే అలా నడుచుకోవడం తప్ప ప్రత్యేక స్టాండ్ అంటూ ఏమీ లేదని ఎద్దేవాచేశారు. గతంలో బీజేపీతో కలిసి నడిచి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా మార్చారని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ కలిసి రాష్ట్రాన్ని మరింతగా దోచుకోవాలనే స్వలాభం తప్ప ప్రజా సంక్షేమం కోసం కాదన్నారు. ఎంతమంది ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం పాటుపడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏమి చేయలేరని స్పష్టం చేశారు.

బ్రాహ్మణులకు సముచితస్థానం కల్పించాలి

ఓపెన్ బ్రెయిన్స్ సంస్థ అధ్యక్షుడు రమణమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బ్రాహ్మణ సమాజానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో సముచిత స్థానం కల్పించాలని ఓపెన్ బ్రెయిన్స్ సంస్థ అధ్యక్షుడు రమణమూర్తి డిమాండ్ చేశారు. సత్యనారాయణపురంలోని గాయత్రీ ఫంక్షన్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడిన బ్రాహ్మణ సామాజికవర్గానికి పూర్వవైభవాన్ని తీసుకురావటం కోసం బ్రాహ్మణ మేధావుల కలయికతో ఓపెన్ బ్రెయిన్ సంస్థను ఏర్పాటు చేసుకుని మొదటి సమావేశం నిర్వహించామని తెలిపారు. బ్రాహ్మణ సమాజాభివృద్ధికై మేధావులతో కలసి భవిష్యత్తు ప్రణాళికలు రూపకల్పన చేసుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగా రాబోయే ఎన్నికల్లో అధిక సంఖ్యలో బ్రాహ్మణ అభ్యర్థులను ఎన్నికల్లో నిలబెట్టనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 25 ఎమ్మెల్యే, 6 ఎంపీ స్థానాలు, తెలంగాణలో 20 ఎమ్మెల్యే, 5 ఎంపీ స్థానాలు కేటాయించాలని కోరారు. తమ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. సంస్థ కార్యదర్శి తురగ శ్రీరామ్, కె.రవిరావు, గంగరాజు లత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమణమూర్తి

పండుగ సీజన్ షురూ !

- బెజవాడలో మొదలైన సంక్రాంతి సందడి
- కొనుగోళ్ల హడావుడితో దుకాణాల రద్దీ
- కిటకిటలాడుతున్న వస్త్ర, ఎలక్ట్రానిక్స్ దుకాణాలు
- ఆఫర్లతో ఆకట్టుకుంటున్న వ్యాపార సంస్థలు


లెనిన్ సెంటర్‌లో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు


విజయవాడ బీసెంట్ రోడ్డులో రద్దీగా ఉన్న దృశ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బెజవాడలో పండుగ సీజన్ షురూ అయింది. నగరంలో ఎటుచూసినా సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. వారం ముందుగానే హడావుడి కన్పిస్తుంది.

ఏ మార్కెట్ చూసినా వినియోగదారులతో కళకళలాడుతూ దర్శనమిస్తున్నాయి. వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. టీవీలు, ఫ్రిజ్‌లు, సెల్ ఫోన్లు, ఇతర పరికరాల కొనుగోలుతో ఎలక్ట్రానిక్ దుకాణాలు సైతం రద్దీగా కన్పిస్తున్నాయి. వివిధ రకాల ఆఫర్లతో ఆయా వ్యాపార సంస్థలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. వస్త్ర దుకాణాలు ఈ ఏడాది భారీ ఆఫర్లను అందిస్తున్నాయి. 10 నుంచి 60 శాతం వరకూ రాయితీలు ఇస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నాయి. కొనుగోలును బట్టి గిఫ్టులు సైతం అందించే ప్రయత్నం చేస్తున్నాయి. నగరంలోని ప్రముఖ దుకాణాలన్నీ సంక్రాంతి పండుగకు సంబంధించి భారీగా అమ్మకాలు జరుపుతున్నాయి. దుకాణాల యాజమాన్యాలు ఆఫర్లను ప్రకటిస్తుండటంతో వినియోగదారులు సైతం వాటి వైపు బారులు తీరుతున్నారు. బందరురోడ్డు, ఏలూరురోడ్డు, గవర్నరుపేట, రింగ్‌రోడ్డు, పటమట తదితర ప్రాంతాల్లో ఉన్న ఎలక్ట్రానిక్స్ దుకాణాలు భారీగా ఆఫర్లను అందిస్తున్నాయి. వీటికి సంబంధించి పది నుంచి 50 శాతం వరకూ రాయితీలు ఇస్తున్నాయి. సెల్‌ఫోన్ దుకాణాల్లోనూ భారీగా విక్రయాలు సాగుతున్నాయి. కొత్త సంవత్సరం ఆరంభం నుంచి వీటి విక్రయాలు సైతం జోరందుకున్నాయి.

కొత్త దుకాణాల సందడి....

నగరంలో ఈ పండుగ సీజన్‌లో పలు కొత్త దుకాణాలు కూడా ప్రారంభమయ్యాయి. బందరురోడ్డులోని గడిచిన 20 రోజుల్లో పలు ప్రముఖ వస్త్ర దుకాణాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ఉన్న దుకాణాలతో పాటుగా కొత్త అమ్మకాలు జోరుగా నడుస్తున్నాయి. దానికి తోడు దుకాణాల వద్ద అలంకరణ, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేసి వినియోగదారులను ఆకట్టుకునేందుకు దుకాణ యజమానులు కసరత్తు చేస్తున్నారు. భారీ లైటింగ్‌లను ఏర్పాటు చేసి సందడి చేస్తున్నారు. బందరురోడ్డులోని వస్త్ర దుకాణాల వద్ద కనిపిస్తున్న సందడి అంతాఇంతా కాదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

కరోనా తరువాత ఇప్పుడే వ్యాపారం



కరోనా తరువాత ఇప్పుడే వ్యాపారం పుంజుకుంటుంది. వస్త్ర వ్యాపారానికి సంబంధించి చాలా పోటీ నడుస్తుంది. దుకాణాల వద్దకు వినియోగదారులను రప్పించటం, వారిని ఆకట్టుకునే విధంగా ఆఫర్లు ఇవ్వటం తప్పనిసరైంది. సంక్రాంతి సీజన్‌లో సాధారణంగా మంచి వ్యాపారం ఉంటుంది. ఈ ఏడాది ఆశించిన వ్యాపారం జరుగుతుందని భావిస్తున్నాము.

– బచ్చు వెంకటప్రసాద్, ప్రధాన కార్యదర్శి, ఏపీ టెక్స్‌టైల్ ఫెడరేషన్

బంగారు దుకాణాల్లో సైతం....

బంగారు దుకాణాల్లో సైతం ఈ పండుగ సీజన్ హడావుడి కనిపిస్తుంది. సాధారణంగా రైతులకు డబ్బులు చేతికి వచ్చే పండుగతో పాటుగా ప్రజానీకమూ కొంత మొత్తాన్ని బంగారంపై పెట్టుబడి పెట్టడం పరిపాటి. దాంతో బంగారు దుకాణాలు సైతం మజూరీ, తరుగుల్లో రాయితీలు అందిస్తు వినియోగదారులను ఆకట్టుకునేందుకు పోటీ పడుతున్నాయి. అదేవిధంగా వజ్రాభరణాలకు భారీగా రాయితీలందిస్తున్నాయి.


ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నాలుగు దశాబ్దాల తర్వాత కలిసిన వైనం

అవనిగడ్డ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అపూర్వంగా నిర్వహించారు. నాలుగు దశాబ్దాల తర్వాత అందరూ ఒక చోట కలిసి సందడి చేశారు. 1978 – 80 బ్యాచ్‌కి చెందిన వీరిలో ప్రస్తుతం నీటిపారుదల శాఖా మంత్రిగా చేస్తున్న అంబటి రాంబాబు, రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు ఉన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి, ఆయన సతీమణి కెప్టెన్ లక్ష్మీతో సహా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 44 సంవత్సరాల క్రితం చదువుకున్న చిన్ననాటి మిత్రులంతా ఒకచోట చేరి ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగం చేసుకుని ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అడ్రస్‌లు తీసుకుని చేస్తున్న పని, కుటుంబ సభ్యుల వివరాలు, యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ఆ నాటి జ్ఞాపకాలను జీవితంలో మర్చిపోలేమని చెప్పారు. అందరూ ఒక వేదిక మీద కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులు ఎం. రాధాకృష్ణమూర్తి, వి.వెంకటేశ్వర్లు, ఓంకారం నాగభూషణంను పూర్వ విద్యార్థులు సత్కరించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దుర్గా రమేష్, ఉపాధ్యాయులు రాజు, చలపతిరావు, శారదా యూపీ స్కూల్ నిర్వాహకులు ప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


ఆనాటి జువాలజీ లెక్చరర్‌ని సత్కరిస్తున్న ఎమ్మెల్యే దంపతులు, పూర్వ విద్యార్థులు

బాల్ బ్యాడ్మింటన్‌లో ఈస్ట్‌కోస్టు జట్టు విజేత



తిరువూరు: మండలంలోని ముష్టికుంట్లలో మూడు రోజులుగా కొనసాగుతున్న అంతర్రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. తెలంగాణ, ఏపీ నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విశాఖపట్నం ఈస్ట్‌కోస్ట్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. గుంటూరు దక్షిణ మధ్య రైల్వే జట్టు ద్వితీయ స్థానం, సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే జట్టు తృతీయస్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు, షీల్డులు ఆంజనేయ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకులు అందజేశారు.

క్లుప్తంగా...

తనికెళ్ల భరణికి గురుశ్రీ పురస్కారం ప్రదానం



తనికెళ్ల భరణికి పురస్కారం ప్రదానం

సాక్షి, చెన్నై: తెలుగు ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణికి ఆదివారం చెన్నైలో గురుశ్రీ పురస్కారం ప్రదానం చేశారు. శ్రీకళా సుధా తెలుగు అసోసియేషన్ నేతృత్వంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో అసోసియేషన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్ అధ్యక్షతన కెనడాకు చెందిన తట్టా శ్రీనివాస చక్రవర్తి, తెలుగు ప్రముఖులు బెల్లంకొండ శివప్రసాద్ చేతుల మీదుగా తనికెళ్ల భరణికి స్వర్ణ కిరీటాన్ని తొడిగి గురుశ్రీ పురస్కారంతో సత్కరించారు.

చరిత్రను బతికించుకుందాం

- ఆచార్య వకుళాభరణం రామకృష్ణ



వైవీయూ: చరిత్రను రక్షించి.. భవిష్యత్ తరాలకు అందించేందుకు యువ పరిశోధకులు ముందుకు రావాలని చరిత్రకారుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ కోరారు. కడప యోగి వేమన యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 'ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్' సదస్సు ఆదివారం ముగిసింది. రామకృష్ణ మాట్లాడుతూ.. చరిత్రకు జీవం పోయాల్సిన బాధ్యత పరిశోధకులు,యువతపై ఉందన్నారు. ఏపీ హిస్టరీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డా.ప్రసాద్ రెడ్డి, స్థానిక కార్యదర్శి కంకణాల గంగయ్య మాట్లాడుతూ.. ఈ సదస్సులో పురాతన ఆంధ్రప్రదేశ్, మధ్యయుగ, ఆధునిక, స్థానిక చరిత్రలపై లోతైన పరిశోధనలు వచ్చాయని చెప్పారు. అనంతరం పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

దేవరపల్లిలో అంతర్జాతీయ క్రికెట్ అకాడమీ

- భారత క్రికెట్ జట్టు మాజీ చీఫ్ సెలెక్టర్ ఎం.ఎస్.కె.ప్రసాద్



సభలో మాట్లాడుతున్న ఎంఎస్‌కే ప్రసాద్

దేవరపల్లి: తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో ఎంఎస్‌కే అంతర్జాతీయ క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్టు భారత క్రికెట్ జట్టు మాజీ వికెట్ కీపర్, జట్టు మాజీ చీఫ్ సెలెక్టర్ ఎం.ఎస్.కె.ప్రసాద్ తెలిపారు. దేవరపల్లిలోని హైవే సమీపంలో అకాడమీ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం స్థానిక ఏఎస్‌ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సభలో ఎం.ఎస్.కె.ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఐదు, యూఎస్ఏలో రెండు అంతర్జాతీయ క్రికెట్ అకాడమీలు ఏర్పాటు చేసి గ్రామీణ, పట్టణ ప్రాంత క్రీడాకారిణులకు శిక్షణ ఇస్తామని చెప్పారు. అమరావతి సమీపంలోని నంబూరులో కూడా అకాడమీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దేవరపల్లి అకాడమీలో ప్రతి నెలా ఎనిమిది మ్యాచ్‌లు జరిగేలా చూస్తామన్నారు. త్రీ లెవెల్ కోచ్‌లు ఇద్దరు ఉంటారని, అకాడమీల వద్ద ఉచిత వసతి, భోజన సదుపాయాలు ఉంటాయని చెప్పారు. మండలంలో జాతీయ మహిళా క్రికెట్ క్రీడాకారులు ఎక్కువ మంది ఉన్నందున ఈ ప్రాంతంలో వారిని ప్రోత్సహించి భారత జట్టులో ఆడే విధంగా తీర్చిదిద్దుతానని వివరించారు. తాను 11 ఏళ్ల వయస్సులో అండర్–12 క్రికెట్ ఆడానని ఆయన గుర్తు చేసుకున్నారు. శాప్ మాజీ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్, రాష్ట్ర క్రికెట్ అకాడమీ సీనియర్ కోచ్ హమానుల్లా తదితరులు ప్రసంగించారు. అనంతరం ఎం.ఎస్.కె.ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు మస్తాన్‌రెడ్డి, ప్రసన్న, పీడీలు ఓరుగంటి నాగరాజు, ఓరుగంటి రామకృష్ణ, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్ రోడ్‌షోలపై కరోనా ప్రభావం

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే విధంగా పలు దేశాల్లో నిర్వహించతలపెట్టిన రోడ్‌షోలపై మరోసారి కరోనా తన ప్రభావం చూపుతోంది. గత రెండేళ్లుగా కోవిడ్ భయాలు, ఆంక్షలతో పరిశ్రమల శాఖ విదేశీ రోడ్‌షోలు నిర్వహించలేకపోయింది. దీంతో మార్చి 3, 4 తేదీల్లో విశాఖ వేదికగా జరగనున్న అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు (జీఐఎస్)కు పెట్టుబడులను ఆకర్షించడానికి పలు దేశాల్లో రోడ్‌షోలను నిర్వహించాలని ఏపీఈడీబీ, పరిశ్రమలశాఖ ప్రణాళికలను సిద్ధం చేశాయి. పలు దేశాల్లో విజృంభిస్తున్న కరోనా ఈ ప్రణాళికలపై ప్రభావం చూపిస్తోంది. చైనా, అమెరికా, జపాన్ వంటి కీలక దేశాల్లో కరోనా కొత్త వేరియంట్ వేగంగా విస్తరిస్తోంది. ప్రస్తుతానికి విదేశీ ప్రయాణాలపై ఆంక్షలు లేకపోవడంతో విదేశీ రోడ్‌షోలకు తమ అధికారులు సిద్ధమవుతున్నారని రాష్ట్ర పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికల్ వలవన్ 'సాక్షి'కి తెలిపారు. ముందస్తుగా అందరూ వ్యాక్సిన్ తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. కోవిడ్ వ్యాక్సిన్ సెకండ్ డోస్ తీసుకోని వారు తప్పనిసరిగా తీసుకోవాలని, ఇప్పటికే రెండుసార్లు వ్యాక్సిన్ తీసుకున్న వారు బూస్టర్ డోస్ తీసుకుని సిద్ధంగా ఉండాల్సిందిగా కోరినట్లు తెలిపారు. ఆంక్షలు లేకపోతే విదేశీ రోడ్‌షోలను కొనసాగిస్తామని చెప్పారు.



కరోనా వచ్చినా కంగారొద్దు

పుష్కలంగా మందులు.. సరిపడా పడకలు

- కరోనా వ్యాప్తి మొదలైతే ఎదుర్కోవడానికి సిద్ధంగా ప్రభుత్వం
- 8,594 ఐసీయూ, 34,763 ఆక్సిజన్, 12 వేల సాధారణ పడకలు సిద్ధం
- ప్రభుత్వాస్పత్రుల్లో 170 పీఎస్‌ఏ ప్లాంట్లు
- అందుబాటులో 15 వేలు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, 33 వేల సిలిండర్లు
- పరీక్షల నిర్వహణకు 14 లక్షల ఆర్టీపీసీఆర్, 8.44 లక్షల ఆర్ఎన్ఏ కిట్లు

సాక్షి, అమరావతి: కరోనా మొదటి, రెండో విడత ఉధృతిని సమర్థంగా ఎదుర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం.. మరోసారి ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్న తాజా వ్యాప్తిని కూడా ఎదుర్కోవడానికి సిద్ధమైంది. వైరస్ నిర్ధారణ పరీక్షలు మొదలు చికిత్స అందించడానికి, వైరస్ నియంత్రణకు అన్ని వనరులను ఇప్పటికే వైద్య, ఆరోగ్య శాఖ అందుబాటులోకి తెచ్చింది. ఇంకా అవసరమయ్యే పరికరాలు, వస్తువుల కొనుగోలుకు చర్యలు చేపట్టింది. గతంలో వైరస్ వ్యాప్తి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను కరోనాకు చికిత్స అందించే ఆస్పత్రులుగా వైద్య శాఖ నోటిఫై చేసింది. వైరస్ వ్యాప్తి, పాజిటివ్ కేసులు తగ్గడంతో ఈ ఆస్పత్రులను డీ నోటిఫై చేశారు. మళ్లీ పాజిటివ్ కేసుల నమోదు పెరిగితే ఆస్పత్రులను తిరిగి నోటిఫై చేయనున్నారు. ఆయా ఆస్పత్రుల్లో 8,594 ఐసీయూ, 34,763 ఆక్సిజన్, 12,292 సాధారణ పడకలు అందుబాటులో ఉన్నాయి. 5813 వెంటిలేటర్లు సిద్ధంగా ఉన్నాయి. ఐసోలేషన్/క్వారంటైన్ పడకలు 54వేల చొప్పున ఉన్నాయి. 1,092 పీడియాట్రిక్ ఐసీయూ పడకలు, 5,610 పీడియాట్రిక్ వెంటిలేటర్లు, 297 నియోనాటల్ వెంటిలేటర్లు ఉన్నాయి.

మందుల నిల్వలు ఇలా

- రెమ్‌డెసివిర్ 100 ఎంజీ 1,39,515
- ఇన్సులిన్ ఇంజెక్షన్లు 28,267
- యాంపోటెరసిన్ బీ 38,592
- పోస్కానజోల్ ఇంజెక్షన్లు - 23,218
- అపిక్సాబిన్ మాత్రలు 2,52,926
- హైడ్రాక్సీ క్లోరోక్విన్ 4,21,124
- ఎనోక్సాపరిన్ సోడియం ఇంజెక్షన్లు 3,17,688
- డెక్సామెథాసన్ మాత్రలు 3,17,688
- ఐవర్‌మెక్టిన్ మాత్రలు - 65,802

ప్రాణవాయువు పుష్కలం

రెండో విడత కరోనా వ్యాప్తిలో ఆక్సిజన్‌కు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ఆక్సిజన్‌కు కొరత రాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 170 పీఎస్ఏ ప్లాంట్‌లు నెలకొల్పడంతో పాటు 33,902 డీ–టైప్ సిలెండర్లు, 15,565 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను సమకూర్చారు. మరోవైపు స్వల్ప లక్షణాలుండి ఇంటిలో ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన వారికి అందజేసేందుకు 4,61,729 హోమ్ ఐసోలేషన్ కిట్లు ఉన్నాయి. వైద్యులు, వైద్య సిబ్బందికి 16,32,714 ఎన్ 95 మాస్కులు, 4,80,441 పీపీఈ కిట్లు అందుబాటులో ఉంచారు. కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి 14,24,000 ఆర్టీపీసీఆర్, 8,44,763 ఆర్ఎన్ఏ ఎక్స్‌ట్రాక్షన్ కిట్లు ఉన్నాయి.

జాగ్రత్తలు పాటించాలి

కరోనాను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పూర్తి సన్నద్ధతతో ఉంది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే చాలు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ కరోనా కొత్త వేరియంట్ బీఎఫ్–7 కేసులు నమోదవలేదు. డిసెంబర్ నెలలో ఇప్పటివరకు 48 నమూనాలను జీనోమ్ ల్యాబ్‌లో పరీక్షించారు. ఈ కేసులన్నీ ఒమిక్రాన్‌కు సంబంధించినవే. ఎయిర్‌పోర్టుల్లో అంతర్జాతీయ ప్రయాణికులకు పరీక్షలు ప్రారంభించాం. అంతర్జాయతీ ప్రయాణికులకు ఎరికైనా పాజిటివ్‌గా తేలితే వారి నమూనాలను జీనోమ్ ల్యాబ్‌కు పంపి సీక్వెన్సింగ్ చేపట్టాలని నిర్ణయించాం.

– జె. నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

మార్చికల్లా పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్

- ప్రజారోగ్యంపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ
- రాష్ట్రంలోని ఏడు మెడికల్ కాలేజీల్లో అంకాలజీ యూనిట్ల ఏర్పాటు
- ప్రభుత్వాస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో ప్రవాస భారత వైద్య నిపుణుల సేవలు
- 'ఆపీ'.. ఏపీ వైద్యశాఖల పరస్పర సహకారం
- గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ముగింపు సందర్భంగా ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణబాబు

సాక్షి, విశాఖపట్నం: వచ్చే మార్చి నాటికి శ్రీకాకుళం జిల్లా పలాసలోని కిడ్నీ రీసెర్చి సెంటర్ అందుబాటులోకి తెస్తున్నామని.. ఇక్కడి ఉద్దానంతో పాటు ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరుల్లోని కిడ్నీ తీవ్రతను తగ్గించే చర్యలు కూడా ఇప్పటికే చేపట్టామని.. వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు వెల్లడించారు. అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ (ఆపీ), ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖలు కూడా పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించామన్నారు. విశాఖలో మూడ్రోజులుగా జరుగుతున్న గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ ఒప్పందం జరిగితే ప్రవాస భారతీయ వైద్య ప్రముఖుల సేవలను రాష్ట్ర ప్రభుత్వ వైద్యశాలలు, వైద్య విద్యాలయాలు వినియోగించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ సమ్మిట్ ద్వారా వైద్య రంగ నిపుణుల సూచనలు, సలహాలను ప్రభుత్వం తీసుకుని వాటి ఆచరణకు కృషిచేస్తుందని చెప్పారు. విదేశీ వైద్య ప్రముఖులు రాష్ట్రానికి వచ్చిన సమయంలో ప్రధాన వైద్యశాలల్లో అత్యవసర చికిత్సలతో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని కోరినట్లు తెలిపారు. విదేశాల్లో స్థిరపడిన మన వైద్యులు వారి అనుభవాలను మన రాష్ట్ర వైద్య విధానంలో మార్పుల కోసం సహకరించాలని కోరారు.

అంకాలజీ విభాగాల బలోపేతం

అలాగే, రాష్ట్రంలోని ఏడు పురాతన వైద్య కళాశాలల్లో అడ్వాన్స్ క్యాన్సర్ ట్రీట్‌మెంట్ సదుపాయాలతో పాటు రేడియోథెరపీ, సర్జికల్, మెడికల్ అంకాలజీ విభాగాలను బలోపేతం చేసే అంశం ప్రభుత్వ ప్రతిపాదనలో ఉందని కృష్ణబాబు వెల్లడించారు. ఈ సదస్సులో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్, 'ఆపీ' ఇండియా ప్రతినిధులు డాక్టర్ టి.రవిరాజు, రవి కొల్లి, 'ఆపీ' అమెరికా కోఆర్డినేటర్ ప్రసాద్ చలసాని, భారత సంతతి అమెరికా వైద్యులు, దేశంలోని పలువురు ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు. అంతకుముందు.. డాక్టర్ రవిరాజు ఎక్సలెన్స్ అవార్డును ప్రసాద్ చలసానికి ప్రదానం చేశారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తోందని కృష్ణబాబు చెప్పారు. ఇందు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో ఆరోగ్య పథకాలు, సేవలను అమలుచేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆరోగ్య రంగంలో నాడు–నేడు కార్యక్రమం ద్వారా రూ.16 వేల కోట్లు వెచ్చించినట్టు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలలు, ప్రతి జిల్లాలో ఒక క్యాథ్‌ల్యాబ్‌ను గిరిజన ప్రాంతాల్లో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులను ఏర్పాటుచేస్తున్నామన్నారు. దేశంలోనే తొలిసారిగా ఫ్యామిలీ ఫిజిషియన్ విధానాన్నీ ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇక ఆరోగ్యశ్రీలో ఎంప్యానెల్ చేసిన 2,225 ఆస్పత్రుల ద్వారా 3,255 రకాల వ్యాధులకు చికిత్స అందుబాటులో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క క్యాన్సర్‌కే ఏటా రూ.400 కోట్లు వెచ్చిస్తోందన్నారు.

గ్రూప్ 1 ప్రిలిమ్స్ ప్రశాంతం

▶ మొదటి పేజీ తరువాయి

జనరల్ స్టడీస్ అంశాలు పూర్తిగా గత ఏడాదిలో చోటు చేసుకున్న పరిణామాల పరిధిలోనివేనని తెలిపారు. గతంలో అనువాదం సరిగాలేక తప్పులు దొర్లడంతో తెలుగు మీడియం అభ్యర్థులకు నష్టం వాటిల్లిందని, ఈసారి మాత్రం తెలుగు అనువాదంలో ఎక్కడా తప్పులు దొర్లలేదని పలువురు అభ్యర్థులు వెల్లడించారు.

1 : 50లో మెయిన్స్‌కు అవకాశమివ్వాలని వినతి

ఉన్నత ప్రమాణాలతో గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహించారని, దీనివల్ల మంచి పరిజ్ఞానం, నైపుణ్యం ఉన్నవారు అర్హత సాధించగలుగుతారని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. అయితే మెయిన్స్‌కి ఎక్కువ మందికి అవకాశం కల్పించాలని నిపుణులతో పాటు అభ్యర్థులు కోరుతున్నారు. గతంలో గ్రూప్–1 ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కి 1 : 50 చొప్పున అనుమతించేవారు. అయితే టీడీపీ హయాంలో దాన్ని మార్పు చేసి ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కి ఏ మేరకు అభ్యర్థులను ఎంపిక చేయాలో నిర్ణయం తీసుకునే అధికారాన్ని కమిషన్‌కి కట్టబెట్టారు. గత ప్రభుత్వ హయాంలో 2018 గ్రూప్–1లో 1 : 50 ప్రకారం కాకుండా 1 : 12కి తగ్గించి అభ్యర్థులకు మెయిన్స్‌కి అవకాశమిచ్చారు. దీనివల్ల అనేకమంది ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కి అవకాశం లభించక నష్టపోయారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ బీసీ తదితర రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ వర్గాల అభ్యర్థులు మెరిట్ మార్కులతో జనరల్ కేటగిరీలో చేరాల్సి ఉన్నా వారిని కేవలం వారి కేటగిరీకే పరిమితం చేశారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ తరువాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అదే మెయిన్స్‌ను కోర్టు ఆదేశాలతో మళ్లీ నిర్వహించాల్సి రాగా 1 : 50 చొప్పున అవకాశం ఇచ్చారని అభ్యర్థులు గుర్తు చేస్తున్నారు. దీనివల్ల అంతకు ముందు అవకాశం కోల్పోయిన వారు మెయిన్స్ రాయడంతో పాటు అందులో మెరిట్‌లో నిలిచారని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి కూడా ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కి 1 : 50 ప్రకారం అవకాశం ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

విజయవాడలో పట్టుబడ్డ అభ్యర్థి: విజయవాడ బెంజి సర్కిల్ సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఆదివారం గ్రూప్–1 పరీక్షలో కాపీ కొడుతూ పట్టుబడ్డ ఓ అభ్యర్థిపై కేసు నమోదైంది. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకికి చెందిన కె.వెంకటేష్ లోదుస్తుల్లో దాచిన సెల్‌ఫోన్‌లో జవాబులు చూసి రాస్తుండగా ఇన్విజిలేటర్లు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

ఇంధన సామర్థ్యంలో దేశానికి ఏపీ రోల్ మోడల్

- రూ 412 కోట్ల పెట్టుబడులకు విశాఖ వేదికగా పునాది
- దశలవారీగా ఇంధన సామర్థ్య ప్రాజెక్టులకు సాయం
- బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే



సాక్షి, అమరావతి: ఇంధన సామర్థ్యంలో ఏపీని దేశానికే రోల్ మోడల్‌గా ఆవిష్కరిస్తామని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే ప్రకటించారు. ఇంధన పొదుపు, సమర్థ వినియోగం, సామర్థ్యం పెంపునకు సంబంధించిన కార్యక్రమాల అమలుపై ఆదివారం వెబినార్ ద్వారా ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. కేంద్రపాలిత ప్రాంతాలు 30 రాష్ట్రాల స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీలతో నిర్వహించిన వెబినార్‌కు ఏపీ నుంచి రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీ ఎస్ఈసీఎం) అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భాక్రే మాట్లాడుతూ.. ఇంధన సామర్థ్య పెట్టుబడులను ఆకర్షించేందుకు విశాఖలో నిర్వహించిన ఇన్వెస్ట్‌మెంట్ బజార్ సదస్సు సత్ఫలితాలిచ్చిందని వెల్లడించారు. సదస్సు ద్వారా రాష్ట్రంలో రూ.412 కోట్లకు పైగా విలువైన ఎనర్జీ ఎఫిషియెన్సీ ఫైనాన్స్ ప్రాజెక్టులకు పునాది పడిందన్నారు.

అన్నిచోట్లా 'ఎలక్ట్రిక్ వంట'

జాతీయ ఇంధన సామర్థ్య లక్ష్యాలను చేరుకోవడానికి, వాతావరణ మార్పులను పరిష్కరించడానికి, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని బీఈఈ అన్ని రాష్ట్రాలకు 2030 నాటికి 150 మిలియన్ టన్నుల చమురుకు సమానమైన ఇంధనాన్ని ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఏపీలోని పరిశ్రమల్లో 'పాట్' అమలు ద్వారా ఇప్పటివరకు 1.204 మిలియన్ టన్నుల చమురుకు సమానమైన ఇంధనాన్ని మిగిల్చినట్టు ఏపీ ఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి వెల్లడించారు. సమావేశంలో బీఈఈ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్, సెక్రటరీ ఆర్‌కే రాయ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బొగ్గు కల్తీ మాఫియా అరెస్ట్

- రూ.10.91 లక్షల రికవరీ
- మూడు లారీలు సీజ్

ముత్తుకూరు: కృష్ణపట్నంపోర్టులో దిగుమతి అయ్యే విదేశీ బొగ్గును వివిధ ప్రాజెక్ట్‌లకు లారీల్లో రవాణా చేసే క్రమంలో కల్తీ చేసి, రూ.లక్షలు కాజేసే ఓ మాఫియా ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయ రెడ్డి ఆదివారం ముత్తుకూరులో వివరాలు వెల్లడించారు. కృష్ణపట్నంపోర్టు, విశాఖ పోర్టు నుంచి శ్రీకామాక్షితాయి లాజిస్టిక్ అనే కంపెనీ కొన్ని సంవత్సరాలుగా బొగ్గు హ్యాండ్లింగ్, రవాణా చేస్తోంది. 2020లో ఈ కంపెనీ నుంచి అల్ట్రాటెక్ కంపెనీకి రవాణా చేసిన బొగ్గులో బూడిద ఉండడం గుర్తించారు. ఈ మేరకు కృష్ణపట్నం పోర్టు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో గత నెల చౌటుప్పల్‌లోని దివీస్ ఫార్మాకు మూడు లారీల బొగ్గు రవాణా చేశారు. ఇందులో కూడా భారీగా బూడిద ఉండడంతో దివీస్ కంపెనీ నిరాకరించింది. దీనిపై గత డిసెంబరు 30న ముత్తుకూరు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసును పోలీసులు లోతుగా విచారించారు. గుంటూరుకు చెందిన బత్తిన ప్రసాద్, హైదరాబాద్‌కు చెందిన రంగినేని అశోక్, కృష్ణాజిల్లా నందిగామ సమీపంలోని ముప్పాళ్ల వద్ద, విజయవాడకు చెందిన దుద్దుకూరి హరిబాబు, గద్దె మోహనరావు విజయవాడ సమీపంలోని గొల్లపూడి వద్ద, గరికపాటి నాగమల్లేశ్వరావు అనే వ్యక్తి నందిగామ వద్ద, గూడూరు బుజ్జి అనే వ్యక్తి విజయవాడ వద్ద బొగ్గు ట్రేడింగ్ పేరుతో డిపోలు నడుపుతున్నారు. కృష్ణపట్నం, విశాఖ పోర్టుల నుంచి రవాణా అయ్యే బొగ్గును లారీ డ్రైవర్లతో కుమ్మక్కై లారీల్లోని విలువైన బొగ్గును తమ వద్ద డంపింగ్ చేసి, బూడిద, నల్లమట్టి కలిపి పంపుతున్నారు. విజయవాడకు చెందిన పువ్వాడ ప్రసాద్ అనే వ్యక్తి లారీ డ్రైవర్లు, యజమానులతో మాట్లాడుకుని, బొగ్గు లారీలను వీరి డిపోలకు పంపుతూ, కమీషన్లు దండుకొంటున్నాడు. దొండపాడుకు చెందిన వేముల శ్రీనివాస్ అనే వ్యక్తి వివిధ సిమెంట్, ఫార్మా కంపెనీల అన్‌లోడింగ్ ఆపరేటర్లను లోబరుచుకుని, బూడిద కలిసిన బొగ్గును పంపిస్తుంటాడు. విజయవాడ, నందిగామ కేంద్రంగా ఈ ముఠా కొద్ది సంవత్సరాలుగా బూడిద, నల్లమట్టి కలిసిన బొగ్గును రవాణా చేస్తూ రూ.లక్షలు కాజేశారు. కాగా, చౌటుప్పల్‌లోని దివీస్ ఫార్మా కంపెనీ ఇన్‌చార్జ్ నరేంద్ర లారీలను నిలిపి, తనిఖీ చేయగా బండారం బయటపడింది. దీంతో డ్రైవర్లు లారీలను విడిచి పెట్టి పారిపోయారు. ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు బూడిద కలిసిన మూడు బొగ్గు లారీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కీలక పాత్ర పోషించిన పువ్వాడ వెంకట ప్రసాద్ రావు, గద్దె మోహన్‌రావు, కట్టా అశోక్, అయితగోని అనీల్, వేముల శ్రీనివాసరావును నెల్లూరులోని సింహపురి జంక్షన్ వద్ద ఆదివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10.91 లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

మహిళా శక్తికి 'చేయూత'

▶ మొదటి పేజీ తరువాయి

మహిళా మార్టులు కార్పొరేట్ కంపెనీల సూపర్ బజార్‌లకు పోటీగా విక్రయాలు నమోదు చేస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో 14 మార్టులు ఏర్పాటు కాగా రూ.లక్షల్లో విక్రయాలు కొనసాగిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేయూత, ఆసరా పథకాల ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయానికి పొదుపు సంఘాల మహిళలు మరికొంత జోడించి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో హెచ్‌యూఎల్, ఐటీసీ, రిలయన్స్ లాంటి ప్రముఖ కంపెనీలు ఈ మార్టులకు నాణ్యమైన సరుకులను తక్కువ ధరకే సరఫరా చేస్తున్నాయి.

ఖర్చుల నియంత్రణ.. బంపర్ డ్రాలు

చేయూత మహిళా మార్టుల నిర్వహణ ద్వారా పది మంది మహిళలు ఉపాధితోపాటు విక్రయాల ద్వారా వచ్చే లాభాలతో మెరుగైన జీవనోపాధి పొందుతున్నారు. రాష్ట్రంలో గతేడాది ఆగస్టు నుంచి డిసెంబర్ 28వ తేదీ వరకు 14 మహిళా మార్ట్‌లు ఏర్పాటయ్యాయి. మరో 9 ఈ నెలలోనే ఏర్పాటు కానుండగా ఇంకా 11 చేయూత మహిళా మార్ట్‌లను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇటీవల కలెక్టర్లతో సమీక్ష సందర్భంగా మార్చి నెలాఖరు నాటికి రాష్ట్రంలో 500 చేయూత మహిళా మార్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీఎస్ డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి సూచించారు. కనీసం 15 నుంచి 20 శాతం మార్జిన్‌తో ప్రముఖ కంపెనీల నుంచి ఉత్పత్తుల కొనుగోలుకు మార్టులను అనుసంధానించి డోర్ డెలివరీ, ఆన్‌లైన్, వాట్సాప్ బుకింగ్ సౌకర్యాలను కల్పించాలన్నారు. ఆన్‌లైన్ ఆర్డర్లను ఇంటివద్ద అందించేందుకు మార్టు సిబ్బందికి ఒక ద్విచక్ర వాహనం ఉండాలన్నారు. పండుగ సీజన్లలో బంపర్ డ్రాలతో వ్యాపారాలను ప్రోత్సహించాలని, నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. నెలకు రూ.30 లక్షల టర్నోవర్ దిశగా కృషి చేయాలన్నారు. గ్రామీణ, మండల సమాఖ్య సభ్యులు పట్టణ ప్రాంతాల్లో మార్ట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ నెలలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న తొమ్మిది మహిళా మార్ట్‌లు

- నెల్లూరు జిల్లా కందుకూరు
- విజయనగరం జిల్లా గరివిడి
- శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి
- ఏలూరు జిల్లా చింతలపూడి
- డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం
- బాపట్ల జిల్లా నిజాంపట్నం
- చిత్తూరు జిల్లా తవణంపల్లె
- నెల్లూరు జిల్లా వింజమూరు
- గుంటూరు జిల్లా ఫిరంగిపురం

ఏర్పాటు సన్నాహక ప్రక్రియలో ఉన్న 11 మహిళా మార్ట్‌లు

- పల్నాడు జిల్లా నాదెండ్ల
- పల్నాడు జిల్లా పిడుగురాళ్ల
- శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం
- విజయనగరం జిల్లా కోట
- బాపట్ల జిల్లా చీరాల
- నంద్యాల
- ప్రకాశం జిల్లా సింగరాయకొండ
- విశాఖపట్టణం జిల్లా ఆనందపురం
- అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల
- పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం
- పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం



లాభాల బాటలో..



మహిళా సంఘాల సభ్యులు 23 వేల మంది కలసి మార్టు ఏర్పాటు చేసుకున్నాం. నిత్యం 200 మంది సరుకులు కొనుగోలు చేస్తున్నారు. సుమారు 60 వేల కుటుంబాలకు తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు అందచేస్తున్నాం. గత ఏడాది డిసెంబర్ నాటికి రూ.74 లక్షల టర్నోవర్ సాధించి లాభాల బాటలో ఉన్నాం. డిసెంబరు 31వ తేదీన రూ.2.5 లక్షల సరుకులు విక్రయించి రాష్ట్రంలో అత్యధిక అమ్మకాలు జరిపిన మార్టుగా రికార్డు సృష్టించాం. తక్కువ ధరకు సరుకులు లభిస్తుండటంతో ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వం చేయూత, ఆసరా ద్వారా అందించిన సాయానికి మరికొంత జోడించి మార్టు ఏర్పాటు చేశాం.

– ఉప్పాడ ఎల్లేశ్వరి, చేయూత మహిళా మార్టు అధ్యక్షురాలు, యు.కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా

గతేడాది ఆగస్టు నుంచి డిసెంబర్ 28 వరకు ప్రారంభమైన చేయూత మహిళా మార్ట్‌లు, టర్నోవర్

జిల్లా పేరు	మహిళా మార్ట్ మండలం	ప్రారంభించిన తేదీ	28-12-2022 నాటికి విక్రయాలు (రూ.ల్లో)
కాకినాడ	యు.కొత్తపల్లి	22-08-2022	74,77,302
కర్నూలు	కోడుమూరు	02-09-2022	30,98,201
ఏలూరు	జంగారెడ్డి గూడెం	28-10-2022	15,50,209
అనంతపురం	నార్పాల	02-11-2022	18,71,443
తూర్పుగోదావరి	నిడదవోలు	10-11-2022	23,53,468
వైఎస్సార్ కడప	ఖాజీపేట	28-11-2022	16,35,718
అన్నమయ్య	వాయిల్పాడు	28-11-2022	15,03,320
అనకాపల్లి	జి.మాడుగుల	09-12-2022	6,19,484
శ్రీకాకుళం	నర్సన్నపేట	14-12-2022	2,03,017
తిరుపతి	చంద్రగిరి	14-12-2022	3,68,458
ఎన్టీఆర్	విసన్నపేట	19-12-2022	1,66,209
ప్రకాశం	టంగుటూరు	21-12-2022	2,86,625
కాకినాడ	తొండంగి	27-12-2022	84,903
కృష్ణా	మచిలీపట్నం	28-12-2022	63,630

పది మందికి ఉపాధి



నాణ్యమైన సరుకులను బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు విక్రయిస్తున్నాం. 1,500 సంఘాల ద్వారా సమకూరిన రూ.30 లక్షలకు తోడు ప్రభుత్వం అందించిన చేయూతతో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు చేతులమీదుగా నెల క్రితం మార్ట్ ప్రారంభించాం. ప్రస్తుతం రోజూ రూ.40 వేల మేర విక్రయాలు జరుగుతున్నాయి. పది మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. ఒక్కో సభ్యురాలు రూ.200 చొప్పున మూలధన పెట్టుబడిగా పెట్టారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకోకుండానే ఏర్పాటు చేశాం.

–అడపా అరుణ, చేయూత మహిళా మార్టు అధ్యక్షురాలు, అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం



బరిలోకి 'అమ్మ' దీపిక

భారత స్టార్ ఆర్చర్ దీపిక కుమారి గత నెల పండంటి అమ్మాయికి జన్మనిచ్చింది. కేవలం 20 రోజుల బాలింత అయిన ఆమె విల్లుపట్టేందుకు సిద్ధమైంది. కోల్‌కతాలో రేపటి నుంచి జరిగే జాతీయ సీనియర్ ఓపెన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు వచ్చింది. 'ట్రిపుల్ ఒలింపియన్' అయిన ఈ సీనియర్ ఇందులో పాల్గొనకపోతే మొత్తం ఏడాదంతా జట్టుకు దూరమవుతుంది. వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్ నేపథ్యంలో తనకీ ట్రయల్స్ కీలకమని 'అమ్మ' దీపిక చెప్పింది.



బ్రిటిష్ ఓపెన్ స్క్వాష్ టోర్నీ విజేత అనాహత్ సింగ్

ప్రతిష్టాత్మక బ్రిటిష్ జూనియర్ ఓపెన్ స్క్వాష్ టోర్నీలో అండర్-15 బాలికల సింగిల్స్ విభాగంలో భారత అమ్మాయి అనాహత్ సింగ్ విజేతగా నిలిచింది. బర్మింగ్‌హామ్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో అనాహత్ 11-8, 8-11, 11-7, 11-5తో సొహైలా హజీమ్ (ఈజిప్ట్)పై గెలిచింది. 14 ఏళ్ల అనాహత్ బ్రిటిష్ ఓపెన్‌లో టైటిల్ నెగ్గడం ఇది రెండోసారి. 2019లో ఆమె అండర్-11 విభాగంలో టైటిల్ సాధించింది. గతంలో భారత్ నుంచి జోష్నా చినప్ప, దీపిక పల్లికల్ మాత్రమే బ్రిటిష్ ఓపెన్ జూనియర్ టోర్నీలో విజేతలుగా నిలిచారు.

'హింద్ కేసరి' అభిజీత్

- పురుషుల విభాగంలో టైటిల్ నెగ్గిన మహారాష్ట్ర రెజ్లర్
- 'మహిళా హింద్ కేసరి' విజేత పుష్ప



అభిజీత్



పుష్ప

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక 'హింద్ కేసరి' జాతీయ సీనియర్ ఇండియన్ స్టయిల్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పురుషుల విభాగంలో మహారాష్ట్ర రెజ్లర్ అభిజీత్ కాట్కే చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం రాత్రి ఎల్బీ స్టేడియంలో జరిగిన పురుషుల 'హింద్ కేసరి' టైటిల్ బౌట్ ఫైనల్లో అభిజీత్ 5-0తో హరియాణాకు చెందిన సోమ్‌వీర్‌పై విజయం సాధించాడు. విజేత అభిజీత్ తెలంగాణ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వి. శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ చేతుల మీదుగా మూడు కిలోల వెండి గదను అందుకున్నాడు. ఫైనల్స్‌కు ముఖ్య అతిథిగా హాజరైన క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెజ్లింగ్ అకాడమీలను స్థాపించేందుకు ప్రయత్నిస్తామని, కుస్తీ క్రీడకు పూర్వ వైభవం లభించేలా కృషి చేస్తామని తెలిపారు.

'మహిళా హింద్ కేసరి' టైటిల్ హరియాణాకు చెందిన పుష్ప సొంతం చేసుకుంది. ఫైనల్లో పుష్ప ఢిల్లీకి చెందిన మోహినిపై గెలుపొంది చాంపియన్‌గా నిలిచింది. పుష్ప, మోహిని మధ్య జరిగిన టైటిల్ బౌట్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వీక్షించారు. అనంతరం విజేత పుష్పను కవిత అభినందించారు.

మెరిసిన తెలంగాణ రెజ్లర్లు...

'హింద్ కేసరి' టైటిల్ బౌట్స్ కాకుండా మిగతా వెయిట్ కేటగిరీలలో తెలంగాణ రెజ్లర్లు ఆకట్టుకున్నారు. మహిళల 62 కేజీల విభాగంలో సాహిర్ ఇబ్రహీమ్.. 48 కేజీల విభాగంలో బాలమణి.. 56 కేజీల విభాగంలో శ్రావణి తెలంగాణకు కాంస్య పతకాలు అందించారు. పురుషుల 60 కేజీల విభాగంలో తెలంగాణ రెజ్లర్లు నితీశ్, సయ్యద్ అబ్దుల్... 65 కేజీల విభాగంలో విజయ్ కుమార్... 70 కేజీల విభాగంలో దినేశ్, విజయ్... 75 కేజీల విభాగంలో హంజా బామస్, సయ్యద్ బిన్ అబ్దుల్లా... 80 కేజీల విభాగంలో సందీప్ యాదవ్ కాంస్య పతకాలు సాధించారు.

జొకోవిచ్... టైటిల్ నంబర్ 92

16 ఏళ్ల తర్వాత అడిలైడ్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన సెర్బియా స్టార్



అడిలైడ్: కొత్త ఏడాదిని సెర్బియా టెన్నిస్ యోధుడు నొవాక్ జొకోవిచ్ టైటిల్‌తో మొదలుపెట్టాడు. ఆదివారం ముగిసిన అడిలైడ్ ఇంటర్నేషనల్-1 ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో 35 ఏళ్ల జొకోవిచ్ చాంపియన్‌గా నిలిచాడు. 3 గంటల 9 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ జొకోవిచ్ 6-7 (8/10), 7-6 (7/3), 6-4తో ప్రపంచ 33వ ర్యాంకర్ సెబాస్టియన్ కోర్డా (అమెరికా)పై శ్రమించి గెలిచాడు. జొకోవిచ్ కెరీర్‌లో ఇది 92వ సింగిల్స్ టైటిల్ కావడం విశేషం. అంతేకాకుండా 16 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అడిలైడ్ ఓపెన్‌లో ఈ మాజీ నంబర్‌వన్ విజేతగా నిలిచాడు. 2007లో 19 ఏళ్ల ప్రాయంలో జొకోవిచ్ తొలిసారి ఈ టోర్నీలో టైటిల్ సాధించాడు.

1998 ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ పీటర్ కోర్డా తనయుడైన సెబాస్టియన్ కోర్డాతో తొలిసారి తలపడ్డ జొకోవిచ్ ఒకదశలో ఓటమి అంచుల్లో నిలిచాడు. తొలి సెట్ కోల్పోయిన జొకోవిచ్ రెండో సెట్‌లో 5-6తో వెనుకబడి తన సర్వీస్‌లోని 12వ గేమ్‌లో 30-40తో మ్యాచ్ పాయింట్‌ను కాచుకున్నాడు. ఓవర్‌హెడ్ షాట్‌తో పాయింట్ గెలిచి 40-40తో సమం చేసిన జొకోవిచ్ అదే జోరులో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని స్కోరును 6-6తో సమం చేశాడు. ఆ తర్వాత టైబ్రేక్‌లో జొకోవిచ్ పైచేయి సాధించాడు. నిర్ణాయక మూడో సెట్ కూడా హోరాహోరీగా సాగింది. జొకోవిచ్ 5-4తో ఆధిక్యంలోకి వెళ్లాక 12వ గేమ్‌లో కోర్డా సర్వీస్‌ను బ్రేక్ చేసి విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు 94,560 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 77 లక్షల 85 వేలు)తోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

4 పురుషుల టెన్నిస్ చరిత్రలో అత్యధిక సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుల జాబితాలో జొకోవిచ్ సంయుక్తంగా నాలుగో స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం జొకోవిచ్, రాఫెల్ నాదల్ (స్పెయిన్) 92 టైటిల్స్‌తో సమఉజ్జీగా నిలిచారు. ఈ జాబితాలో జిమ్మీ కానర్స్ (అమెరికా: 109 టైటిల్స్), ఫెడరర్ (స్విట్జర్లాండ్: 103 టైటిల్స్), ఇవాన్ లెండిల్ (అమెరికా/చెకోస్లొవేకియా: 94 టైటిల్స్) వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

వైదొలిగిన ఒసాకా

ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు మాజీ విజేత దూరం



మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు మరో దెబ్బ పడింది. ఇప్పటికే పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, 2022 యూఎస్ ఓపెన్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)... మహిళల సింగిల్స్‌లో మాజీ నంబర్‌వన్ సిమోనా హలెప్ (రొమేనియా) వైదొలగగా.. ఈ జాబితాలో తాజాగా రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ నయోమి ఒసాకా చేరింది. జపాన్‌కు చెందిన 25 ఏళ్ల ఒసాకా ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బరిలోకి దిగడంలేదని నిర్వాహకులు ఆదివారం ప్రకటించారు. అయితే ఒసాకా వైదొలగడానికి కారణం మాత్రం వారు వెల్లడించలేదు. 2019, 2021లలో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన ఒసాకా గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఏ టోర్నీలోనూ ఆడలేదు. ప్రస్తుతం ఆమె 42వ ర్యాంక్‌కు పడిపోయింది. 2018, 2020 యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ విజేతగా నిలిచిన ఒసాకా 2021 ఫ్రెంచ్ ఓపెన్ మధ్యలో వైదొలిగింది. ఆ తర్వాత తాను మానసిక ఒత్తిడితో సతమతమవుతున్నానని తెలిపి రెండునెలలపాటు ఆట నుంచి విరామం తీసుకుంది. ఆ తర్వాత పలు టోర్నీలలో ఆమె బరిలోకి దిగినా టైటిల్ మాత్రం సాధించలేకపోయింది.

యూఎస్‌ఏ ఖాతాలో యునైటెడ్ కప్



సిడ్నీ: తొలిసారి నిర్వహించిన మిక్స్‌డ్ టీమ్ టెన్నిస్ టోర్నీ యునైటెడ్ కప్‌లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్‌ఏ) జట్టు విజేతగా అవతరించింది. ఆదివారం జరిగిన 'బెస్ట్ ఆఫ్ ఫైవ్' మ్యాచ్‌ల ఫైనల్లో అమెరికా 4-0తో ఇటలీపై గెలిచింది. మహిళల తొలి సింగిల్స్‌లో జెస్సికా పెగులా 6-4, 6-2తో మార్టినా ట్రెవిసాన్‌పై నెగ్గగా... రెండో సింగిల్స్‌లో టియాఫో 6-2తో తొలి సెట్ గెలిచాక అతని ప్రత్యర్థి లోరెంజో ముసెట్టి గాయంతో వైదొలిగాడు. దాంతో అమెరికా 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో సింగిల్స్‌లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 7-6 (7/4), 7-6 (9/7)తో ప్రపంచ 16వ ర్యాంకర్ బెరెటినిని ఓడించడంతో అమెరికాకు టైటిల్ ఖరారైంది. నామమాత్రపు నాలుగో సింగిల్స్‌లో మాడిసన్ కీస్ 6-3, 6-2తో లూసియాపై నెగ్గి అమెరికా ఆధిక్యాన్ని 4-0కు పెంచింది. ఫలితం తేలిపోవడంతో డబుల్స్ మ్యాచ్‌ను నిర్వహించలేదు. ఈ టోర్నీలో మొత్తం 18 దేశాలు పాల్గొన్నాయి.

ఆసీస్, దక్షిణాఫ్రికా చివరి టెస్టు 'డ్రా'



సిడ్నీ: ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన ఆఖరి మూడో టెస్టు 'డ్రా'గా ముగిసింది. చివరిరోజు 14 వికెట్లు తీసి క్లీన్‌స్వీప్ చేద్దామనుకున్న ఆతిథ్య ఆసీస్ ఆశలు ఆవిరయ్యాయి. వాన అవాంతరాలను దాటుకుంటూ ఐదోరోజు పూర్తి ఆట సాగినా... కంగారూ బౌలర్లు 6 వికెట్లే పడగొట్టగలిగారు. దీంతో సఫారీ 'వైట్‌వాష్' నుంచి తప్పించుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 149/6తో ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా 108 ఓవర్లలో 255 పరుగుల వద్ద ఆలౌటైంది. సిమోన్ హార్మెర్ (47; 4 ఫోర్లు), కేశవ్ మహరాజ్ (53; 6 ఫోర్లు, 1 సిక్స్) కంగారూ బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. ఎనిమిదో వికెట్‌కు 85 పరుగులు జతచేశారు. 220 పరుగుల ఆధిక్యం పొందిన ఆసీస్... సఫారీని ఫాలోఆన్ ఆడించింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా మ్యాచ్ ముగిసే సమయానికి 41.5 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. సిరీస్‌ను ఆసీస్ 2-0తో ఇది వరకే కైవసం చేసుకుంది.

అనధికారికంగా ఫైనల్‌కు...

దక్షిణాఫ్రికాపై సిరీస్ నెగ్గడంతో ఆస్ట్రేలియా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2021-23 ఫైనల్ బెర్త్‌ను దాదాపుగా ఖరారు చేసుకుంది. త్వరలో భారత్‌లో పర్యటించే ఆసీస్ ఒక్క టెస్టు 'డ్రా' చేసుకున్నా ఇతర సమీకరణాలతో పనిలేకుండా ఫైనల్లోకి దూసుకెళుతుంది. అయితే 0-4తో భారత్ చేతిలో క్లీన్‌స్వీప్ అయితే... మరోవైపు కివీస్ పర్యటనలో లంక 2-0తో వైట్‌వాష్ చేస్తే అప్పుడు మాత్రమే 'కంగారూ'పడాలి. రెండో స్థానంలో ఉన్న భారత్ (58.93 శాతం) సొంతగడ్డపై ఆస్ట్రేలియాను 3-1తో గెలిస్తే నేరుగా తుదిపోరుకు చేరుతుంది. అయితే 2-2తో సమం చేసుకున్నప్పుడు మాత్రం ఇతర జట్ల సమీకరణాలపై ఆధారపడాలి.

సబలెంకా... ఒక్క సెట్ కోల్పోకుండా...



అడిలైడ్: గత ఏడాది ఒక్క టైటిల్ నెగ్గలేకపోయిన బెలారస్ టెన్నిస్ స్టార్, ప్రపంచ ఐదో ర్యాంకర్ సబలెంకా ఈ సంవత్సరాన్ని టైటిల్‌తో ప్రారంభించింది. ఆదివారం ముగిసిన అడిలైడ్ ఇంటర్నేషనల్-1 ఓపెన్ డబ్ల్యూటీఏ-500 టోర్నీలో ఆమె విజేతగా నిలిచింది. ఫైనల్లో సబలెంకా 6-2, 7-6 (7/4)తో క్వాలిఫయర్ లిండా నొస్కోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచింది. ఈ టోర్నీలో సబలెంకా ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం విశేషం. సబలెంకా కెరీర్‌లో ఇది 11వ టైటిల్‌కాగా... ఆమెకు 1,20,150 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 98 లక్షల 92 వేలు)తోపాటు 470 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

కార్ రేసింగ్‌లో అపశ్రుతి... డ్రైవర్ కుమార్ దుర్మరణం





చెన్నై: ఎంఆర్‌ఎఫ్-ఎఫ్ఎమ్ఎస్‌సీఐ జాతీయ కార్ రేసింగ్ చాంపియన్‌షిప్‌లో అపశ్రుతి చోటు చేసుకుంది. ఆదివారం మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో జరిగిన రెండో రౌండ్ రేసింగ్‌లో సీనియర్ డ్రైవర్ కె.ఇ.కుమార్ కారు ప్రమాదానికి గురైంది. ఇందులో పోటీపడిన 59 ఏళ్ల సీనియర్ రేసర్ కుమార్ తీవ్ర గాయాలపాలయ్యాడు. అతన్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఈ దుర్ఘటనపై భారత మోటార్ స్పోర్ట్స్ సమాఖ్య (ఎఫ్ఎమ్ఎస్‌సీఐ) దర్యాప్తు చేయాలని ఆదేశించింది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్‌పీజీ, ఆంధ్రప్రదేశ్‌లో 17 ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్‌లోని ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన సెంటర్ ఫర్ స్ట్రాటెజిక్ ప్లానింగ్ అండ్ గవర్నెన్స్(సీఎస్‌పీజీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 17
» **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్-01, సీనియర్ కన్సల్టెంట్-05, కన్సల్టెంట్-03, అనలిస్ట్-08.
» **అర్హత:** పోస్టును అనుసరించి బ్యాచిలర్స్ డిగ్రీ/సీఏ/మాస్టర్స్ డిగ్రీ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 3నుంచి 20 ఏళ్ల పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, మెరిట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** cspg.hr@gmail.com
» **దరఖాస్తులకు చివరితేది:** 17.01.2023.
» **వెబ్‌సైట్:** www.apsdps.ap.gov.in

గెయిల్, న్యూఢిల్లీలో 277 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్).. ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 277
» **పోస్టుల వివరాలు:** చీఫ్ మేనేజర్, సీనియర్ ఇంజనీర్, సీనియర్ ఆఫీసర్, ఆఫీసర్లు.
» **విభాగాలు:** ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, సెక్యూరిటీ, ఫైర్ అండ్ సేఫ్టీ, మెకానికల్, రెన్యూవెబుల్ ఎనర్జీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 65 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ /గ్రాడ్యుయేషన్ /బీఈ/బీటెక్ /ఎంబీఏ/సీఏ /సీఎంఏ/మాస్టర్స్ డిగ్రీ /పీజీ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 28 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» **పని అనుభవం:** కనీసం 1 నుంచి 12 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.2.4 లక్షలు చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్,స్క్రీనింగ్,గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.02.2023.
» **వెబ్‌సైట్:** www.gailonline.com

జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న 649 జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్‌వీ)ల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** విద్యార్థి తప్పనిసరిగా జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లాల్లో నివాసి అయి ఉండాలి. విద్యార్థులు 2022-23 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతుండాలి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 75 శాతం సీట్లు కేటాయించారు. వారు 3, 4, 5 తరగతులు గ్రామీణ ప్రాంత పాఠశాలల్లోనే చదివి ఉండాలి. మిగిలిన 25 శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయించారు.
» **వయసు:** దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 01.05.2011 నుంచి 30.04.2013 మధ్యలో జన్మించినవారై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023.
» **ప్రవేశ పరీక్షతేది:** 2023 ఏప్రిల్ 29వ తేది ఉదయం 11.30 గంటలకు సంబంధిత జిల్లాలో ఎంపికచేసిన అన్ని కేంద్రాలలో నిర్వహిస్తారు.
» **ఫలితాల వెల్లడి తేది:** జూన్ 2023.
» **వెబ్‌సైట్:** navodaya.gov.in

తెలంగాణ జిల్లా కోర్టుల్లో 275 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

తెలంగాణ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సర్వీసులో.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 275
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ లేదా ఏదైనా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, స్థానిక భాషలు తెలిసి ఉండాలి. నిర్ణీత విద్య, సాంకేతిక అర్హతల కంటే ఎక్కువ అర్హత ఉన్న అభ్యర్థులు, ధ్రువపత్రాల పరిశీలన సమయంలో సంబంధిత పత్రాలను అందజేయాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.24,280 నుంచి రూ.72,850 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** సీబీటీ/ఓఎమ్మార్ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)/ఓఎమ్మార్ పరీక్షలో 100ప్రశ్నలుంటాయి.జనరల్ నాలెడ్జ్ విభాగంలో60,జనరల్ ఇంగ్లిష్ విభాగంలో 40ప్రశ్నలుంటాయి.ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.01.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023.
» **హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 15.02.2023.
» **పరీక్ష తేది:** మార్చి 2023.
» **వెబ్‌సైట్:** tshc.gov.in

బోధన, పరిశోధనలకు మార్గం.. నెట్

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్-నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్! సంక్షిప్తంగా.. యూజీసీ-నెట్!! పరిశోధన అభ్యర్థులకు సుపరిచితమైన పరీక్ష! ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే.. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్), అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ పరీక్షను ఏటా రెండుసార్లు నిర్వహిస్తారు. తాజాగా యూజీసీ-నెట్ 2022, డిసెంబర్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. యూజీసీ నెట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ గైడెన్స్..

» యూజీసీ-నెట్ 2022, డిసెంబర్ నోటిఫికేషన్ విడుదల
» 83 సబ్జెక్టులలో జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కు పరీక్ష
» కొత్తగా ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ సబ్జెక్ట్

సైన్స్, టెక్నాలజీ తదితర విభాగాల్లో రీసెర్చ్ అభ్యర్థులకు పలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. కానీ హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో మాత్రం ఆశించిన మేరకు అవకాశాలు లేవు. ఈ సమస్యకు పరిష్కారంగా యూజీసీ అందుబాటులోకి తెచ్చిన విధానమే.. యూజీసీ-నెట్. ముఖ్యంగా హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్‌లో పరిశోధనల దిశగా యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో యూజీసీ నెట్‌ను నిర్వహిస్తున్నారు.

మొత్తం 83 సబ్జెక్టులు

యూజీసీ నెట్-2022, డిసెంబర్ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 83 సబ్జెక్ట్‌లలో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పరీక్ష నిర్వహించనున్నారు. ఏటా రెండుసార్లు నిర్వహించే యూజీసీ-నెట్‌లో గతంలో 82 సబ్జెక్ట్‌లు ఉన్నాయి. కొత్తగా ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ అనే సబ్జెక్ట్‌ను చేర్చారు.

అర్హత

- పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:**జేఆర్ఎఫ్ అభ్యర్థులకు 01.12.2022నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీ-ఎన్‌సీఎల్, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో అయిదేళ్ల సడలింపు లభిస్తుంది.
- అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ అభ్యర్థులకు ఎలాంటి గరిష్ఠ వయో పరిమితి నిబంధన లేదు.

రెండు కేటగిరీల్లో

- యూజీసీ-నెట్ పరీక్షను అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనే రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ కేటగిరీ పరీక్షకు హాజరవ్వాలనుకుంటున్నారో స్పష్టం చేయాల్సి ఉంటుంది.
- రీసెర్చ్/జేఆర్ఎఫ్ పట్ల ఆసక్తి ఉన్న వారు జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాధమ్యాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అధ్యాపక వృత్తికి మాత్రమే పరిమితం అవుదామనుకునే వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకుంటే సరిపోతుంది.
- అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాధమ్యం ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు.

రెండు పేపర్లు.. 300 మార్కులు

- యూజీసీ నెట్‌ను ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు 300 మార్కులకు ఉంటాయి.
- పేపర్-1లో 50 ప్రశ్నలకు-100 మార్కులు ఉంటాయి. ఇందులో అభ్యర్థుల్లోని టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, భిన్నమైన ఆలోచన సరళిపై ప్రశ్నలు ఎదురవుతాయి.
- పేపర్-2లో 100 ప్రశ్నలు-200 మార్కులకు ఉంటాయి. ఈ పేపర్ అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్‌పై ఉంటుంది. అభ్యర్థుల్లోని డొమైన్ నాలెడ్జ్‌ను పరీక్షించే విధంగా ఇందులో ప్రశ్నలు అడుగుతారు.
- రెండు పేపర్లకు కలిపి మొత్తం మూడు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు.

పేపర్ ఎంపిక

- పేపర్-1కు అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులందరూ తప్పనిసరిగా హాజరు కావాలి.
- పేపర్-2ను అభ్యర్థులు తమ పీజీ స్పెషలైజేషన్ ఆధారంగా యూజీసీ నెట్‌లో అర్హత ఉన్న సబ్జెక్ట్‌కు సంబంధించిన పరీక్షగా నిర్వహిస్తారు. ఉదాహరణకు పీజీ స్థాయిలో హిస్టరీ స్పెషలైజేషన్ చదివిన అభ్యర్థులు హిస్టరీ సబ్జెక్ట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది.

అర్హత మార్కులు

యూజీసీ నెట్‌కు సంబంధించి అర్హత మార్కుల నిబంధన అమలవుతోంది. రెండు కేటగిరీల అభ్యర్థులు(జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్) అర్హత పొందాలంటే.. తాము రాసిన పేపర్లలో కనీస అర్హత మార్కులు సాధించాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు స్కోర్ చేయాలి.

ఆరు శాతం మందికే అవకాశం

యూజీసీ నెట్.. మొత్తం హాజరైన అభ్యర్థుల్లో ఆరు శాతం మందినే నెట్ ఉత్తీర్ణులుగా ప్రకటిస్తుంది. కనీస అర్హత మార్కుల శాతం ఆధారంగా ఉత్తీర్ణులను ప్రకటించే క్రమంలో.. పలు స్లాట్లలో పరీక్షను నిర్వహించడాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా నార్మలైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు.



యూజీసీ-నెట్ 2022 డిసెంబర్

విజయం సాధించాలంటే

యూజీసీ-నెట్‌లో విజయం సాధించాలంటే.. అభ్యర్థులకు పరిశోధనల పట్ల ఆసక్తితోపాటు ఎంచుకున్న సబ్జెక్ట్‌పై సంపూర్ణ అవగాహన ఉండాలి.

ఉమ్మడి పేపర్‌కు సన్నద్ధత

అభ్యర్థులందరికీ ఉమ్మడిగా నిర్వహించే పేపర్-1లో టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాలు (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్-గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు చొప్పున అడుగుతారు.

సబ్జెక్ట్ పేపర్‌కు ఇలా

- అభ్యర్థుల పీజీ స్పెషలైజేషన్ ఆధారంగా నిర్వహించే పేపర్-2 సబ్జెక్ట్ పేపర్‌లో ప్రశ్నలు పీజీ స్థాయిలో ఉంటాయి. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- అభ్యర్థులు ఆయా సిలబస్ అంశాలను అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌తో చదవడం లాభిస్తుంది. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు ప్రాక్టికల్ థింకింగ్, అప్లికేషన్ ఓరియెంటేషన్ ఎంతో కీలకంగా నిలుస్తోంది. క్రిటికల్ థింకింగ్, అనలిటికల్ అప్రోచ్ ఉపయుక్తంగా ఉంటుంది. ఫలితంగా ప్రశ్నలు ఏ తీరుగా అడిగినా.. సమాధానాలు ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

సోషల్ సైన్సెస్, హ్యుమానిటీస్

పరిశోధనలు అనగానే సైన్స్, టెక్నాలజీలకు సంబంధించినవే అనే అభిప్రాయం ఉంది. కాని ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ వంటి సబ్జెక్ట్‌లు చదివిన వారికి కూడా పరిశోధనలతోపాటు, జేఆర్ఎఫ్‌కు మార్గం వేస్తుంది యూజీసీ-నెట్. పీజీ స్థాయిలో నాన్-సైన్స్ చదివిన అభ్యర్థులకు యూజీసీ-నెట్ చక్కటి అవకాశమని చెప్పొచ్చు.

యూజీసీ నెట్‌తో ప్రయోజనాలివే

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించి తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు పలు అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. అవి..

- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం-నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్ట్‌లకు ఎంపిక చేయాలి.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో మూడేళ్లపాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా పనిచేయొచ్చు.
- మొదటి రెండేళ్లు జేఆర్ఎఫ్ హోదాలో నెలకు రూ.31 వేల ఫెలోషిప్ లభిస్తుంది.
- జేఆర్ఎఫ్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్ఆర్ఎఫ్ రెండేళ్లపాటు నెలకు రూ.35 వేల చొప్పున అందుతుంది.
- జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ విభాగాల్లో సైంటిస్ట్‌లుగా కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తుంది.
- సైంటిస్ట్‌లుగా ఎంపికైన వారికి వారి గ్రేడ్ ఆధారంగా ప్రారంభంలోనే నెలకు రూ.ఎనభై వేల వరకూ వేతనం అందుతుంది.
- ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే.. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ, ఆర్థిక గణాంక శాఖలు, సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ విభాగాల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**జనవరి 17, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తులో సవరణ అవకాశం:** జనవరి 19-20 తేదీల్లో
- **పరీక్ష తేదీలు:** ఫిబ్రవరి 21 నుంచి మార్చి 10 వరకు(రోజుకు రెండు షిఫ్ట్‌లలో)
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ugcnet.nta.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
453	133
59,900	17,859

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	10,569	△	569
డోజోన్స్	33,631	△	701
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,699	△	66
డాక్స్	14,610	△	174
షాంఘై	3,158	△	2
నికాయ్	25,974	△	153

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	84.57	80.89
£	బ్రిటన్ పౌండ్	84.69	89.20
€	యూరో	95.75	100.59
¥	జపాన్ ఎన్ (100)	49.00	74.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	53.40	58.24
S$	సింగపూర్ డాలర్	59.15	63.68
SAR	సౌదీ రియాల్	21.06	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	21.62	23.42
¥	చైనా యువాన్	10.93	12.96

కొత్త ఏడాది.. సరికొత్త మార్పులు!

- బ్యాంక్ లాకర్ నిబంధనలు మారాయ్..
- 2022కు ముందు తీసుకున్న వారికి వర్తింపు
- బ్యాంక్‌కు వెళ్లి కొత్త ఒప్పందం చేసుకోవాలి
- పన్ను ఆదా వివరాలను ఈ నెల్లోనే ఇవ్వాలి
- ఫండ్స్ కేవైసీలో మార్పులు
- ఎన్‌పీఎస్ పాక్షిక ఉపసంహరణకు పూర్వపు నిబంధన

2023లోకి అడుగు పెట్టాం. కొత్త ఏడాదిలో ముందుగా నిర్వహించాల్సిన కొన్ని ముఖ్యమైన ఆర్థిక పనులు ఉన్నాయి. బ్యాంకు లాకర్ల ఒప్పందాలను పునరుద్ధరించుకోవాల్సిన అవసరం మొదటిది. ఇందుకు సంబంధించి కొన్ని బ్యాంకు కస్టమర్లకు సందేశాలు వస్తున్నాయి. తర్వాత పన్నుల ఆదా పెట్టుబడులకు సంబంధించిన వివరాలను పనిచేస్తున్న కంపెనీలకు సమర్పించడం. ఒకవేళ ఇప్పటికీ ఆ పనిచేయకపోతే మించిపోయినది ఏమీ లేదు. మరో మూడు నెలల గడువు ఉందని గమనించాలి. అలాగే, కొన్ని కీలకమైన మార్పులు జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆ వివరాలను ఈ కథనం ద్వారా తెలుసుకుందాం..



లాకర్ ఒప్పందాల్లో మార్పులు

బ్యాంకుల్లో లాకర్లు చాలా మందికి ఉంటాయి. ఈ సేఫ్ డిపాజిట్ లాకర్‌కు సంబంధించి ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవాలంటూ బ్యాంకులు తమ కస్టమర్లను కోరుతున్నాయి. ''ప్రియమైన కస్టమర్, ఆర్‌బీఐ సూచనల మేరకు మీరు మీ బ్రాంచ్‌కు వెళ్లి సవరించిన లాకర్ ఒప్పందాన్ని జనవరి 1 నాటికి కుదుర్చుకోవాలి. ఇప్పటికే ఆ పనిచేసి ఉంటే ఈ సందేశాన్ని మర్చిపోండి''అనే సందేశం చాలా మంది కస్టమర్లకు వస్తోంది. దేశంలోనే అతిపెద్ద బ్యాంక్ ఎస్‌బీఐ ఇందుకు సంబంధించి తన కస్టమర్లకు ఎస్ఎంఎస్‌లు పంపిస్తోంది. 2021 ఫిబ్రవరిలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఫలితమే ఇది. కోర్టు ఆదేశాలు వెలువడిన ఆరు నెలల్లో లాకర్ నిర్వహణకు సంబంధించి మార్గదర్శకాల్లో మార్పులను ఖరారు చేయాలని ఆర్‌బీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో 2021 ఆగస్టులో ఆర్‌బీఐ ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసింది. ఇందులో భాగంగా బ్యాంక్ బోర్డులు ఆమోదించిన లాకర్ నిర్వహణ ఒప్పందాన్ని బ్యాంకులు అమల్లో పెట్టాల్సి ఉంది. ''ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ రూపొందించే నమూనా లాకర్ ఒప్పందాన్ని బ్యాంకులు అమలు చేయవచ్చు. ఈ ఒప్పందం, సవరించిన మార్గదర్శకాలు గౌరవ సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఉండాలి''అని ఆర్‌బీఐ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

కొత్త నిబంధనలు కొత్తగా లాకర్ తీసుకునే వారికి 2022 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చేశాయి. కానీ, దానికంటే ముందు లాకర్ తీసుకున్న వారికి ఈ ఏడాది జనవరి 1 వరకు గడువు ఉంది. ఎస్‌బీఐ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర చాలా బ్యాంకులు సవరించిన నిబంధనలతో లాకర్ ఒప్పందాలను అమల్లోకి తీసుకొచ్చాయి. కాకపోతే ఇప్పటికీ చాలా మంది లాకర్ ఒప్పందాలపై తిరిగి సంతకాలు చేయలేదు. నిజానికి నూతన నిబంధనలన్నవి కస్టమర్ల ప్రయోజనాల పరిరక్షణ కోణంలో తీసుకొచ్చినవి. అందుకుని ఆలస్యం చేయకుండా కస్టమర్లు తమ బ్యాంక్ శాఖకు వెళ్లి కొత్త ఒప్పంద డాక్యుమెంట్లు, స్టాంప్ పేపర్లపై సంతకాలు పెట్టాలి. కొన్ని బ్యాంకులు స్వయంగా ఈ డాక్యుమెంట్లను అందిస్తుంటే, కొన్ని స్టాంప్ పేపర్లు తెచ్చుకోవాలంటూ కస్టమర్లకే చెబుతున్నాయి. స్టాంప్ పేపర్‌పై ఒప్పందం కుదుర్చుకోవడాన్ని సుప్రీంకోర్టు తప్పనిసరి చేసింది. ఇరు పార్టీలు చేసుకున్న ఒప్పందం కాపీ ఒకదాన్ని లాకర్‌ను అద్దెకు తీసుకున్న వ్యక్తికి అందించడం కూడా తప్పనిసరి. ఒరిజినల్ అగ్రిమెంట్ పత్రాలు బ్యాంకు దగ్గరే ఉంటాయి. బ్యాంక్ అడిగినప్పుడే లాకర్ పునరుద్ధర గురించి ఆలోచిద్దామని అనుకోకుండా, స్వయంగా వెళ్లి దాన్ని పూర్తి చేసుకోవడం అవసరం. ''బ్యాంక్‌లు తమ కస్టమర్లతో కొత్త ఒప్పందాలను 2023 జనవరి 1 నాటికి చేసుకోవడం తప్పనిసరి. ఈ తేదీని పొడిగింపుపై స్పష్టత లేదు. అందుకని కస్టమర్లే తమ బ్యాంక్ శాఖలకు వెళ్లి దీన్ని అప్‌డేట్ చేసుకోవాలి'' అని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్‌శెట్టి సూచించారు. కొన్ని బ్యాంక్‌లు కస్టమర్లకు సమాచారం ఇస్తున్నాయే కానీ, నిర్ణీత గడువులోపు చేయాలంటూ నిర్దేశించడం లేదు. కాకపోతే లాకర్ ఒప్పందాన్ని పునరుద్ధరించుకునే సమయంలో పూర్తిగా చదివి, నియమ నిబంధనలు తెలుసుకోవాలి.

ఇక బ్యాంకు లాకర్ నిబంధనలపైనా అవగాహన కలిగి ఉండడం అవసరం. ఏడాదిలో ఒక్కసారి అయినా లాకర్ సదుపాయాన్ని ఉపయోగించుకుని ఉండాలి. లేదంటే బ్యాంక్‌లు చర్యలు తీసుకుంటాయి. ఏడాది పాటు వినియోగంలో లేని లాకర్‌ను బద్దలు కొట్టి అందులో ఉన్న వాటిని స్వాధీనం చేసుకునే అధికారం బ్యాంక్‌లకు ఉంటుంది. ఈ విధమైన సమస్య రావద్దని అనుకుంటే కనీసం ఏడాదిలో ఒకటి రెండు సార్లు అయినా లాకర్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలి. బ్యాంక్‌లు లాకర్లకు సంబంధించి మూడేళ్ల అద్దెకు సరిపడా డిపాజిట్‌ను ఖాతాదారుల నుంచి తీసుకునేందుకును ఆర్‌బీఐ అనుమతించింది. అంతేకాదు, లాకర్లను బ్రేక్ చేసేందుకు అయ్యే వ్యయాలను కూడా ముందుగా తీసుకోవచ్చు. లాకర్ తీసుకుని, వాటిని నిర్వహించకుండా, అద్దె కట్టకుండా ఉండే రిస్క్‌ను ఇది తప్పిస్తుంది. అయితే, దీర్ఘకాలం నుంచి ఖాతాదారులుగా, మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న కస్టమర్ల విషయంలో బ్యాంకులు ఈ విధమైన చర్యలను దాదాపుగా తీసుకోవు. లాకర్లను ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా నిర్వహించే కస్టమర్లను లాకర్ డిపాజిట్ కోసం ఒత్తిడి చేయవద్దని ఆర్‌బీఐ సైతం బ్యాంక్‌లకు సూచించడం గమనార్హం. బ్యాంక్‌లు లాకర్ కోసం డిపాజిట్ తీసుకున్నా.. రద్దు చేసుకుంటే తిరిగి ఆ డిపాజిట్ వెనక్కిచ్చేస్తాయి.

పన్ను ఆదా వివరాలు

ఉద్యోగులు పన్ను మినహాయింపు పెట్టుబడులు, ఇతర వ్యయాలకు సంబంధించిన వివరాలను పని చేసే సంస్థకు జనవరి నెలలోనే సమర్పించాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా పన్ను చెల్లించాల్సిన ఆదాయం ఉంటే, టీడీఎస్‌ను మూడు నెలల వేతనాల్లో సంస్థలు మినహాయిస్తాయి. కనుక ప్రతి ఉద్యోగి బీమా పథకాలు, ఈఎల్ఎస్ఎస్ పెట్టుబడులు, పీపీఎఫ్, ట్యాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్, పిల్లల ట్యూషన్ ఫీజు తదితర వివరాలను అందించాలి. పన్ను మినహాయింపుల పెట్టుబడుల వివరాలు ఇవ్వడం వల్ల టీడీఎస్ బాధ్యతను తప్పించుకోవడం లేదంటే తగ్గించుకోవచ్చు.

కేవైసీ తప్పనిసరి

హెల్త్ ఇన్సూరెన్స్ లేదా ట్రావెల్ లేదా మోటార్ ఇన్సూరెన్స్ పాలసీని జనవరి 1 నుంచి కొనుగోలు చేసేవారు కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం తప్పనిసరి. ఈ మేరకు బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ''గతంలో అయితే క్లెయిమ్ రూ.లక్ష మించినప్పుడే పాన్, ఆధార్ నంబర్ ఇవ్వాల్సి వచ్చేది. **కానీ, ఇప్పుడు హెల్త్, ట్రావెల్, మోటార్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకునే సమయం**లోనే గుర్తింపు ధ్రువీకరణ, చిరునామా ధ్రువీకరణ కోసం పాన్, ఆధార్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్ట్ సమర్పించడం తప్పనిసరి. అన్ని రకాల బీమా ప్లాన్లకు ఈ నిబంధన వర్తిస్తుంది''అని పాలసీబజార్ సీఈవో సర్బ్‌వీర్ సింగ్ తెలిపారు.

బ్యాంక్ పాస్‌బుక్ కాపీ పనికిరాదు

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు సంబంధించి ఇన్వెస్టర్లు కేవైసీ కింద చిరునామా ధ్రువీకరణ కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ లేదా పాస్‌బుక్ కాపీ ఇస్తే గతంలో అనుమతించేవారు. ఇప్పుడు ఇవి చెల్లుబాటు కావు. పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, ఎస్ఆర్ఈజీఏ జాబ్ కార్డ్, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ లెటర్, ఆధార్‌ను సమర్పించొచ్చు. హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల కోసం ఇప్పటికీ బ్యాంకు స్టేట్‌మెంట్ కాపీ ఇవ్వొచ్చు.

ఎన్‌పీఎస్ పాక్షిక ఉపసంహరణలు

కరోనా కారణంగా ఏర్పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఎన్‌పీఎస్ చందాదారులు పాక్షిక ఉపసంహరణకు సంబంధించి నోడల్ ఆఫీసర్ ధ్రువీకరణ తప్పనిసరి నిబంధన నుంచి పీఎఫ్ఆర్‌డీఏ ఉపశమనాన్ని ఇచ్చింది. దీంతో నోడల్ ఆఫీసర్ లేదా పాయింట్ ఆఫ్ ప్రెజెన్స్ నుంచి ఆమోదం అవసరం లేకుండానే ఎన్‌పీఎస్ చందాదారులు పాక్షిక ఉపసంహరణలకు వెసులుబాటు 2021 జనవరి 14 నుంచి అమల్లోకి వచ్చింది. ఇప్పుడు కరోనా దాదాపు స్వల్ప స్థాయికి చేరడం, లాక్‌డౌన్ తదితర నిబంధనలు లేకపోవడంతో తిరిగి పాత నిబంధనను పీఎఫ్ఆర్‌డీఏ అమల్లోకి తీసుకొచ్చింది. కనుక ఈ జనవరి1 నుంచి ఎన్‌పీఎస్ కింద ప్రభుత్వ చందాదారులు గతంలోని నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది.

లాకర్‌పై రుణం



బ్యాంక్ లాకర్‌లో ఆభరణాలతోపాటు విలువైన పత్రాలను పెట్టుకోవడం సహజం. లాకర్ అద్దె చెల్లించడంలో విఫలమైన కస్టమర్లను లాకర్ స్వాధీనం చేయాలని కొన్ని బ్యాంకులు సూచిస్తాయి. లాకర్‌లో ఉన్న బంగారాన్ని తనఖా పెట్టి రుణం తీసుకోవచ్చని బ్యాంక్‌లు కస్టమర్లకు చెబుతుంటాయి. అలా చేస్తే రుణంపై ప్రాసెసింగ్ చార్జీలు, వ్యాల్యూయర్ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. గోల్డ్ లోన్ ఓవర్‌డ్రాఫ్ట్ సుదుపాయంలో.. కావాల్సినప్పుడే రుణ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. వినియోగించుకున్నప్పుడు రుణంపై నామమాత్రపు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. వినియోగించుకోకపోతే లాకర్ చార్జీల కంటే తక్కువే చెల్లిస్తే సరిపోతుంది. కానీ, దీని కంటే కూడా లాకర్‌లో ఉంచిన ఒకటి రెండు ఆభరణాలపై నేరుగా గోల్డ్ లోన్ తీసుకోవడమే నయం. అంతే కానీ, లాకర్ల ఆధారంగా ఇచ్చే గోల్డ్‌లోన్ కు వెళ్లకపోవడమే మంచిదని నిపుణుల సూచన.

సంక్రాంతికి జోయాలుక్కాస్ మెరిసే ఆఫర్లు



హైదరాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా జోయాలుక్కాస్ మెరిసే ఆఫర్లు ప్రకటించింది. ఎంత బరువైన బంగారు ఆభరణాలు కొంటే అంతే సమాన బరువున్న వెండిని బహుమానంగా పొందవచ్చు. రూ.50వేలకు పైగా వజ్రాభరణాలు కొనుగోలు చేస్తే రూ.1000 విలువైన గిఫ్ట్ వోచర్స్ అందిస్తుంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలోని అన్ని జోయాలుక్కాస్ షోరూంల్లో జనవరి ఏడు నుంచి 15 తేదీ వరకు ఈ ఆఫర్ అమల్లో ఉంటుంది. ''సంక్రాంతి సంబరాలను రెట్టింపు చేసుకునేందుకు మేము అద్భుతమైన ఆఫర్లు అందిస్తున్నాము. కస్టమర్లంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి'' అని జోయాలుక్కాస్ గ్రూప్ ఎండీ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

ఈ నెల 11 నుంచి ఆటో ఎక్స్‌పో

75కి పైగా కొత్త కార్ల ఆవిష్కరణలు

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ ఎక్స్‌పో దాదాపు మూడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది మళ్లీ కనువిందు చేయనుంది. జనవరి 11న ప్రారంభం కానుంది. 11–12 తేదీల్లో మీడియాకు, 13–18 వరకు సందర్శకులకు అనుమతి ఉంటుంది. రెండేళ్లకోసారి జరిగే ఆటో ఎక్స్‌పో వాస్తవానికి 2022లో నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కరోనా మహమ్మారి పరిస్థితుల కారణంగా నిర్వహించలేదు. ఈసారి షోలో మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్, కియా ఇండియా, టయోటా కిర్లోస్కర్, ఎంజీ మోటర్ ఇండియా తదితర సంస్థలు పాల్గోనున్నాయి. అలాగే కొత్త అంకుర సంస్థలు .. ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాల సంస్థలు కూడా వీటిలో ఉండబోతున్నాయి. అయిదు అంతర్జాతీయ లాంచింగ్‌లతో పాటు 75 పైచిలుకు కొత్త ఉత్పత్తులను ఇందులో ఆవిష్కరించనున్నారు. 2020 ఎడిషన్‌తో పోలిస్తే ఈసారి అత్యధికంగా 46 వాహన తయారీ కంపెనీలతో పాటు 80 పైగా సంస్థలు పాల్గొంటున్నట్లు ఆటోమొబైల్ తయారీ సంస్థల సమాఖ్య సియామ్ తెలిపింది.

కొన్ని కంపెనీలు దూరం..

ఈసారి ఆటో షోలో కొన్ని సంస్థలు పాల్గొనడం లేదు. మహీంద్రా అండ్ మహీంద్రా, స్కోడా, ఫోక్స్‌వ్యాగన్, నిస్సాన్.. లగ్జరీ కార్ల తయారీ కంపెనీలు మెర్సిడెస్–బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి మొదలైనవి వీటిలో ఉన్నాయి. అటు హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, టీవీఎస్ మోటర్ వంటి ప్రధాన ద్విచక్ర వాహనాల తయారీ సంస్థలు కూడా కేవలం ఫ్లెక్స్ ఫ్యుయల్ ప్రొటోటైప్ వాహనాలకే పరిమితం కానున్నాయి. తమలాంటి లగ్జరీ బ్రాండ్స్‌పై ఆసక్తి ఉండే కస్టమర్లు ఈ తరహా ఆటో ఎక్స్‌పోలకు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటున్నాయని గమనించిన నేపథ్యంలో ఈసారి షోలో పాల్గొనరాదని నిర్ణయించుకున్నట్లు మెర్సిడెస్–బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. దానికి బదులుగా కస్టమర్లకు మరింత మెరుగైన అనుభూతిని అందించడంపై దృష్టి పెడుతున్నట్లు ఆయన వివరించారు. అటు స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ సోల్ప్ కూడా భారత్‌లో కొత్త ఆవిష్కరణలను ప్రవేశపెట్టడంపైనే ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. వేదిక చాలా దూరంగా ఉండటం, వ్యయాలు తడిసి మోపెడవుతుండటం వంటి అంశాలు ఆటో షోలో పాల్గొనడానికి ప్రతికూలాంశాలుగా ఉంటున్నాయని గతంలో పలు ఆటోమొబైల్ తయారీ సంస్థలు తెలిపాయి.



యాక్సిస్ క్రిసిల్ ఐబీఎక్స్ 50:50 గిల్ట్ ఫండ్ ఎన్‌ఎఫ్‌వో

యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ తాజాగా 'క్రిసిల్ ఐబీఎక్స్ 50:50 గిల్ట్ ప్లస్ ఎస్‌డీఎల్ జూన్ 2028 ఇండెక్స్ ఫండ్'ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జనవరి 16 వరకు అందుబాటులో ఉంటుంది. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఈ ఫండ్.. క్రిసిల్ ఐబీఎక్స్ 50:50 గిల్ట్ ప్లస్ ఎస్‌డీఎల్ జూన్ 2028 సూచీలోని డెట్ సాధనాల్లో 95–100 శాతం ఇన్వెస్ట్ చేస్తుంది. మిగతాది డెట్, మనీ మార్కెట్ సాధనాలు (ఏడాది వ్యవధిలోనే మెచ్యూర్ అయ్యే ట్రెజరీ బిల్స్, ప్రభుత్వ సెక్యూరిటీల్లో) పెట్టుబడులు పెడుతుంది. తదనుగుణంగా మెరుగైన రాబడులు అందించేలా ఇది పనిచేస్తుంది. ఇందులో లాకిన్ వ్యవధిలాంటివి ఉండవు కాబట్టి లిక్విడిటీకి సమస్య ఉండదు. తక్కువ డిఫాల్ట్ రిస్కులతో అత్యంత నాణ్యమైన పోర్ట్‌ఫోలియోను కోరుకునే వారికి, మధ్యకాలికం నుంచి దీర్ఘకాలిక పెట్టుబడి సాధనంగా ఇది అనువుగా ఉంటుందని యాక్సిస్ ఏఎంసీ ఎండీ చంద్రేశ్ నిగమ్ తెలిపారు.



స్టాక్స్ వ్యూ

పీఎస్‌పీ ప్రాజెక్ట్స్	ఐడీబీఐ క్యాపిటల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 740 టార్గెట్: రూ. 915

ఎందుకంటే: ప్రస్తుత చైర్మన్ అధ్యక్షతన యుక్తవయసులో ఉన్న పీఎస్‌పీ ప్రాజెక్ట్స్ ద్వితీయస్థాయి యాజమాన్యం క్రమంగా మెరుగుపడుతోంది. వెరసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23)లో రూ. 2,500 కోట్ల ఆర్డర్లరాక అంచనాలపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తోంది. మొత్తం రూ. 4,000 కోట్ల ఆర్డర్లకు బిడ్స్ దాఖలు చేసినట్లు పేర్కొంది. వీటిలో గుజరాత్ ప్రభుత్వం నుంచి రూ. 3,500 కోట్ల విలువైన ఎల్1 ఆర్డర్ ఉన్నట్లు వెల్లడించింది. ఇతర ఆర్డర్లలో జెమ్ అండ్ జ్యువెలరీ రంగం నుంచి రూ. 1,200 కోట్లు, హజీరాలో ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ రూ. 250 కోట్లు, సూరత్ మునిసిపల్ బిల్డింగ్ రూ. 1,100 కోట్లు, చెన్నై ఐటీ పార్క్ రూ. 400 కోట్లు, చెన్నైలోనే హాస్పిటల్ రూ. 200 కోట్లు ఉన్నట్లు వెల్లడించింది. రూ. 600 కోట్ల భివాండి ఆర్డర్ ఆలస్యంపై కోర్టు విచారణ పూర్తయిందని, తీర్పు కోసం వేచిచూస్తున్నట్లు తెలియజేసింది.



రూ. 130 కోట్ల పంఢర్‌పూర్ కాంట్రాక్టుపై యథాతథ స్థితి కొనసాగుతున్నట్లు పేర్కొంది. సూరత్ డైమండ్ ఎక్స్ఛేంజ్(ఎస్‌డీబీ) ఎగ్జిక్యూషన్ నేపథ్యంలో రూ. 2,000 కోట్లకుపైగా విలువైన టెండర్లలో పాల్గొనేందుకు అర్హత సాధించింది. 6.7 మిలియన్ చదరపు అడుగుల నిర్మాణ ప్రాంతంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఆఫీస్ బిల్డింగుగా ఎస్‌డీబీ రికార్డు నెలకొల్పింది. కోవిడ్–19 సవాళ్లలోనూ పీఎస్‌పీ ప్రధాన కాంట్రాక్టరుగా 49 నెలల్లోనే ప్రాజెక్టును పూర్తి చేసింది. ఈ ఏడాది క్యూ2(జూలై–సెప్టెంబర్)లో అంతంతమాత్ర పనితీరు ప్రదర్శించినప్పటికీ ద్వితీయార్థం(అక్టోబర్–మార్చి)లో 35 శాతం ఆదాయ వృద్ధిని అందుకునే వీలుంది.

నారాయణ హృదయాలయ	ప్రభుదాస్ లీలాధర్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 712 టార్గెట్: రూ. 920

ఎందుకంటే: రానున్న రెండేళ్ల(2023–24, 2024–25లో షేరువారీ ఆర్జన(ఈపీఎస్) అంచనాలను వరుసగా 3.7 శాతం, 5.8 శాతం చొప్పున హెచ్చిస్తున్నాం. ఇందుకు ప్రధానంగా హెల్త్‌సిటీలోని యూనిట్ల మెరుగైన లాభదాయకత దోహదపడగలదు. దేశీయంగా నారాయణ హృదయాలయతోపాటు, కేమ్యాన్ ఈ ఆర్థిక సంవత్సరం (2022–23) తొలి అర్ధభాగంలో పటిష్ట పనితీరు చూపాయి. వార్షికంగా 44 శాతం వృద్ధి సాధించాయి. ఇకపైన కూడా ఇదే పురోగతి కొనసాగగలదని భావిస్తున్నాం. కంపెనీ ఏడాదికి రూ. 1,000 కోట్లు చొప్పున పెట్టుబడి వ్యయ ప్రణాళికలు అమలు చేస్తోంది. దీంతో 2023–2024తోపాటు 2025లోనూ విస్తరణ వ్యయాలు కొనసాగించే వీలుంది. వెరసి 2022–25 మధ్య కాలంలో నిర్వహణ లాభం(ఇబిటా) వార్షికంగా 22 శాతం పుంజుకోగలదని అంచనా. పెట్టుబడి వ్యయాలు పెరుగుతున్నప్పటికీ ఆర్‌వోఈ, ఆర్‌వోసీఈ 25 శాతానికి ఎగువనే కొనసాగుతున్నాయి. గత రెండేళ్లుగా కేమ్యాన్ పటిష్ట బిజినెస్‌ను సాధిస్తోంది. టూరిజం తిరిగి ప్రారంభమయ్యాక బిజినెస్ ఊపందుకుంది. 10–12 మిలియన్ డాలర్ల ప్రస్తుత క్వార్టర్లీ ఇబిటా రన్‌రేట్ కొనసాగే అవకాశముంది. కరోనా మహమ్మారి, గ్రామిక కొరత కారణంగా కేమ్యాన్‌లోని కొత్త యూనిట్ ఆలస్యమవుతోంది. 2024–25 నుంచి ఈ యూనిట్ కార్యకలాపాలు ప్రారంభంకావచ్చు. పొరుగున ఉన్న బహమాస్, బెర్ముడాలలోనూ అవకాశాలను కంపెనీ అన్వేషిస్తోంది. దేశీయంగా జోరు చూపుతున్న యూనిట్లలో వాటాలు విక్రయించే యోచనేదీ లేదని కంపెనీ స్పష్టం చేసింది.



మూడేళ్ల కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా దగ్గర కొంత మొత్తం ఉంది. మూడు, నాలుగేళ్ల తర్వాత దీని అవసరం ఉంది. అప్పటి వరకు ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ప్రస్తుతం వడ్డీ రేట్లు గరిష్ట స్థాయిలో ఉన్నందున, ఇక్కడి నుంచి వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు ఉన్నందున లాంగ్‌టర్మ్ బాండ్లలో ఇన్వెస్ట్ చేయడం మంచిదేనా? దీనికంటే మరేదైనా మెరుగైన ఆప్షన్ ఉందా?

– అంకిత్ ముద్రా

వడ్డీ రేట్లు, వీటికి సంబంధించిన సైకిల్ (కాల వ్యవధి) అనేవి ఊహించనివి. పరిస్థితులు, సూక్ష్మ ఆర్థిక అంశాల ఆధారంగా ఇవి మార్పులకు లోనవుతుంటాయి. కరోనా మహమ్మారి రాకతో ఫైనాన్షియల్ మార్కెట్లలో పరిస్థితులను చక్కదిద్దేందుకు 2020 మార్చి–మేలో వడ్డీ రేట్ల కోతను గుర్తుకు తెచ్చుకోండి. ద్రవ్యోల్బణం నియంత్రణకు ఇటీవల వరుసగా చేపట్టిన రేట్ల పెంపులు కూడా ఒక నిదర్శనమే. కచ్చితంగా వడ్డీ రేట్ల సైకిల్‌ను అంచనా వేయడం ఎవరి వల్లా కాదు. ఆ విధమైన అంచనాలతో పోర్ట్‌ఫోలియో ఏర్పాటు చేసుకోవడం రిస్క్ తీసుకోవడమే అవుతుంది. కనుక స్థూల ఆర్థిక అంశాల కంటే మీ పెట్టుబడుల కాలవ్యవధికి అనుగుణమైన సాధనాలపై దృష్టి సారించడమే మంచిది. మూడు నాలుగేళ్ల కోసం ఇన్వెస్ట్ చేసుకునేట్టు అయితే అప్పుడు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే మెరుగైన సాధనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సమయంలో పెట్టుబడికి రక్షణ ఉండాలి. అటువంటప్పుడు షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అనుకూలం. ఈ పథకం కాల వ్యవధి, మీ పెట్టుబడుల కాల వ్యవధికి ఒకే రకంగా ఉంటుంది. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సెక్యూరిటీల్లో (డెట్ సాధనాలు) పెట్టుబడులు పెట్టడం వెనుక ఉద్దేశ్యం స్థిరమైన రాబడులు ఆశించడమే. ఈక్విటీల్లో మాదిరి అస్థిరతలు లేకుండా, పెట్టుబడికి రక్షణ కల్పించుకోవడం. లాంగ్ టర్మ్ బాండ్ ఫండ్స్ చూడ్డానికి ఆకర్షణీయంగా అనిపించొచ్చు. కానీ అవి ఎంతో అస్థిరతలతో ఉంటాయి. దీర్ఘకాలంలో షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో మాదిరే రాబడులను ఇస్తాయి. డెట్ ఫండ్స్ ఎంపిక చేసుకునేప్పుడు అనుసరించాల్సిన సూత్రం మీ పెట్టుబడుల కాల వ్యవధి, ఎంపిక చేసుకునే సాధనం పెట్టుబడుల కాలవ్యవధి ఒకే విధంగా ఉండాలి. ఇక మీ పెట్టుబడుల కాలవ్యవధి మూడు నాలుగేళ్లు కనుక ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌ను కూడా చూడొచ్చు. ఈక్విటీలతో వచ్చే రిస్క్ కొంత ఇందులో ఉంటుంది. ఇవి ఈక్విటీలు, డెట్, ఆర్బిట్రేజ్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. లాంగ్ డ్యురేషన్ ఫండ్స్ కంటే ఎక్కువ రాబడులు ఇస్తాయి. పెట్టుబడుల విధానం దృష్ట్యా, అచ్చమైన ఈక్విటీలతో పోలిస్తే తక్కువ అస్థిరతలతో మెరుగైన రాబడులు ఇస్తాయి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడులకు సరైన తరుణమేనా?, నాకు ఏడాది, రెండున్నరేళ్ల కాలవ్యవధులపై ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. గత రెండేళ్ల కాలంలో వీటిని తీసుకున్నాను. ప్రస్తుతం వడ్డీ రేట్లు పెరిగినందున వాటిని రెన్యువల్ చేసుకోవాలా?

– పేరు రాయలేదు

ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడులతో లాభ, నష్టాలు రెండూ ఉన్నాయి. ముఖ్యంగా పెట్టుబడులకు భద్రత ఉంటుంది. బ్యాంకులో ఎఫ్‌డీ రూపంలో ఉందంటే, విఫలమయ్యే అవకాశాలు చాలా తక్కువ. ప్రతికూలత ఏమిటంటే రేట్లు ఫిక్స్‌డ్‌గా ఉంటాయి. మారుతున్న వడ్డీ రేట్ల ప్రయోజనాలను వీటిల్లో పొందలేరు. ఫిక్స్‌డ్ డిపాజిట్లకు ప్రత్యామ్నాయంగా లిక్విడ్ ఫండ్స్, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అన్నవి మ్యూచువల్ ఫండ్స్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ పథకాలు మెరుగైన రాబడులను ఇస్తాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్ల మాదిరే మెచ్యూరిటీతో ఉంటాయి. ఇప్పుడు చాలా బ్యాంకులు ఏడాది నుంచి మూడేళ్ల కాలవ్యవధి డిపాజిట్లపై 7 శాతం వార్షిక వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నాయి. ఇదే కాల వ్యవధికి సమానమైన షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో ఈల్డ్స్ 7.4 శాతం నుంచి 7.7 శాతం మధ్య ఉన్నాయి. సెంట్రల్ బ్యాంకు వడ్డీ రేట్ల పెంపు వంటి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈల్డ్స్ మారుతుంటాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. మీ శ్లాబు రేటు ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. డెట్ ఫండ్స్‌పై రాబడులు మూలధన లాభాల పన్ను కిందకు వస్తాయి. పెట్టుబడుల కాల వ్యవధి ఏడాది నుంచి మూడేళ్లలోపు అయితే షార్ట్ డ్యురేషన్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ కిందకు రాబడులు వస్తాయి. శ్లాబు రేటు ప్రకారం చెల్లించాలి. మూడేళ్ల కంటే ఎక్కువ కాలం ఇన్వెస్ట్ చేస్తే అప్పుడు దీర్ఘకాల మూలధన లాభాల పన్ను కిందకు వస్తాయి. ద్రవ్యోల్బణ ప్రయోజనాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత లాభంపై 20 శాతం పన్ను చెల్లించాలి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.